www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
ఆదివారం, 25.01.2026

@mudranews
mudratv

సంపుటి:13
సంచిక: 98
పేజీలు: 12
వెల: రూ. 5

## ఇదో విచిత్రమైన ముద్ర

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రైవేట్ ఉద్యోగదాతగా వాల్మార్ట్ గుర్తింపు పొందింది. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 2.1 మిలియన్ ఉద్యోగులు ఉన్నారు. అమెరికాలో మాత్రమే ఇది సుమారు 1.4 మిలియన్ మందికి ఉపాధి కల్పిస్తోంది. ఇది కొన్ని దేశాల జనాభా కంటే ఎక్కువ!




## ఆయన వెనక ఎవరో ఉన్నారు



ఆస్తుల కోసం విషవు రాతలు

సైట్ నిబంధన ఎవ్వడో ఉంది

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

02

## ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం



### అత్యంత దుర్మార్గం

ఇతరుల వ్యక్తిగత జీవితాల్లో తొంగిచూడటం ఏం సంస్కృతి?

సూత్రధారులు, పాత్రధారులు ఎవరో తేల్చిందే

మంత్రి జూపల్లి

03

## షోరూం వద్దే రిజిస్ట్రేషన్స్



రాష్ట్రంలో కొత్త పాలసీ

కార్యాలయాల చుట్టూ తిరుగుడుకు బ్రేక్

హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు

02

# టార్గెట్ ఫిక్స్?

## ఒకరి వెనక మరొకరు




- ఇప్పుడు భట్టి వంతు
- పేర్లు చెప్పకుండానే అగ్గి
- సీఎం, మంత్రుల మధ్య చల్లారని నిప్పు
- తెర వెనక ఉన్నదెవరు..?
- ఆఫ్ ది రికార్డుగా విమర్శలు
- మంత్రులకు కూడా జిల్లాల్లో వ్యతిరేకులు
- సీఎంకు అనుకూలంగా మారుతున్న మంత్రుల వివాదాలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్ర కేబినెట్ లో వివాదాలు చల్లారడం లేదు. ఒకరి వెనక మరొకరు.. ఇలా మంత్రులు ఏదో ఒక అంశంలో సీఎం టార్గెట్ గా విమర్శలు చేస్తూనే ఉన్నారు. ఒక ఇష్యూని బేస్ చేసుకుని తుదకు సీఎం దగ్గరకే విమర్శలు తీసుకువస్తున్నారు. తాజాగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా రోడ్డెక్కారు. ఓ మీడియా సంస్థ అధినేత ముసుగులో సింగరేణి వివాదంపై చివరకు సీఎం రేవంత్ రెడ్డి దగ్గరకే వచ్చారు. అయితే, ఎక్కడా పేరు, హోదా చెప్పకుండానే అందరికీ అర్థమయ్యేలా విమర్శలకు దిగారు. దీంతో తెలంగాణ మంత్రిమండలి చుట్టూ గతంలో ఎన్నడూ లేనంతగా చర్చలు, వివాదాలు జరుగుతున్నాయి. తాజాగా ఒకేసారి ఇద్దరు మంత్రులపై రెండు ప్రముఖ మీడియా సంస్థలు రాసిన కథనాలే కారణంగా సీఎం చుట్టూరా వివాదాలు అల్లుకుంటున్నాయి.

నల్గొండ జిల్లాకు చెందిన మంత్రి అంటూ పేరు ప్రస్తావించకుండా ఆయన వ్యక్తిగత అంశంపై ఓ కథనం ప్రసారం చేయడం.. దానిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి స్పందించడం, ఇటు సదరు టీవీ యాజమాన్యాన్ని కాకుండా విలేఖర్లను పోలీసులు అదుపులోకి తీసుకోవడం.. ఆ వేడి చల్లారక ముందే, ఆ వార్త వెనుక కారణం ఇదే అంటూ ఇంకో మీడియా మరో వార్తతో ముందుకు రావడం సంచలనంగా మారింది. నేరుగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేరు పెట్టి, "ఆయన శాఖలో కాంట్రాక్టుల వ్యవహారం మీద జరిగిన గొడవే ఓ కథనానికి కారణం" అంటూ ఆ పత్రిక రాసింది. దాన్ని ఖండిస్తూ స్వయంగా ప్రెస్‌మీట్ పెట్టిన డిప్యూటీ సీఎం భట్టి.. దీని వెనుక ఎవరున్నారో ఆ పత్రిక యజమానితోనే తేల్చుకుంటానని అన్నారు. తాను వైయస్సార్ మనిషిని కాబట్టే అలా రాసి ఉంటారంటూ కొత్త కోణాన్ని తెరపైకి తెచ్చారాయన. తాజాగా అదే

మిగతా02లో..

## లీకుల టెన్షన్

### సజ్జనార్ చేతికి పగ్గాలు



- ఫోన్ ట్యాపింగ్ పై అంతా అయోమయం
- అరెస్ట్, నోటీసులు అంటూ లీకులు
- ముదురుతున్న ట్యాపింగ్ సెగ: కేసీఆర్‌కు నోటీసులు?
- లీకుల రాజకీయం: కేటీఆర్ ఫైర్
- వ్యవస్థల దుర్వినియోగంపై పరస్పర ఆరోపణలు
- కేసీఆర్ టార్గెట్‌గా విచారణ సాగితే.. ఉద్యమమే!
- విచారణ కంటే అవే ప్రమాదమంటూ ఆందోళన

02

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక మలుపు తిరిగింది. సిట్ విచారణ వేగవంతం కావడంతో మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్ ఇప్పటికే విచారణను ఎదుర్కోగా, తదుపరి నోటీసులు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కేనన్న ప్రచారం రాజకీయ వేడిని పెంచుతోంది. అయితే విచారణ కంటే ముందే బయటకు వస్తున్న 'లీకులు' తమ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నాయంటూ గులాబీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అరెస్టులు, నోటీసుల హెచ్చరికల మధ్య ఈ వివాదం ఇప్పుడు ప్రభుత్వం వర్సెస్ ప్రతిపక్షంగా మారి ఉత్కంఠ రేపుతోంది.

-ముద్ర, తెలంగాణ బ్యూరో

## కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్

# ఉద్యోగులకు షాక్

సమాచారం మాట



- రెగ్యులర్ నియామకాలతో కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఉద్వాసన
- 776 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీపై కీలక నిర్ణయం
- డీఎంఈ సర్క్యులర్ ఆసుపత్రుల్లో వెంటనే రిలీవ్ ఆదేశాలు
- 16,448 మంది కొనసాగింపు అనుమతికి ల్యాబ్ టెక్నీషియన్లు మినహాయింపు
- ఉపాధి కోల్పోతున్న వందలాది మంది... బాధితుల్లో ఆందోళన

03

## కలెక్టర్, పోలీస్ కమిషనర్..

# బుల్లెట్ బండెక్కి



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** స్టేజీ మీదకు ఎక్కి ప్రసంగాలు ఇవ్వడమే కాదు.. స్వయంగా వాహనాలపై భద్రతతో ఎలా ప్రయాణించాలో స్వయంగా చేసి చూపించి ఆదర్శంగా నిలిచారు కరీంనగర్ కలెక్టర్, కరీంనగర్ పోలీస్ కమిషనర్ లు.. 37వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని, "ARRIVE – ALIVE" అవగాహనా కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ ఆధ్వర్యంలో శనివారం నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం స్వయంగా హెల్మెట్ ధరించి ఒకే బైక్ ఎలా భద్రతా నియమాలు పాటిస్తూ వెళ్లాలో చేసి చూపించారు. అందరికీ ఆదర్శంగా నిలిచారు.

06



## ఒత్తిడి చేయవద్దు

ఆర్థిక సాయం త్వరగా అందేలా చూడాలి

చట్టబద్ధమైన వారసులైతే క్లెయిమ్ చేసుకోవాలి

ఇన్సూరెన్స్, పీఎఫ్ విషయంలో 'సుప్రీం' సంచలన తీర్పు

03

## నైనీ రద్దుతో

## అవినీతి తేటతెల్లం

బొగ్గు టెండర్లు ఎందుకు రద్దు చేశారు..?

మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు హరీశ్ రావు

అవినీతి జరగనప్పుడు భయపడ్డారు ఎందుకు..?

03



## అందరి బాగోతాలు బయటపెడతాం



### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- ఫోరెన్సిక్ ఆడిట్‌తో సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో అక్రమాల గుర్తింపు
- త్వరలో 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్
- ధరణి పోర్టల్ లొసుగులతోనే రిజిస్ట్రేషన్‌లలో అక్రమాలు
- 9 జిల్లాల్లో 48 మందిపై క్రిమినల్ కేసులు
- ధరణి పోర్టల్ అక్రమాలపై ఉన్నతస్థాయి కమిటీ నివేదిక

07

## వాట్సాప్ కాల్స్ డేటాపై

## సిట్ ఫోకస్

ప్రభాకర్ రావుకు వచ్చిన ఫోన్ కాల్స్ పై విచారణ

ఇంటర్నెట్ ప్రోటోకాల్ డివైజ్ రికార్డ్స్ కోసం ఇంటర్నెట్ ప్రొవైడర్లతో సంప్రదింపులు

02

Special Investigation Team




2వ పేజీకి.

వాట్సాప్ క
ప్రభాకర్ ర
విచారణ
ఇంటర్నెట్
కోసం ఇం
పులు

ముద్ర, తెల



**ప్రపంచ వింత :**
**చైనా మహా ప్రాకారం**
ఇది శత్రువుల దాడుల నుండి రక్షణ కోసం నిర్మించిన అతిపెద్ద గోడ. దీని పొడవు సుమారు 21,196 కిలోమీటర్లు ఉంటుంది. దీనిని నిర్మించడానికి వందల ఏళ్లు పట్టింది లక్షలాది మంది కార్మికులు పనిచేశారు.ఇది అంతరిక్షం నుండి కూడా కనిపిస్తుందని చెబుతారు (అయితే ఇది పాక్షికంగా మాత్రమే నిజం).ఇది చైనా యొక్క శక్తికి మరియు పట్టుదలకు నిదర్శనం.

# టార్గెట్ ఫిక్స్..?

(మొదటి పేజీ తరువాయి)
మీడియా సంస్థను ఉద్దేశించి.. పెట్టుబడుదారులు, దొంగలు, గద్దలు అంటూ వెనక ఉన్న వారిని హెచ్చరించారు. ఈ విషయంలో విపక్ష నేతలైన హరీష్ రావు, కిషన్ రెడ్డిని డిప్యూటీ సీఎం అభినందించారు. అంతేకాదు.. తాను 40 ఏండ్ల నుంచి నిఖార్సైన రాజకీయం చేస్తున్నానంటూ కొత్తగా పార్టీలో చేరి కీలక పదవుల్లో ఉన్న వారికి పరోక్షంగా చురకలంటించారు.

**ఎవరికి ఎవరు టార్గెట్**
రాష్ట్ర కేబినెట్ లో ఉన్న వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్లే ఎక్కువగా ఉన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి , కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్ బాబు, భట్టి విక్రమార్క వంటి వారు పూర్వం నుంచీ కాంగ్రెస్‌లో ఉంటూ అధిష్టానానికి దగ్గరగా ఉండే మంత్రులు కూడా. వారిపై అప్పుడప్పుడు ఏదో ఒక రూపంలో విమర్శలు వస్తూనే ఉన్నాయి. సివిల్ సప్లైస్ వివాదం ఉత్తమ్ పైనా, హిల్ట్ పాలసీ లీక్ వ్యవహారం శ్రీధర్ పైనా, బొగ్గు ఆరోపణలు భట్టిపైనా, వ్యక్తిగత ఆరోపణలు కోమటిరెడ్డిపైనా వచ్చాయి. కేబినెట్ లో సీనియర్ మంత్రుల విషయంలో సీఎం ఆచితూచి వ్యవహరిస్తున్నారనేది రాష్ట్రంలో రాజకీయ విశ్లేషకుల అంచనా. వారి శాఖలను పూర్తిగా వదిలేయకుండా అధికారుల నుంచి సమాచారం తెప్పించుకుంటూ ఏం జరుగుతుందో తెలుసుకుంటూ అవసరం అనుకున్నప్పుడు సీఎం జోక్యం చేసుకుంటున్నారనేది బహిరంగ విమర్శే. అయితే, కొంతమంది మంత్రుల మీద వచ్చే విమర్శలపై సైలెంట్ గా ఉంటున్నా.. తాజాగా డిప్యూటీ సీఎం స్వయంగా ప్రెస్‌మీట్ పెట్టి, దీని వెనుక ఎవరో ఉన్నారన్నారు. గతంలో దీపాదాస్ మున్షీ మీద, తరువాత మీనాక్షి నటరాజన్ మీద ఒక సెక్షన్ మీడియాలో కథనాలు కూడా వచ్చాయి. ప్రతిపక్షంపై మాట్లాడడం లేదంటూ గతంలో మంత్రుల మీద కూడా విమర్శలు వచ్చాయి.

**పరోక్ష కౌంటర్లు**
ఇటీవల భట్టి చేసిన వ్యాఖ్యలు రాజకీయాల్లో దుమారంగా మారుతున్నాయి. తాను 40 ఏండ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ పట్టుకుని ఉన్నానని, ఎన్ని ఇబ్బందులు వచ్చినా పార్టీని వీడలేదంటూ చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో భట్టికి కౌంటర్ ఇస్తున్నట్లుగా అదే ఖమ్మం జిల్లాలో జరిగిన ఓ సభలో సీఎం రేవంత్ కూడా వ్యాఖ్యానించారు. ఎంతోమంది ఏండ్ల నుంచి పార్టీలో ఉన్న కేవలం 17 ఏండ్ల రాజకీయ అనుభవం ఉన్న తనను సీఎం చేశారంటూ సెటైర్లు వేశారు. అంతేకాదు.. వివాదాలు చుట్టుముట్టుతున్న నేపథ్యంలో తమ మంత్రుల జోలికి రావద్దంటూ సీఎం రేవంత్ రెడ్డి మీడియాను హెచ్చరించారు. ''మంత్రులపై ఏం రాసినా ముందు నన్ను సంప్రదించాలి'' అని ఆయన అన్నారు. అయితే, జూబ్లీహిల్స్, పంచాయతీ ఎన్నికల గెలుపు అధిష్టానం దగ్గర రేవంత్ పరపతిని బాగా పెంచిందని, ఆయనకు తిరుగులేనట్టుగా కనిపిస్తోందని పలువురు విశ్లేషకులు చెబుతున్నారు. ''మొత్తంగా రేవంత్ బలపడుతున్నారు. కానీ కాంగ్రెస్ బలహీనపడుతోంది. అటు కాంగ్రెస్ అధిష్టానానికి ఈ సీనియర్ మంత్రుల కంటే రేవంత్‌తో పని ఎక్కువ ఉంటుంది'' అని తాజా పరిస్థితులను అంచనా వేస్తున్నారు. ''తెలంగాణలో తెలుగుదేశం రాజకీయ ఆత్మహత్య చేసుకుంది. బీఆర్ఎస్‌ది కూడా ఒక రకంగా రాజకీయ ఆత్మహత్యే. ఇటువంటి ఘటనలతో ఇప్పుడు కాంగ్రెస్ కూడా రాజకీయ ఆత్మహత్య చేసుకుంటోంది'' అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

**మంత్రుల చుట్టూ వివాదాలు.. సీఎంకు అదే బలమా..?**
రకరకాల ఆరోపణలు.. రకరకాల వివాదాలు.. రాష్ట్ర మంత్రుల చుట్టూ ఉన్న వివాదాలు సీఎంకు అనుకూలంగా మారుతున్నాయనేది మరో వాదన. జూపల్లి నుంచి ఇప్పుడు భట్టి వరకు.. మంత్రుల చుట్టూ వరుస వివాదాలు కనిపిస్తున్నాయ్. మొన్నటిదాకా మంత్రి కొమటిరెడ్డి వివాదం రాజుకుంటూనే ఉండగా.. ఇప్పుడు ఆ వివాదం కొత్త మలుపు తీసుకుంది. బొగ్గు గనుల వ్యవహారం తెరమీదకు వచ్చింది. మంత్రుల మధ్య విభేదాలకు, లీక్‌లకు కూడా బలమవుతున్నాయి. బొగ్గు బ్లాక్‌ల వ్యవహారమనే గుసగుసలు వినిపించడం.. కథనాలు రావడంపై ఇప్పుడు తెలంగాణలో కొత్త చర్చ మొదలైంది. ఇది అటు తిరిగి.. డిప్యూటీ సీఎం భట్టి టార్గెట్ అయ్యేలా చేసింది. దీంతో ఆయన స్ట్రాంగ్‌గా రియాక్ట్ అయ్యారు. ఆ గనుల కోసం కొత్తగా టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు.

**సీనియర్ ఐఏఎస్ రిజ్వి వర్సెస్ మంత్రి జూపల్లి**
ఇప్పుడు డిప్యూటీ సీఎం మాత్రమే కాదు.. గతంలో మరికొందరు మంత్రుల చుట్టూ ఇలాంటి ఆరోపణలు, వివాదాలే వినిపించాయ్. సీనియర్ ఐఏఎస్ సయ్యద్ అలీ ముర్తజా రిజ్వి, ఎక్సైజ్ శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు మధ్య వివాదం అప్పట్లో రాష్ట్ర రాజకీయాల్లో కాక పుట్టించింది. రిజ్వి తన ఆదేశాలు పట్టించుకోవడం లేదని ఆరోపించిన జూపల్లి.. స్వయంగా ఓ లేఖ రాయడం అప్పట్లో కలకలం రేపింది. ఆ తర్వాత ఈ ఎపిసోడ్‌లో ట్విస్టుల మీద ట్విస్టులు కనిపించాయ్. రిజ్వి వీఆర్ఎస్ ఆమోదించొద్దంటూ సీఎస్‌తో పాటు సీఎంకు జూపల్లి మరో లేఖ రాయడంతో విభేదాలను మరింత బహిర్గతం చేసినట్లు అయింది. ఇక అటు మంత్రి కొండా సురేఖ కూతురు సుస్మిత చేసిన వ్యాఖ్యలు.. ఆ తర్వాత జరిగిన పరిణామాలు హస్తం పార్టీలో కొద్దిరోజుల కింద క్రియేట్ చేసిన తుఫాన్ అంతా ఇంతా కాదు. మాజీ ఓఎస్డీ కోసం టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెళ్లినప్పుడు సురేఖ కూతురు సుస్మిత చేసిన వ్యాఖ్యలు అప్పట్లో కలకలం రేపాయ్. సీఎం రేవంత్, సలహాదారు వేం నరేందర్ రెడ్డి.. తన తల్లిదండ్రులపై కుట్ర చేస్తున్నారంటూ సుస్మిత ఘాటు విమర్శలు చేశారు. కొండా సురేఖ, మురళికి ఏం జరిగినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. దీంతో ఇటు కాంగ్రెస్ పార్టీలో.. అటు అధికారవర్గాల్లో తీవ్ర దుమారం రేగింది. ఈ పరిణామాల మధ్య జరిగిన కేబినెట్ భేటీకి కూడా సురేఖ దూరంగా ఉండడం విభేదాలను మరింత స్ట్రాంగ్ చేసింది. ఆ తర్వాత కొండా సురేఖ స్వయంగా సీఎం రేవంత్ రెడ్డికి క్షమాపణలు చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. దీనికి ముందు మేడారం అభివృద్ధి టెండర్ల విషయంలో వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటికి.. దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ మధ్య వివాదాలతో.. జరిగిన రచ్చ అంతా ఇంతా కాదు. ఇద్దరు మంత్రుల పంచాయితీ ఢిల్లీ హైకమాండ్ వరకు వెళ్లింది.

**పొంగులేటికి విభేదాలు**
ఇక మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలతో.. మంత్రి పొంగులేటికి విభేదాలు ఎప్పటి నుంచో కొనసాగుతున్నాయ్. చివరికి ఓ ప్రభుత్వ భూమి విషయంలో కోర్టులో పిటిషన్ వేసే వరకు వెళ్లింది పంచాయితీ. ఇలా ఒకదాని తర్వాత ఒకరు వివాదాలు తెరమీదకు వస్తుంటే.. ఒకరి తర్వాత ఒకరిపై వరుసగా ఆరోపణలు వినిపిస్తున్నాయ్. కట్ చేస్తే ఎక్కడో పుట్టిన వివాదం.. రకరకాల మలుపులు తిరిగి.. బొగ్గు గనుల వ్యవహారాన్ని తెరపైకి తెచ్చింది. ఈ వ్యవహారంలో డిప్యూటీ సీఎం భట్టి చుట్టూ ఆరోపణలు వినిపించగా.. సీఎం రేవంత్ సీరియస్‌గా రియాక్ట్ అయ్యారు.

**సీఎంకు అనుకూలత..?**
మరోవైపు, వరుస వివాదాలు, ఆరోపణలు.. ప్రతిపక్షానికి ఆయుధంగా మారితే.. అవే సీఎంకు కూడా అనుకూలతను తీసుకువస్తున్నాయనేది మరో వాదన. దీంతో సీఎం రేవంత్ వీటిపై నజర్ పెంచినట్లు తెలుస్తోంది. ప్రతీ వ్యవహారంపై పూర్తిస్థాయిలో ఆరా తీస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇక అటు మంత్రులపై వచ్చే ఆరోపణలకు వివరణ కావాలంటే.. తనను అడగాలంటూ ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీస్తోంది.

**ఇప్పుడు భట్టి వంతు**
రాష్ట్ర క్యాబినెట్ లో మీడియా కథనాల వివాదం మంట పుట్టించింది. నిన్నటివరకు ఎన్టీవీ, ఐఏఎస్, మంత్రి, ముఖ్యమంత్రి చుట్టూ తిరిగిన వివాదంలో తాజాగా డిప్యూటీ సీఎం భట్టీ కూడా ఎంట్రీ ఇచ్చారు. ఓ కథనం మీద సీఎం రేవంత్ పై భట్టీ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. మీడియా అధినేతకు వాళ్లంటే ప్రేమ అని ఎద్దేవా అని పరోక్ష విమర్శ చేశారు. మొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా సీఎం రేవంత్ .. సైకిల్ మోటర్ పై ఎవరో మహిళతో తిరుగుతున్నారని ప్రచారం జరిగిందంటూ పరోక్షంగా ఆరోపణలు చేశారు. ఇప్పుడు అదే వివాదం కొనసాగుతుండగా.. సీన్ లోకి భట్టీ ఎంటరయ్యాడు. తన మీద వస్తున్న ఆరోపణలపై తీవ్రంగా మండిపడ్డారు. తానేం గాలికి వచ్చిన వాడిని కాదని, 40 ఏండ్లుగా సభ బయట, లోపల పోరాటం చేసి వచ్చానని అన్నారు. దీంతో సీఎం రేవంత్ మీద ఇది పరోక్షంగా విమర్శలు చేసినట్లుగా అధికార పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే భట్టి మళ్లీ విమర్శలకు దిగారు. ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారంటూనే సొంత పార్టీ నేతలనే టార్గెట్ చేసినట్లు ఆరోపణలు చేశారు. రాబందులు, దోపిడీదారుల కోసం కథనాలు రాశారంటూ ఎవరిని ఉద్దేశించి మాట్లాడారని చర్చ సాగుతోంది. మీడియా అధినేత వెనుక ఎవరి ప్రయోజనాలు ఉన్నాయంటూ కొందరిని ఉద్దేశించి మాట్లాడినట్లుగా తెలుస్తోంది. సదరు మీడియా అధినేత.. ప్రస్తుత ప్రభుత్వంలోని కీలక నేతతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ప్రచారం నేపథ్యంలో భట్టి వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి.



# భావ ప్రకటనా స్వేచ్ఛలో భాగంగానే పత్రికా స్వేచ్ఛ

- **మీడియా అకాడమీ చైర్మన్ కేఎస్ఆర్**

**హైదరాబాద్:జనవరి24**
రాజ్యాంగంలో పొందుపర్చిన భావ ప్రకటనా స్వేచ్ఛలో భాగంగానే పత్రికా స్వేచ్ఛ ఉంటుందని జర్నలిస్టులు ఈ విషయాన్ని గ్రహించి పత్రికా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ ఆడిటోరియంలో నల్లగొండ జల్లా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు శిక్షణా తరగతులలో భాగంగా ముగింపు సమాశేంలో తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఫోర్త్ ఎస్టేట్ గా గుర్తింపు ఉన్న విలేకరులకు సరైన రక్షణ పొందాల్సిన అవసరం ఉందన్నారు. మీడియాలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మన వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవడం, సాంకేతికతను అందిపుచ్చుకోవడం, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. విలేకరుల బాధ్యతలు, రక్షణ చర్యలు, మొదలగు అంశాలపై అవగాహన కలిగించారు. “నైతిక నియమాలు, మీడియా చట్టాలు” అంశంపై తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి విలేకరులకు అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు తెలంగాణ మీడియా అకాడమీ నుండి సర్టిఫికేట్లను తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# లీకుల టెన్షన్

- **ఫోన్ ట్యాపింగ్ పై అంతా అయోమయం**
- **అరెస్ట్, నోటీసులు అంటూ లీకులు**
- **విచారణ కంటే అవే ప్రమాదమంటూ ఆందోళన**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలను కుదిపేస్తోన్న ఫోన్ ట్యాపింగ్ కేసు ఇప్పుడు అత్యంత కీలక దశకు చేరుకుంది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ నేతృత్వంలో ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణను వేగవంతం చేయడంతో, ఈ వ్యవహారం మాజీ మంత్రుల నుంచి పార్టీ అధినేత వరకు పాకే అవకాశం కనిపిస్తోంది. కేసీఆర్‌కూ నోటీసులు వస్తాయని బీఆర్ఎస్ నేతలు కూడా గట్టిగా భావిస్తున్నారు. అయితే, విచారణలు, నోటీసుల సంగతి ఎలా ఉన్నా.. లీకులతోనే తమకు ప్రమాదంగా మారిందంటూ ఇటు బీఆర్ఎస్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. తాజాగా ఇదే విషయాన్ని కేటీఆర్ కూడా ప్రస్తావించారు. ప్రారంభంలో సాధారణ పోలీసు విచారణగా మొదలైన ఈ కేసు, ఉన్నత స్థాయి వ్యక్తుల ప్రమేయం ఉందన్న అనుమానాలతో సజ్జనార్ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందానికి బదిలీ అయింది. సున్నితమైన కేసులను ఛేదించడంలో, క్లిష్టమైన విచారణలను జరపడంలో సజ్జనార్‌కు ఉన్న ట్రాక్ రికార్డును పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా విచారణ సాగాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. ఉన్నత స్థాయి నాయకులను ప్రశ్నించే సమయంలో ఎదురయ్యే న్యాయపరమైన, పరిపాలనాపరమైన సవాళ్లను ఎదుర్కోవడానికి సిట్ పటిష్టమైన వ్యూహంతో ముందుకు వెళ్తోంది.

**హరీష్, కేటీఆర్ విచారణ**
ఇప్పటికే మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్‌లను సిట్ అధికారులు గంటల తరబడి ప్రశ్నించడం రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ విచారణలు కేవలం ప్రారంభం మాత్రమేనని, త్వరలోనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు కూడా నోటీసులు వెళ్తాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. కేటీఆర్ సైతం తన విచారణ అనంతరం మాట్లాడుతూ, ఈ నోటీసుల పరంపర చివరకు కేసీఆర్ వద్దకే చేరుతుందనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటెలిజెన్స్ విభాగాన్ని రాజకీయ అవసరాల కోసం వాడుకున్నారనే ప్రధాన ఆరోపణను నిరూపించే దిశగా సిట్ అడుగులు వేస్తోంది.

**లీకులు , వ్యక్తిత్వ హననంపై ఆందోళన**
కేసులు, విచారణల కంటే, దర్యాప్తు సంస్థల నుంచి అందుతున్న లీకుల పట్ల బీఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. విచారణ గదిలో ఏం జరుగుతుందో తెలియకముందే, కొన్ని మీడియా సంస్థల్లో తమకు వ్యతిరేకంగా కథనాలు రావడం వెనుక ప్రభుత్వ ప్రమేయం ఉందని వారు ఆరోపిస్తున్నారు. హీరోయిన్ల ఫోన్ ట్యాపింగ్ వంటి సున్నితమైన అంశాలను లీకుల ద్వారా ప్రచారం చేయడం కేవలం తమ వ్యక్తిత్వ హననానికి ఉద్దేశించినదేనని కేటీఆర్ మండిపడ్డారు. ప్రతి ప్రభుత్వంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఉంటుందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం దానిని అక్రమ ట్యాపింగ్‌గా చిత్రించి విచారణ పేరుతో కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ నేతల వాదన. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ అనే అంశాన్ని ఒక పొలిటికల్ నేరేటివ్‌గా మార్చి, తమ పార్టీని మానసికంగా దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని వారు విశ్లేషిస్తున్నారు.

**కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే ఉద్యమం**
తమకు నోటీసులు ఇస్తే సహకరించాం కానీ కేసీఆర్ ను విచారణ పేరుతో వేధిస్తే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. రాజకీయంగా ఈ అంశాన్ని పెద్ద ఇష్యూగా మార్చాలని ప్లాన్ చేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. అంటే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిన తర్వాత తెలంగాణ రాజకీయాలు మరింత ఉత్కంఠగా మారనున్నాయి.



# తిరుగుడుకు బ్రేక్.. ఇక షోరూం వద్దే రిజిస్ట్రేషన్స్

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
రాష్ట్రంలో కొత్త వాహనాల కొనుగోలుదారులకు ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. ఇకపై ద్విచక్ర వాహనాలు, వ్యక్తిగత కార్ల రిజిస్ట్రేషన్‌ను నేరుగా షోరూమ్‌లలోనే పూర్తి చేసే విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో ఆర్టీఓ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పోయింది. డీలర్లు అవసరమైన పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయగా, అధికారులు పరిశీలించి వెంటనే రిజిస్ట్రేషన్ నంబర్ కేటాయిస్తారు. శాశ్వత ఆర్‌సీ స్పీడ్‌పోస్ట్ ద్వారా యజమాని ఇంటికే చేరుతుంది. ఈ సౌకర్యం వాణిజ్య వాహనాలకు వర్తించదు. శనివారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానం అమలులోకి వచ్చింది.

# వాట్సాప్ కాల్స్ డేటాపై సిట్ ఫోకస్




- **ప్రభాకర్ రావుకు వచ్చిన ఫోన్ కాల్స్ పై విచారణ**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తు మరింత వేగం పుంజుకుంది. తాజాగా వాట్సాప్ కాల్స్ డేటాపై ఫోకస్ పెట్టిన సిట్ అధికారులు, 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో జరిగిన కమ్యూనికేషన్‌పై లోతైన విచారణ చేపట్టినట్లు సమాచారం. ఈ క్రమంలో సుమారు 600 ఫోన్ నంబర్లకు సంబంధించిన వాట్సాప్ కాల్స్‌పై నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం మొత్తం ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కనుసన్నల్లోనే జరిగిందని సిట్ భావిస్తున్నది. ప్రభాకర్ రావు ఎవరెవరితో మాట్లాడారు, అందులో రాజకీయ నేతలు ఎవరు ఉన్నారనే అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఇందుకోసం ఇంటర్నెట్ ప్రోటోకాల్ డివైజ్ రికార్డ్స్ కోసం ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లను సిట్ సంప్రదిస్తోంది. ఇదిలా ఉండగా ఇప్పటికే హరీశ్‌రావు, కేటీఆర్‌లను విచారించిన సిట్ అవసరమైతే మళ్లీ పిలుస్తామని తెలిపింది. సిట్ దర్యాప్తు అగ్రనేతల దాకా చేరుతుందన్న సంకేతాలతో బీఆర్ఎస్ వర్గాల్లో ఆందోళన నెలకొంది. మరోవైపు తప్పు చేయకుంటే భయం ఎందుకని కాంగ్రెస్ నేతలు కౌంటర్లు ఇస్తున్నారు.

# ఆయన వెనక ఎవరో ఉన్నారు

- **ఆస్తుల కోసం విషపు రాతలు**
- **సైట్ నిబంధన ఎప్పుడో ఉంది**
- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
సింగరేణి టెండర్ల వివాదంపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. విమర్శలకు కారణమైన ‘సైట్ విజిట్’ నిబంధన తమ ప్రభుత్వం తెచ్చింది కాదని, 2018లోనే కోల్ ఇండియా దీనిని ప్రవేశపెట్టిందని ఆధారాలతో సహా బయటపెట్టారు. 2021లో ఈ నిబంధనలు ఖరారైనప్పుడు తాము అధికారంలోనే లేమని, కావాలనే కొందరు రాబందుల్లా సంస్థ ఆస్తుల కోసం తప్పుడు రాతలు రాస్తున్నారని మండిపడ్డారు. ప్రజల్లో అపోహలు ఉండకూడదనే ఉద్దేశంతోనే నైనీ కోల్ బ్లాక్ టెండర్లను రద్దు చేశామని.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విచారణ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని తెలిపారు. దీనివల్ల అసలు దోషులు ఎవరో తేలుతుందని భట్టి స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ పరువును బజారుకీడ్చేలా జరుగుతున్న దుష్ప్రచారాలపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పక్కా ప్రణాళిక ప్రకారమే కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం సంస్థపై విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వాస్తవాలను వెల్లడించారు. సింగరేణి టెండర్లలో ‘సైట్ విజిట్’ అనే నిబంధనను ఏదో కొత్తగా చేర్చినట్లు కొన్ని పత్రికలు, సోషల్ మీడియాలో కథనాలు రావడంపై భట్టి స్పష్టత ఇచ్చారు. ఈ నిబంధన వెనుక ఉన్న నిజాలను తెలిపారు. సైట్ విజిట్ నిబంధనను కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన కోల్ ఇండియా 2018లోనే తన టెండర్ పత్రాలలో పొందుపరిచింది. 2021లో సెంట్రల్ మైనింగ్ కూడా సైట్ విజిట్ తప్పనిసరి అని పేర్కొంది. ఆ సమయంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో లేదు. కేవలం సింగరేణిలోనే కాదు.. గుజరాత్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, రైల్వేస్‌కు చెందిన 'రైట్స్', హిందుస్థాన్ కాపర్స్ వంటి కేంద్ర సంస్థల టెండర్లలోనూ ఈ



నిబంధన అమల్లో ఉంది.సింగరేణి అనేది తెలంగాణకు గుండెకాయ వంటిదని.. సుమారు 42 వేల మంది శాశ్వత ఉద్యోగులు, 30 వేల మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది జీవనోపాధి దీనిపై ఆధారపడి ఉందని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. అక్రమ రాతల వల్ల కార్మికుల మనోస్థైర్యం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి ఒక స్వయంప్రతిపత్తి సంస్థ అని.. ఇక్కడ జరిగే ప్రతి నిర్ణయం మంత్రిమండలి వద్దకు రాదని ఆయన స్పష్టం చేశారు. అయినప్పటికీ.. ప్రజల్లో అపోహలు కలగకూడదనే ఉద్దేశంతో నైనీ కోల్ బ్లాక్ టెండర్లను వెంటనే రద్దు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

**విచారణను స్వాగతిస్తున్నాం..**
ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ నాయకుడు హరీశ్ రావు లేఖ రాయడం, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విచారణకు ఆదేశించడాన్ని తాము స్వాగతిస్తున్నామని భట్టి పేర్కొన్నారు. విచారణ జరిగితేనే అసలు నిజాలు బయటకు వస్తాయని.. ఎవరు ఎవరి ప్రయోజనాల కోసం ఇలాంటి కథనాలు వండివారుస్తున్నారో ప్రజలకు తెలుస్తుందని అన్నారు. సింగరేణి ఆస్తులను రాబందుల నుండి కాపాడే బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందన్నారు. రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వానికి, రాష్ట్రానికి నష్టం చేసేలా ప్రవర్తించడం సరికాదని విపక్షాలకు హితవు పలికారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
25.01.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





**ప్రపంచ వింత : ఎర్రటి రాళ్లను తొలిచి నిర్మించిన నగరం పెట్రా**

జోర్డాన్ దేశంలో ఉన్న ఈ నగరం ఎర్రటి రాళ్లను తొలిచి నిర్మించబడింది.దీనిని "రోజ్ సిటీ" అని కూడా పిలుస్తారు. ఇక్కడి నీటి నిర్వహణ వ్యవస్థ ఆ కాలంలోనే ఎంతో అద్భుతంగా ఉండేది.ఇది ప్రాచీన కాలంలో ఒక ముఖ్యమైన వ్యాపార కేంద్రంగా విలసిల్లింది.కొండలను కోసి చెక్కిన శిల్పకళ ప్రపంచ పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తుంది.

# ఆస్పత్రుల నుంచి 'ఔట్'

- **ల్యాబ్ టెక్నీషియన్ల సేవలు నిలిపివేత**
- **రెగ్యులర్ పద్ధతిలో పోస్టుల భర్తీ**
- **వివరాలు వెల్లడించిన డీఎంఈ నరేంద్ర కుమార్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



తెలంగాణ ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రులలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ల్యాబ్ టెక్నీషియన్ల సేవలను నిలిపివేస్తున్నట్లు వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ) ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 776 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను ఎంహెచ్ఎస్ ఆర్బీ ద్వారా ప్రభుత్వం ఇటీవల రెగ్యులర్ పద్ధతిలో భర్తీ చేసింది. కొత్తగా ఎంపికైన రెగ్యులర్ ఉద్యోగులు విధుల్లో చేరడంతో, ఆ స్థానాల్లో ఉన్న తాత్కాలిక సిబ్బందిని వెంటనే తొలగించాలని ప్రిన్సిపాల్స్, సూపరింటెండెంట్లను ఆదేశించారు. గతంలో 16,448 మంది కాంట్రాక్ట్ సిబ్బందిని కొనసాగించాలని అనుమతించినప్పటికీ, రెగ్యులర్ నియామకాలు పూర్తయినందున ల్యాబ్ టెక్నీషియన్లకు ఆ నిబంధన వర్తించదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, అనుబంధ ఆసుపత్రుల్లో దీర్ఘకాలంగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ల సేవలను నిలిపివేస్తూ వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ నరేంద్ర కుమార్ అధికారిక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 776 ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్2 పోస్టులను ప్రభుత్వం ఇటీవల మెడికల్ హెల్త్ సర్వీసెస్ రెక్రూట్‌మెంట్ బోర్డ్ ద్వారా భర్తీ చేసింది. ఈ ఎంపిక ప్రక్రియ పూర్తయి.. కొత్తగా ఎన్నికైన రెగ్యులర్ ఉద్యోగులకు నియామక పత్రాలు కూడా అందజేశారు. నిబంధనల ప్రకారం.. ఒక పోస్టులో రెగ్యులర్ ఉద్యోగి నియమితులైనప్పుడు.. ఆ స్థానంలో తాత్కాలికంగా పనిచేస్తున్న వారిని తొలగించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం కొనసాగుతున్న కాంట్రాక్ట్ సిబ్బందిని విధుల నుంచి తక్షణమే తప్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంపై డీఎంఈ కార్యాలయం శుక్రవారం అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రిన్సిపాల్స్, ఆసుపత్రి సూపరింటెండెంట్లకు ఒక సర్క్యులర్ పంపింది. కొత్తగా చేరిన రెగ్యులర్ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించి.. ఆ స్థానాల్లో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రిలీవ్ చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియపై తీసుకున్న చర్యలను వివరిస్తూ తక్షణమే నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. వాస్తవానికి.. 2025 ఏప్రిల్ 1 నుండి 2026 మార్చి 31 వరకు ఒక ఏడాది కాలానికి వివిధ విభాగాల్లో మొత్తం 16,448 మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని కొనసాగించేందుకు ప్రభుత్వం గతంలో అనుమతి ఇచ్చింది. ఇందులో ల్యాబ్ టెక్నీషియన్ కేటగిరీ కింద పని చేసేవారు కూడా ఉన్నారు. తాజాగా రెగ్యులర్ ఉద్యోగాలను భర్తీ చేయడంతో.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేసే ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగులు ఇక నుంచి పని చేయడానికి వీలు లేకుండా అయిపోయింది. దీంతో వారి సేవలు నిలిపి వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది ల్యాబ్ టెక్నీషియన్లు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. దీనిపై బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# డీల్ కుదిరే వరకు డ్రామాలే..

- **కేటీఆర్ విచారణే దీనికి నిదర్శనం**
- **ఫోన్ ట్యాపింగ్ విచారణతో రాష్ట్ర ప్రభుత్వం అభాసుపాలు**
- **కేంద్ర మంత్రి బండి సంజయ్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్ ఫోన్ ట్యాపింగ్ అంశంలో కేసీఆర్ ఫాం హౌస్‌కు, ఏఐసీసీకి మధ్య డీల్ కుదిరే వరకు విచారణ పేరుతో డ్రామాలు కొనసాగిస్తుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌తో అందరి కొంపలు ముంచిన కేటీఆర్‌ను సాక్షిగా విచారణకు పిలిచిన సిట్ ఆయన నుంచి వాంగ్మూలం తీసుకోవడమే విడ్డూరంగా ఉందన్నారు. ఫోన్ ట్యాపింగ్ విచారణను చూసి రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. ఆయన విచారణ పేరుతో చేస్తున్న డ్రామాలతో రాష్ట్ర ప్రభుత్వం అభాసుపాలవుతోందని ఎద్దేవా చేశారు. శనివారం హైదరాబాద్ లోని హకీంపేటలో ఆయన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణపై మీడియాతో మాట్లాడారు. సమర్థవంతమైన, నిజాయితీ వంతులైన అధికారులు సిట్‌లో ఉన్నారని చెప్పారు. వారిని స్వేచ్ఛగా పని చేయనీయకుండా రాష్ట్ర ప్రభుత్వం అజమాయిషీ చేస్తుందని ఆరోపించారు. తాము చెప్పినట్లుగా విచారణ జరగాలని అధికారులపై బెదిరింపులకు పాల్పడుతోందని చెప్పారు. ఉద్యోగాలు భర్తీకి నోచుకోక నిరుద్యోగులు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బండి సంజయ్ విమర్శించారు. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి, కేంద్రం నిర్వహిస్తున్న ఉద్యోగాల భర్తీకి ఉన్న తేడాను గమనించాలని కోరారు. టీజీపీఎస్సీ అంటేనే లీకేజీలు, పైరవీలు, కోర్టు కేసులన్నారు. ఆందోళనలు, ధర్నాలతో ఏళ్ల తరబడి పరీక్షలు, నియామకాలు సాగుతున్నాయని వ్యాఖ్యానించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఒక్క పైరవీకి, అవినీతికి, లీకేజీలకు ఆస్కారం లేకుండా జాబ్ క్యాలెండర్ ఇచ్చి క్రమం తప్పకుండా ఉద్యోగాలను భర్తీ చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేసినా చేయకపోయినా నిరుద్యోగులెవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని బండి సంజయ్ నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం క్రమం తప్పకుండా ఉద్యోగాలు భర్తీ చేయడంతో పాటు స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, మేకిన్ ఇండియా వంటి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. దీంతో నిరుద్యోగులు తమ కాళ్లపై తాము నిలబడుతూ పది మందికి ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదుగుతున్నారని బండి సంజయ్ పేర్కొన్నారు.



# స్టార్టప్ కేంద్రంగా టీహబ్

**అమెరికా నుంచి సీఎస్ కు సీఎం రేవంత్ రెడ్డి ఫోన్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

టీహబ్‌ను స్టార్టప్‌ల కేంద్రంగా కొనసాగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను టీహబ్‌కు మార్చుతున్నట్లు వస్తున్న వార్తలపై సీఎం శనివారం స్పందించారు. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో ఫోన్‌లో మాట్లాడారు. అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను అందుబాటులో ఉన్న ఇతర ప్రభుత్వ భవనాలకు మార్చాలని సూచించారు. టీహబ్‌ను ప్రత్యేకంగా స్టార్టప్‌ల కేంద్రంగానే గుర్తించాలని చెప్పారు. ఇంక్యుబేటర్‌గా, ఇన్నోవేషన్ క్యాటలిస్ట్‌గా స్టార్టప్‌లకు కేంద్రంగా ఏర్పాటు చేసిన టీహబ్‌లో ఇతర కార్యాలయాలు ఉండకూడదని, అలాంటి ఆలోచనలు ఉంటే విరమించుకోవాలని ఆదేశించారు.

# నీచమైన రాజకీయాలు

- **'ఫోన్ ట్యాపింగ్' అత్యంత దుర్మార్గం**
- **వ్యక్తిగత జీవితాల్లో తొంగిచూడటం ఏ సంస్కృతి?**
- **సూత్రధారులు, పాత్రధారులు ఎవరో తేలాల్సిందే..**
- **ప్రజల గోప్యతను తుంగలో తొక్కిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే**
- **మంత్రి జూపల్లి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన అప్రజాస్వామిక విధానాలపై పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం ప్రజా భవన్ లో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో ప్రభుత్వాలను చూశానని, కానీ ఫోన్ ట్యాపింగ్ వంటి నీచమైన రాజకీయాలను కేవలం కేసీఆర్ హయాంలోనే చూశామని మంత్రి జూపల్లి విమర్శించారు. 2021 నుండి తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు వెల్లువెత్తాయని, మాజీ గవర్నర్ తమిళిసై, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి, ఈటల రాజేందర్, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ వంటి వారిపై నిఘా పెట్టారనే అనుమానాలను వారు గతంలో వ్యక్తం చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని ఆయన అన్నారు. పోలీసు, ఇంటెలిజెన్స్ వంటి వ్యవస్థలను సొంత పార్టీ నేతలను, ప్రతిపక్ష పార్టీ నేతలను, వ్యాపారవేత్తలను బ్లాక్ మెయిల్ చేయడానికి వాడుకోవడం బీఆర్ఎస్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో అర్ధరాత్రి తలుపులు బద్దలు కొట్టి, ప్రొఫెసర్ కోదండరాం వంటి వారిని అక్రమంగా అరెస్ట్ చేసినప్పుడు మీ రాజకీయ విలువలు ఏమయ్యాయని మంత్రి నిలదీశారు. తాము అధికారంలోకి వచ్చాక కక్ష సాధింపులకు దిగలేదని, ఒకవేళ అదే తమ ఉద్దేశమైతే ఎప్పుడో జైలుకు పంపేవాళ్లమని, తాము చట్టాన్ని గౌరవిస్తున్నామని అన్నారు. కేవలం సాక్షిగా సమాచారం అడిగే సీఆర్పీసీ 160 నోటీసు ఇస్తేనే ఇంతలా భయపడిపోవాలా? అని ఆయన ప్రశ్నించారు. సాక్షిగా సిట్ విచారణకు పిలిస్తే, కేటీఆర్ ఎందుకు అంతలా ఆందోళన చెందుతున్నారని మంత్రి ప్రశ్నించారు. గతంలో ఏ విచారణకైనా సిద్ధం అని ప్రగల్భాలు పలికిన కేటీఆర్, ఇప్పుడు నోటీసులు రాగానే డ్రామాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో సంబంధం లేకపోతే, నిర్దోషులైతే భయపడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం అత్యంత దుర్మార్గమని, ఇతరుల వ్యక్తిగత జీవితాల్లో తొంగి చూడటం ఏ సంస్కృతిని సూచిస్తుందో బీఆర్ఎస్ నేతలు ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. ఈ వ్యవహారంలో సూత్రధారులు, పాత్రధారులు ఎవరో సిట్ దర్యాప్తులో తేలాల్సి ఉందని, నిజాలు బయటకు రావడం ఖాయమని చెప్పారు. రాజకీయ నాయకులు చట్టానికి అతీతులు కాదని, తప్పు చేసిన వారు ఏ పార్టీ వారైనా శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు. ఈ విచారణలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన వారిని కూడా సాక్షులుగా పిలుస్తున్నారని, కేవలం బీఆర్ఎస్ నేతలనే టార్గెట్ చేస్తున్నట్లు మాట్లాడటం సరికాదన్నారు.చట్టబద్ధ సంస్థలపై బురద జల్లే ప్రయత్నాలను ప్రభుత్వం సహించదని హెచ్చరించారు. అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు చేసిన వారు ఏ పార్టీ వారైనా సరే శిక్ష అనుభవించాల్సిందేనని తేల్చి చెప్పారు. మిగులు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి, అవినీతి, కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని చిన్నా భిన్నం చేసిన బీఆర్ఎస్ నేతలను ప్రజలు ఎప్పుడో విస్మరించారని మంత్రి అన్నారు. ఇప్పటికైనా కేటీఆర్, హరీష్ రావు తమపై పడ్డ బట్ట కాల్చి ఇతరుల మీద వేసే పనులు మానుకోవాలని హితవు పలికారు.

# ఒత్తిడి చేయవద్దు..

- **ఆర్థిక సాయం త్వరగా అందేలా చూడాలి**
- **చట్టబద్ధమైన వారసులైతే క్లయిమ్ చేసుకోవాలి**
- **ఇన్సూరెన్స్, పీఎఫ్ విషయంలో 'సుప్రీం' సంచలన తీర్పు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



చనిపోయిన వ్యక్తికి సంబంధించిన ప్రావిడెంట్ ఫండ్ ఇన్సూరెన్స్, ఇతర బ్యాంకు బకాయిలను పొందేందుకు నామినీలు ఇకపై కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. 'యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ పరేష్ చంద్ర మండల్' కేసు విచారణ సందర్భంగా జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ కె.వి. విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం శనివారం ఈ తీర్పు వెలువరించింది. ఈ పిటిషన్ పై పూర్తి వాదనలు విన్న తర్వాత.. నామినీ వివరాలు స్పష్టంగా ఉన్నప్పుడు, ప్రభుత్వ శాఖలు, బ్యాంకులు కచ్చితంగా "సక్సెషన్ సర్టిఫికెట్ సమర్పించాలని ఒత్తిడి చేయకూడదని కోర్టు ఆదేశించింది. నామినేషన్ ప్రక్రియ ముఖ్య ఉద్దేశమే కుటుంబానికి ఆర్థిక సహాయం త్వరగా అందేలా చూడటమని, కోర్టు సర్టిఫికేట్లు (వారసత్వ ధృవీకరణ పత్రం) అడగడంతో ఆ ఉద్దేశమే దెబ్బతింటుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అయితే, నామినీకి డబ్బులు అందినంత మాత్రాన వారే పూర్తి యజమానికారని తెలిపింది. ఇతర చట్టబద్ధమైన వారసులు ఎవరైనా ఉంటే వారు తమ వాటా కోసం నామినీపై సివిల్ కోర్టులో క్లెయిమ్ చేసుకోవచ్చని కోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వ బాధ్యత కేవలం నామినీకి నిధులు విడుదల చేయడమేనని, ఆ తర్వాత వారసత్వ వివాదాలు ఉంటే అవి సివిల్ చట్టాల ప్రకారం తేల్చుకోవాలని సుప్రీంకోర్టు వివరించింది.

**వివరాలు..**

ఈ తీర్పుతో నామినీ పేరు ఉంటే బ్యాంకులు.. ఇన్సూరెన్స్ కంపెనీలు సక్సెషన్ సర్టిఫికెట్ అడగలేవు.

కోర్టు నిర్ణయంతో మరణించిన వారి ఆశ్రితులకు డబ్బులు త్వరగా అందుతాయి.

డబ్బులు నామినీకి అందకపోయినా, చట్టబద్ధమైన వారసులకు వాటి పై హక్కు ఉంటుంది.

# అవినీతే జరగనప్పుడు.. 'నైనీ ' రద్దు దేనికీ?

- **సైట్ విజిట్ అమలు అంటే అవినీతి జరిగినట్టే**
- **మజీ మంత్రి హరీశ్ రావు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



ఒడిశాలోని నైనీ బొగ్గు టెండర్ల విషయంలో అవినీతే జరగనప్పుడు.. వాటిని రద్దు చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని మాజీ మంత్రి హరీశ్ రావు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ప్రశ్నించారు. సైట్ విజిట్ అమలు. నైనీ రద్దు అంటే.. అవినీతి జరిగినట్టే అన్నారు. నైనీని రద్దు చేసినట్లే మిగతా అన్ని టెండర్లను ఎందుకు రద్దు చేయలేదని నిలదీశారు. శనివారం మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలకు ఆయన ఎక్స్ వేదికగా కౌంటర్ చేశారు. మీరెన్ని సాకులు చెప్పినా మీ పాలనలో బొగ్గు కుంభకోణం జరిగిందనే విషయం నిజం అన్నారు.. అందులో రేవంత్ రెడ్డి బామ్మర్ది రింగ్ మెన్ గా పాత్ర పోషించారని చెప్పారు. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తిపై విచారణ జరగాలంటే సిట్టింగ్ జడ్జీ లేదా కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సీబీఐ మాత్రమే చేయగలవు అన్న ఉద్దేశ్యంతోనే లేఖ రాశానని హరీశ్ రావు చెప్పారు. మీరు నిజంగా రేవంత్ రెడ్డి, అతని బావమరిది కుంభకోణం మీద నిష్పక్షపాతంగా విచారణ జరిపిస్తానని హామీ ఇస్తే మీకూ లేఖ రాయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. ఈ నెల 23న తాను బయటపెట్టిన మరో కుంభకోణం.. సోలార్ పవర్ స్కాం గురించి ఎందుకు ఒక్క మాట కూడా ప్రెస్ మీట్ లో మాట్లాడలేదన్నారు. బొగ్గు కుంభకోణంలో అవినీతి జరగలేదని చెప్పకుండా 'బీటింగ్ అరౌండ్ ద బుష్' లా ఏదో చెప్పి మసిబూసి మారేడు కాయ చేశారని విమర్శించారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధనను బీఆర్ఎస్ మీద నెట్టే ప్రయత్నం చేస్తే నిజాలు అబద్ధాలు అయిపోవనీ, జరిగిన స్కాములు, స్కీములుగా మారిపోవని వ్యాఖ్యానించారు. సైట్ విజిట్ నిబంధనను 2018లోనే మొదలైందని చెప్పి, దానికి కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఉదాహరణలుగా చెప్పి ఏం చెప్పదలుచుకున్నారని ? హరీశ్ రావు ప్రశ్నించారు. అది తప్పు కాకుంటే నైనీ ఎందుకు రద్దు చేశారని నిలదీశారు. ఇదే సైట్ విజిట్ విధానం సింగరేణిలో కూడా అమలు చేశామని ఇప్పటికైనా ఒప్పుకున్నందుకు సంతోషమన్నారు.

# గైర్హాజరైతే ఇంటికే...!

- **ప్రభుత్వ ఉద్యోగులకు షాక్**
- **నిబంధనల్లో కీలక మార్పులు**
- **జీవో 9లో సవరణలు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన నిబంధనల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. అందులో భాగంగా సివిల్ సర్వీసెస్ రూల్స్‌లో తెలంగాణ ప్రభుత్వం కీలక సవరణలు చేసింది. దాని ప్రకారం ఏడాదికి పైగా అనధికారికంగా గైర్హాజరైతే.. ఉద్యోగం కోల్పోయే ప్రమాదం ఉంది. ఇక ఐదేళ్లకు పైగా కంటిన్యూగా గైర్హాజరైతే సర్వీస్ నుంచి తొలగించనున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల నిబంధనల్లోని 'సివిల్ సర్వీసెస్ రూల్స్'లో.. రూల్ 9, రూల్ 25కి సర్కార్ సవరణలు చేసింది. సవరించిన నిబంధనల ప్రకారం ఏడాదికి పైగా అనధికార గైర్హాజరు అయితే ఉద్యోగం కోల్పోయే ప్రమాదం ఉంది. అంతేకాకుండా ఐదేళ్లకు మించి నిరంతరంగా గైర్హాజరు అయితే.. సేవల నుంచి తొలగిస్తారు. ఇక, ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశాలకు టూర్ వెళ్లినా చర్యలు తీసుకునే విధంగా మార్పులు చేసింది. అయితే, ఇలాంటి చర్యలు తీసుకునే ముందు సదరు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం తప్పనిసరి అని ప్రభుత్వం పేర్కొంది.

**డీఏ జీవో జారీ**

కాగా, సంక్రాంతి పండుగకు సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పెంచుతున్నట్లు ప్రకటించింది. ఇటీవల సచివాలయంలో ఉద్యోగ సంఘాల డైరీని ఆవిష్కరించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రకటన చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. చాలా కాలంగా ఎదురుచూస్తున్న కరువు భత్యం ఫైలుపై సంతకం చేసినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. అయితే దీని వల్ల ప్రభుత్వ ఖజానాపై ప్రతి నెలా రూ. 227 కోట్ల అదనపు భారం పడనుందని.. అయినప్పటికీ ఉద్యోగుల మొహంలో చిరునవ్వు చూడాలనే ఉద్దేశంతోనే ఈ అడుగు వేసినట్లు చెప్పారు. కాగా, 30.03 శాతం నుంచి 33.67 శాతానికి డీఏ సవరణ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం జీవో జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం ఇటీవల తెలంగాణ ప్రభుత్వం కీలక




నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వంలో పని చేస్తున్న సుమారు 5.14 లక్షల మంది శాశ్వత (పర్మినెంట్) ఉద్యోగులందరికీ.. రూ. 1.02 కోట్ల విలువైన ఉచిత ప్రమాద బీమా పథకాన్ని అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా.. ఈ బీమా పథకాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి రాష్ట్రంలోని ప్రముఖ బ్యాంకింగ్ సంస్థలతో ప్రభుత్వం ఇప్పటికే సంప్రదింపులు జరిపిందని ఆయన వివరించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv



మీ ముద్ర వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## ఆడపిల్లను చదివిద్దాం



ఆడపిల్లను చదివిద్దాం
ప్రగతిని సాధిద్దాం

ఆడపిల్లను బతుక నిద్దాం
ఆడపిల్లను చదువనిద్దాం
ఆడపిల్లను ఎదగనిద్దాం
ఆడపిల్ల చదువే సమాజానికి
వెలుగు దివ్వె ఆడపిల్లను చదివిద్దాం
ప్రపంచాన్ని జయిద్ధాం

ఆడపిల్ల అడుగులో ఉంది
అలుపెరుగని ప్రగతి
ఆడపిల్ల ఆలోచనల్లో ఉంది
ఉజ్వల భవిష్యత్తు

బాలికల పట్ల వివక్ష వద్దు
మహిళా సాధికారితే హద్దు
లింగ వివక్షను అడ్డుకుందాం
భ్రూణ హత్యలు నిరోధిద్ధాం
బాల్య వివాహాలు లైంగిక
వేదింపులు గృహ హింస
నుండి విముక్తి కల్పిద్ధాం

అక్రమ రవాణా లైంగిక వివక్ష
బాల కార్మికవ్యవస్థ నిర్మూలన
బాలికల సంక్షేమంతో లింగ
సమానత్వాన్ని సాధించాలి

విద్యాభివృద్ధిలో ఆడపిల్ల
సామాజిక భాగస్వామ్యాన్ని
పెంచాలి బాలికల భద్రత
బాలురుతో పాటు బాలికలకు
సమాన హక్కులు స్వేచ్ఛ
రక్షణ కల్పించాలి

ఆడపిల్ల విద్యతో వెలిగిపోతూ
రేపటి ప్రపంచాన్ని నిర్మిస్తుంది
బాలికా రక్షణే దేశ రక్షణ
బాలిక శక్తి దేశ ప్రగతికిశక్తి

ఆడపిల్ల అంటే 'ఆడపిల్లనే'
సంస్కృతివద్దు అన్ని రంగాల్లో
ప్రోత్సాహించడమే హద్దు

ఆడపిల్లల మనుగడే
మానవ మనుగడ
అభివృద్ధిలో ఆడపిల్లల
భాగస్వామ్యాన్ని
ప్రోత్సహిద్దాం
సామాజిక ఆర్థిక లింగ
అసమానతలు తొలగిద్దాం
ఆడపిల్లలను రక్షిద్దాం

భ్రూణ హత్యలు బాల్య వివాహాలు
గృహహింస శారీరక మానసిక
వేదింపుల నుండి ఆడపిల్లలకు
భద్రత కల్పించాలి

లింగ సమానత్వానికై ఉద్యమిద్దాం
మహిళావిద్యనైపుణ్యాభివృద్ధి
డిజిటల్ టెక్నాలజీ ఉచిత
ఒకేషనల్ విద్యా కోర్సులతో
బాలికలకు ఉపాధి ఆర్థిక భద్రత
కల్పిద్దాం ఆత్మగౌరవాన్ని పెంచుదాం

బాలికల సామాజిక ఆర్థిక రాజకీయ
స్థాయిని పెంచుదాం
మహిళా సాధికారత సాధిద్దాం

బాలికను రక్షించాల్సిన బలహీన
.వ్యక్తిగా కాకుండా సమాన
హక్కులున్న స్వతంత్ర వ్యక్తిగా
చూడగలిగిన రోజే నిజమైన
మార్పు వస్తుంది అప్పుడే
బాలికా వికాసం వర్ధిల్లుతుంది

బాలికల పోరాటంలో బాలిక
ఒంటరి కాకూడదు కుటుంబం
సమాజం ప్రభుత్వంఆమెకు
అండగా నిలవాలి

బాలిక బలంగా నిలబడితేనే
దేశం బలంగా నిలుస్తుంది

ఆడపిల్లను బతుకనిద్దాం ఆడపిల్లను చదవనిద్దాం ఆడపిల్లను ఎదిగనిద్దాం.

ఆడపిల్ల సృష్టికి మూలం
స్నేహానికి రూపం ఆడపిల్లను రక్షిద్దాం
ఆడపిల్ల అంటే అభల కాదు సబల
కరుణకలిగితే మమత
కన్నెర్ర చేస్తే అపర కాళిక
ఆంక్షల సంకెళ్లు తెంచుకు రావాలి
స్వేచ్ఛ వాయువును పిలుస్తూ
ఎదగాలి
అమ్మాయిలను ఆదరిద్దాం బాలికల భవితకు బంగారు బాటలు వేద్దాం



నేదునూరి కనకయ్య
రాష్ట్ర అధ్యక్షుడు తెలంగాణ ఎకనామిక్ ఫోరం, తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం, మాజీ కరెస్పాండెంట్ జస్టిస్, కుమారయ్య లా కాలేజీ, కరీంనగర్
(ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ జస్టిస్ కుమారయ్య 1969 _1971)
కరీంనగర్, 9440245771

# కిడ్నీలు పైలం..

### ఎవరు ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి?

**కుటుంబ చరిత్ర ఉన్నవారు..**
ఇప్పటికే కిడ్నీలో రాళ్ల సమస్య ఉన్నవారు. వారి కుటుంబంలో రాళ్ల చరిత్ర ఉన్నవారు. యూరిక్ యాసిడ్ సమస్య ఉన్నవారు. అలాంటి వారు మీ వ్యక్తి గత వైద్యుడిని సం ప్రదించ కుండా కాల్షియం సప్లిమెంట్లను తీసుకోకూడదు.

**బీరు తాగడం వల్ల కిడ్నీలో రాళ్లు కరిగి పోతాయా..?**
బీరు తాగడం వల్ల కిడ్నీలో రాళ్లు కరిగి పోవు. ఈ అపోహకు శాస్త్రీయ ఆధారాలు లేవు. వాస్తవానికి, బీరు తాగడం వల్ల రాళ్లు ఏర్పడే ప్రమాదం పెరుగుతుంది. ఎందుకంటే బీరులో డీహైడ్రేషన్ కలిగించే ఆల్కహాల్ ఉంటుంది. డీహైడ్రేషన్ వల్ల మూత్రం సాంద్రత పెరిగి, రాళ్లు ఏర్పడే అవకాశం పెరుగుతుంది. బీరులో అక్సలేట్లు, ప్యూరిన్ లు అధికంగా ఉండుట వలన కిడ్నీలో రాళ్ళు ఏర్పడవచ్చు.

**ఇతర కారణాలు, జాగ్రత్తలు**
కిడ్నీ రాళ్లకు కారణాలు కిడ్నీ రాళ్లు ఏర్పడటానికి ఒక కారణం లేదు, కానీ కొన్ని అం శాలు దీనికి దోహదం చేస్తాయి. ముందు గా, తగినంత నీరు తాగకపోవడానికి ప్రధా న కారణం. మూత్రం దట్టంగా మారి, పదా ర్థాలు కలిసి రాళ్లుగా మారతాయి. అలాగే, ఆహారంలో ఉప్పు, ప్రోటీన్, షుగర్ ఎక్కువ గా తీసుకోవడం కూడా ప్రమాదం. ఉదాహరణకు, మాంసాహారం ఎక్కువ తినేవారిలో యూరిక్ ఆమ్లం రాళ్లు ఏర్పడే అవకాశం ఎక్కువ.





మూత్రపిండాల్లో చాలా మట్టుకు కాల్షియం రాళ్లు ఏర్పడతాయి (75%-85%)
యూరిక్ ఆసిడ్ రాళ్లు (8%-10%)
స్ట్రువైట్ లేదా అమ్మోనియం రాళ్లు (7%-8%)
సిస్టీన్ రాళ్లు (7%-8%)

**నివారణ చర్యలు** (మీ ముద్ర వేయండి)

*ప్రతిరోజూ 2 నుండి 3 లీటర్ల నీరు తాగాలని నిర్ధారించుకోండి.*
*వీలైతే, టీ, కాఫీ, శీతల పానీయాల వినియోగాన్ని తగ్గించండి.*
*మీ ఆహారంలో ఉప్పు మొత్తాన్ని తగ్గించండి*
*ప్రాసెస్ చేసిన ఆహారానికి దూరంగా ఉండండి*
*ముఖ్యంగా ఇంట్లో వండిన ఆహారాన్ని తినండి.*
*మీ ఆహారంలో పండ్లు – కూరగాయలను చేర్చుకోండి.*
*కిడ్నీ రాళ్లు సాధారణ సమస్య, కానీ ముందుగా గుర్తిస్తే సులభంగా తగ్గించుకోవచ్చు. ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేసుకోండి. మీకు ఏమైనా సమస్య ఉంటే.. వెంటనే వైద్యులను సంప్రదించండి.*

కాల్షియం సప్లిమెంట్స్‌తో కిడ్నీల్లో రాళ్లు వస్తాయా అనే సందేహం అనేక మందికి కలుగుతుంటుంది. కొందరు వైద్యుల్ని సంప్రదిస్తే మరికొందరు తీవ్ర భయానికి లోనై కనీసం పాలు, పెరుగు తీసుకోవడం కూడా మానేస్తుంటారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఇందుకు సంబంధించి అనేక పోస్టులు చూసి తీవ్రంగా ప్రభావితమవుతుంటారు జనాలు. అయితే, ఈ విషయంలో అనవసర ఆందోళన అవసరం లేదు.

కేవలం కాల్షియం సప్లిమెంట్స్‌తో కిడ్నీల్లో రాళ్లు రావు. సాధారణంగా శరీరానికి తగినంత కాల్షియం అందని సందర్భాల్లో ఎముకల్లోని కాల్షియంపై ఆధార పడాల్సి వస్తుంది. దీంతో, రక్తంలో కాల్షియం స్థాయిల నిర్వహణ కోసం ఎముకల్లోని కాల్షియం క్రమంగా కరిగిపోతుంది. మూత్రం ద్వారా ఈ కాల్షియం విసర్జితమవుతుంది. కొన్ని సందర్భాల్లో కాల్షియం గడ్డకట్టి రాళ్లలా మారుతుంది.

ముఖ్యంగా భారతీయుల్లో కిడ్నీ రాళ్ల వ్యాధి ఎక్కువగా కనిపిస్తోంది. మొత్తం జనాభాలో దాదాపు 12 శాతం మంది ఈ సమస్యతో సతమతమవుతున్నారు. కొందరికి జన్యు కారణాల రీత్యా ఈ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువ. ఇతరత్రా కారణాలు కూడా కిడ్నీల్లో రాళ్లు ఏర్పడేలా చేస్తున్నాయి. ఉప్పు ఎక్కువగా ఉన్న ఆహారం తినడం, పానీయాలు తక్కువగా తీసుకోవడం, ఆహారంలో ఆక్సాలేట్స్, యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉండటం వంటివన్నీ కిడ్నీల్లో రాళ్లు ఏర్పడే ముప్పును పెంచుతున్నాయి.

కిడ్నీల్లో ఏర్పడే రాళ్లల్లో అధిక శాతం కాల్షియం ఆధారితైనవే. అంటే.. ఇవి కాల్షియం ఆక్సాలేట్, కాల్షియం ఫాస్ఫేట్, యూరిక్ యాసిడ్‌తో పాటు ఇతర రసాయనాలతో ఏర్పడతాయి. దీంతో, కాల్షియం తీసుకోవడాన్ని తగ్గిస్తే ఈ ముప్పు తప్పుతుందని కొందరు భావిస్తుంటారు. అయితే, ఆహారంలో కాల్షియం ఎక్కువగా ఉంటే కిడ్నీల్లో రాళ్లు వచ్చే అవకాశం తగ్గుతున్న విషయాన్ని ఇప్పటికే కొన్ని అధ్యయనాల్లో రుజువైంది. ఆహారంలో ఉన్న కాల్షియం, పేగుల్లోని ఆక్సాలేట్‌తో బలంగా అనుసంధానం అవుతుంది. ఫలితంగా ఆక్సాలేట్‌ను శరీరం గ్రహించలేదు. దీంతో, శరీరంలో ఈ రసాయనం స్థాయిలు తగ్గి కిడ్నీల్లో రాళ్ల సమస్య ప్రమాదం కూడా తగ్గుతుంది.

ముఖ్యంగా గుర్తు ఉంచుకోవాల్సింది..
అయితే, ఆహారంతో నిమత్తం లేకుండా కాల్షియం తీసుకుంటే మాత్రం శరీరం రెండిటినీ గ్రహిస్తుంది. మూత్రంలో వీటి శాతం పెరుగుతుంది. అంతిమంగా ఇవి కిడ్నీల్లో కాల్షియం ఆక్సాలేట్ రాళ్లుగా మారి సమస్యలకు దారి తీస్తాయి. కాబట్టి కాల్షియం సప్లిమెంట్స్‌ను ఆహారంతో పాటు తీసుకోవాలి.

అయితే, కిడ్నీల్లో రాళ్లకు ప్రధాన కారణం డీహైడ్రేషన్ శరీరంలో తగినంత నీరు లేనపుడు కిడ్నీల్లోని కాల్షియం, ఇతర ఖనిజాలు గడ్డకట్టి రాళ్లగా మారే అవకాశం పెరుగుతుంది . కాబట్టి రోజుకు కనీసం 3 లీటర్ల నీరు తాగాలి.

కిడ్నీలో రాళ్లు అంటే ఏమిటి ? అవి ఎలా ఏర్పడుతాయి..?
మూత్ర పిండాలలో ఏర్పడిన రాళ్ళని వైద్య పరిభాషలో మూత్రపిండ కాలిక్యులి, నెఫ్రోలిథియాసిస్ లేదా యురోలిథియాసిస్ అని కూడా అంటారు. భారతదేశంలో మూత్ర పిండాల్లో రాళ్ల ప్రాబల్యం సుమారు 12 శాతం ఉండవచ్చు అని గణాంకాలు చెప్తున్నాయి. ఉత్తర భారత దేశంలో మాత్రం మూత్రపిండాల రాళ్ల ప్రాబల్యం 15 శాతం ఉండవచ్చు అని అధ్యయనాలు వల్ల తెలుస్తుంది.

శరీరంలోని కాల్షియం, ఆక్సలేట్ – యూరిక్ యాసిడ్ పెద్ద మొత్తంలో కలిసిపోయి మూత్రపిండాలలో పేరుకుపోవడం ప్రారంభించినపుడు రాళ్ళు ఏర్పడతాయి. తక్కువ నీరు వినియోగించినప్పుడు, పేరుకుపోయిన కాల్షియం, ఆక్సలేట్ – యూరిక్ యాసిడ్ మూత్రం ద్వారా బయటకు రాలేనప్పుడు ఇది జరుగుతుంది.. తరువాత అవి క్రమంగా ఘనీభవించి రాళ్ల రూపాన్ని తీసుకుంటాయి. మీరు ఆహారం నుండి కాల్షియం తీసుకుంటే, సప్లిమెంట్లతో పోలిస్తే రాళ్ళు ఏర్పడే ప్రమా దం తక్కువగా ఉంటుంది. పాలు, పెరుగు, జున్ను, ఆకుకూరలు, బాదం కాల్షియం మంచి వనరులు. ఇవి శరీరానికి అవసరమైన పోషకాలను అందించడమే కాకుండా శరీరం వాటిని సులభంగా జీర్ణం చేసుకోగలదు..

**కుటుంబ చరిత్ర**
మీ కుటుంబంలో ఎవరికైనా ఈ సమస్య ఉంటే, మీకు కూడా రావచ్చు.

**ఊబకాయం**
అధిక బరువు ఉండటం వల్ల మెటబాలిజం మారి రాళ్లు ఏర్పడతాయి.

**జీర్ణ సమస్యలు**
గ్యాస్ట్రిక్ బైపాస్ సర్జరీ లేదా ఇన్‌ఫ్లమే బౌల్ డిసీజ్ స్థిర కాల్షియం శోషణను ప్రభావితం చేస్తుంది.

### జాగ్రత్తలు..

విటమిన్–సీ అధిక మోతాదు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (NIH) రోజుకు 2,000 mg కంటే ఎక్కువ తినకూడదని సిఫార్సు చేసింది. పెద్దలు విటమిన్–సీ, రోజుకు 2000 మిల్లీగ్రాముల కంటే ఎక్కు వగా తీసుకుంటే మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడతాయి. విటమిన్–సీ ఆక్సలేట్ రూ పంలోకి జీవక్రియ జరుగుతుంది, తరువా త కాల్షియం ఆక్సలేట్‌తో బంధిస్తుంది మరియు మూత్రపిండాలలో కాల్షియం ఆక్సలేట్ రాళ్లను ఏర్పరుస్తుంది.

సోడియం అధికంగా ఉండే ఆహారం మూత్రపిండాల్లో రాళ్లను ప్రేరేపిస్తుంది. ఎందుకం టే అదనపు సోడియం మూత్రంలో కాల్షి యం మొత్తాన్ని పెంచుతుంది. కాబట్టి, కిడ్నీలో రాళ్లను ప్రేరేపించడాన్ని పరిష్కరించడానికి సోడియంను పరిమితిలో ఉపయోగించమని సిఫార్సు చేయబడింది. ప్రస్తుతం రోజుకు 2300 mg (మిల్లీగ్రాములు) సోడియం తీసుకోవడం మంచిది అని అధ్యయనాలు సూచిస్తున్నాయి. కిడ్నీలో రాళ్లు సోడియం వల్ల ఏర్పడినట్లయితే, రోజువారీ 1,500 మి.గ్రా.కి పరిమితం చేయడం మంచిది. సోడియం పరిమితి అధిక రక్త పోటు మరియు గుండె జబ్బులను రాకుం డా కూడా ఉపయోగపడుతుంది.



డా.కౌశల్ గోవర్ధన
ఏం.బి.బి.ఎస్, (ఎం.డి, ఇంటర్నల్ మెడిసిన్)
వైస్ చైర్మన్, శ్రీ రామానుజ సేవా ట్రస్ట్
సెల్: 7702417779

# జపాన్ విధానాలను అనుసరిద్దాం

## జ్ఞాపకశక్తిని మెరుగుపర్చుకుందాం

తెలివితేటలు, క్రమశిక్షణ వంటి పదాలు చెప్పగానే ముందుగా గుర్తొచ్చేది జపాన్ దేశమే. వీరి ఇంటిలిజెన్స్ ను ఉపయోగించి చేసే తయారు చేసే టెక్నాలజీకి ప్రపంచ వ్యాప్తంగా పేరుంది. అయితే, వీరు ఏ విషయాన్నైనా మర్చిపోకుండా ఎలా గుర్తుపెట్టుకుంటారు అనేది అంతుచిక్కని విషయం.

పెరటి చెట్టు వైద్యానికి పనికిరాద న్నట్టు మనం ప్రతిదానికీ కొత్తరకమైన విధానాన్ని వెదుక్కుంటున్నాం కానీ నిజానికి ఇవన్నీ మన దేశంలో వేదకాలం నుంచి అనుసరిస్తున్నవే. అందుకే వేదమంత్రాలలో తప్పులు దొర్లవు సాధారణంగా ఎంతో పెద్దగా ఉండే విష్ణు సహస్రనామాలు, లలితా సహస్ర నామాలు వంటి వాటిని మన వాళ్లు సులువుగా ధారణ చేసినట్టే వారికి కూడా కొన్ని పద్ధతులున్నాయి.

నేటి రోజుల్లో చాలా మందికి ఏం చేయాలో సరిగా గుర్తుండడం లేదు. చేద్దాం చేద్దాం అని అనుకుంటూనే చేయాల్సిన పనులు మర్చిపోతుంటారు. ఇది చాలా మామూలు విషయమే అయినా..అలాగే ఉంటే కొద్దికాలానికి అంటే వృద్ధాప్యం రాకమునుపే మెదడు మొద్దుబారిపోతుంది. అలాకాకుండా మెదడును చురుగ్గా ఉంచాలంటే కొన్ని ప్రత్యేక పద్ధతులు పాటించాలి.మన జ్ఞాపక శక్తి బలపడాలన్న, వృద్ధాప్యం మీద పడినా మతిమరుపు లేకుండా ఉండాలన్న జపాన్ దేశం శతాబ్దాలుగా పాటిస్తున్న ఈ చిట్కాలను అనుసరించవచ్చు. ఈ చిట్కాలు కచ్చితంగా మీ మెదడును చురుగ్గా ఉంచి, మీరు మర్చిపోతున్న విషయాలను గుర్తుపెట్టుకునేలా చేస్తాయి. ప్రయత్నిస్తే మార్పు స్పష్టంగా కనిపిస్తుంది.వారు అనుసరిస్తున్న చిట్కాలు ఏంటో చూద్దాం.

### గ్యో:

గ్యో అంటే ఒకే పనిలో పూర్తిగా ఏకాగ్రతతో నిమగ్నంకావడం ఉదాహరణకు బల్ల శుభ్రం వేయడం,వస్తువులను క్రమబద్ధంగా సర్దడం లాంటి సాధారణ పనులే అయినా.. అని మన మనసును స్థిరంగా ఉంచుతాయి. దీని వల్ల మన మెదడు దృఢంగా పనిచేస్తుంది. జ్ఞాపక శక్తి బలోపేతం అవుతుంది.

### శిసా కాన్క

శిసా కాన్కో అంటే ఒక విషయాన్ని చూపిస్తూ బిగ్గరగా మాట్లాడటం అంటే శరీరానికి, మెదడుకు ఏకకాలంలో పని చెప్పడం లేదా మాటలు చెప్పడం.దీనివల్ల మన దృష్టి పూర్తి స్థాయిలో విషయంపైనే ఉంటుంది. జపాన్ లో రైలు నడిపే ఆపరేటర్లు (మనదేశంలో అయితే ఇంజిన్ డ్రైవర్లు) ఈ విధానాన్ని ఎక్కువగా అనుసరిస్తుంటారు.

### కొటోడమా

జపనీయులు విశ్వసించే మరో శక్తి మంతమైన టెక్నిక్ కొటోడమా.ఇది ఒక పదం లేదా వాక్యాన్ని పదేపదే పునరావృతం చేయడం.దీనివల్ల ఆ పదం మన మెదడులో నిలిచిపోతుంది. విద్యార్థులు లేదా ప్రసంగం ఇచ్చే వ్యక్తులు ఈ పద్ధతి వాడితే వారి జ్ఞాపకశక్తి బలపడుతుంది.

### కన్ సాట్సూ

ఈ పద్ధతిని జపాన్ లో సన్యాసులు, కళాకారులు ఎక్కువగా పాటిస్తారు. కన్ సాట్సూ అంటే చుట్టూ ఉన్న విషయాలను నిశ్శబ్దంగా గమనించడం.మనం ఏమీ మాట్లాడకుండా చుట్టుపక్కల ఉన్న ప్రతి చిన్న విషయాన్ని గమనిస్తే మెదడు సానుకూలంగా స్పందిస్తుంది. అన్ని విషయాలను శ్రద్ధగా గుర్తుంచుకుంటుంది.కళలతో సంబంధం ఉన్న వ్యక్తులలో ఎక్కువగా కనిపించే ఇది ఒక రకమైన మైండ్ ఫుల్ నెస్ టెక్నిక్.

### నైకాన్

కాలం గడిచే కొద్దీ మన జ్ఞాపకశక్తి తగ్గిపోతుందని అనుకుంటాం. అయితే జపనీయులు నైకాన్ అనే విధానాన్ని పాటిస్తూ.. మౌనంగా ఉండటం ద్వారా పాత జ్ఞాపకాలను తిరిగి గుర్తుకు తెచ్చుకునే ప్రయత్నం చేస్తారు. ప్రశాంత వాతావరణంలో కూర్చొని నేను ఎవరికి ఏం ఇచ్చాను.. ఎవరి నుంచి ఏం తీసుకున్నాను..? ఎవరి వల్ల నాకు ఇబ్బంది కలిగింది..? వంటి ప్రశ్నలను మనలో మనం వేసుకుంటే పాత జ్ఞాపకాలు తిరిగి గుర్తొస్తాయని వారు చెబుతున్నారు.

### ఉకెటమో

ఉకెటమో అనే ఈ భావన టోహౌకు అనే జపనీస్ మతపరమైన వర్గం నుండి వచ్చింది.దీని అర్థం నిజాయితీగా అంగీకరిస్తాను. మనం ఏ అంశాన్నైనా హృదయపూర్వకంగా అంగీకరిస్తే మానసికంగా స్థిరంగా ఉండగలమని అప్పుడు మన భావోద్వేగాలు నియంత్రణలో ఉంటాయని ఇది తెలుస్తోంది.

### చిసోకు

చిసోకు అనే ఈ పద్ధతిలో మనం నిరంతరం లక్ష్యాల వైపు పరుగులు పెట్టడం వల్ల వర్తమానాన్ని మర్చిపోతున్నామని చెబతారు. మనకు ఉన్నది ఈ క్షణమే. దానిపైనే పూర్తిగా దృష్టి పెడితే జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. అంటే భవిష్యత్ గురించి ఆందోళన చెందకుండా ప్రస్తుతం ఉన్న పనిపై దృష్టి పెట్టాలి.ఇది మన మానసిక స్థితిని ప్రశాంతంగా ఉంచుతుంది.



సుధాకర్ ఏవీ
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు
స్టేట్ టీచర్స్ యూనియన్,
తెలంగాణ స్టేట్ (STUTS),
సెల్: 9000674747

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
25.01.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews

5

దక్షిణ తెలంగాణ
హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్
Hyderabad, Rangareddy, Mahabubnagar



**ప్రపంచ వింత : భారీ బహిరంగ ప్రదర్శనశాల ఈ కొలోసియం**

ఇటలీ రాజధాని రోమ్‌లో ఉన్న ఈ కట్టడం ఒక భారీ బహిరంగ ప్రదర్శనశాల.ఇక్కడ పూర్వం గ్లాడియేటర్ల పోరాటాలు మరియు ఆటలు జరిగేవి.ఇది సుమారు 50,000 నుండి 80,000 మంది కూర్చునే సామర్థ్యం కలిగి ఉంది. భూకంపాల వల్ల కొంత దెబ్బతిన్నా, దీని వైభవం ఏమాత్రం తగ్గలేదు.ఇది రోమన్ల ఇంజనీరింగ్ నైపుణ్యానికి ఒక గొప్ప ఉదాహరణ.

# రైతుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం

- **రైతుల ఉపకరణాల పంపిణీలో ఎమ్మెల్యే మేఘారెడ్డి**

**ముద్ర, వనపర్తి :**




కాంగ్రెస్ ఆది నుంచీ రైతు పక్షపాతిగా పనిచేస్తోందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శనివారం వనపర్తి మండలం రైతు వేదికలో నిర్వహించిన రూ.77 లక్షల 13 వేల విలువైన రాయితీ ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రుణమాఫీతోపాటు రాయితీపై వ్యవసాయ ఉపకరణాలు, విత్తనాలు, ఎరువులు, డ్రిప్ పైపులు, స్ప్రింక్లర్లు, ట్రాక్టర్లు, కల్టివేటర్లు, రోటవేటర్లు, మందుల పిచికారీ యంత్రాలు వంటి అనేక పరికరాలను అందించి రైతులకు రూ.20 వేల నుంచి రూ.50వేల వరకు లబ్ధి చేకూరుస్తున్నామని తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతుల పేరుతో మోసాలు జరిగాయని, రాయితీ ఉపకరణాలను ఎత్తివేసి రైతుబంధు పేరుతో ప్రచారాలకే పరిమితమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల ద్వారానే నేటికీ సాగునీరు అందుతోందని, కాలువలకు బొక్కలు పెట్టి నీళ్లు తెచ్చామని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. వేలాడుతున్న విద్యుత్ తీగలు, స్తంభాలు, నియంత్రికుల మరమ్మతులకు రూ.50కోట్లు మంజూరు చేయించి సరి చేయించినట్టు తెలిపారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణపై అవగాహన లేకుండా తప్పుడు ప్రచారం చేస్తున్నవారిని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. వనపర్తి వేరుశనగకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉందని, పెద్దమందడి మండలం వీరాయపల్లిలో వేరుశనగ పరిశోధన కేంద్రం పనులను త్వరలో వేగవంతం చేస్తామని చెప్పారు. పంటను కాపాడుకునేందుకు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, పొలాలకు 50 శాతం రాయితీతో కంచ నిర్మాణం చేయించేందుకు బాధ్యత తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, ఖిల్లా ఘణపురం సింగిల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, డైరెక్టర్ సాయి చరణ్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ శారద, కాంగ్రెస్ నాయకులు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.




# వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు

- **సీఎం నియోజకవర్గానికి నిధులు తెచ్చుకోవాలి : కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**ముద్ర, నారాయణపేట ప్రతినిధి :**

సీఎం నియోజకవర్గ పరిధిలోని మద్దూరు కొత్తపల్లి గుండు మాల్ కోస్గి మండలాల పరిధిలో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో తాగునీటి వేసవి ప్రణాళికపై నిర్వహించిన సమావేశంలో డీఆర్‌డీఓ, డీపీవో, మిషన్ భగీరథ అధికారులు, ఎంపీడీవోలు, ఏఈలతో కలిసి ఆమె సమీక్షించారు. జిల్లాలో ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా ముందుగానే గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి వచ్చే నెల 1 నుంచి 20వ తేదీ వరకు గ్రామాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా జరుగుతోందా లేదా పరిశీలించాలని ఆదేశించారు. మిషన్ భగీరథ నీటి సరఫరా జరగని చోట్ల వివరాలను రిజిస్టర్లో నమోదు చేసి జిల్లా పంచాయతీ అధికారికి తెలియజేయాలన్నారు. జల శక్తి అభియాన్ అమలు తీరు జిల్లాలో సంతృప్తికరంగా లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇతర జిల్లాలతో పోలిస్తే నారాయణపేట జిల్లా 31వ స్థానంలో ఉందని, వచ్చే నెలలోపు జిల్లా ర్యాంకింగ్ మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.




# రంజాన్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

- **అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశం**

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :**

రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాసాలు, ప్రార్థనలు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించుకునేలా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కె. శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శనివారం కొంగర కలాన్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో పవిత్ర రంజాన్ మాసం2026 సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో పారిశుధ్యం, తాగునీరు, వీధి లైటింగ్, భద్రత, మసీదులు మరియు ప్రజా ప్రదేశాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విద్యుత్ సరఫరా, స్ట్రీట్ లైట్లు, మంచినీటి సదుపాయం, వీధి కుక్కల నియంత్రణ వంటి అంశాలపై మత పెద్దలు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకొని తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నవీన్ రెడ్డి, సైబరాబాద్ ఫ్యూచర్ సిటీ డీసీపీ, ఆర్డీఓ సరిత, పోలీసు, విద్యుత్, ఆర్ అండ్ బి శాఖల అధికారులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో అమరులైన ఉపాధ్యాయులకు నివాళి

- **సంతాప సభలో పాల్గొన్న ఎమ్మెల్యే**

**ముద్ర, తుంగతుర్తి :**



విధి నిర్వహణలో భాగంగా పాఠశాలకు వెళ్తూ కారు ప్రమాదంలో ఉపాధ్యాయులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు. ఉపాధ్యాయుల స్మరణార్థం మండల విద్యాశాఖ అధికారి బోయిన లింగయ్య అధ్యక్షతన నిర్వహించిన సంతాప సభలో ఆయన పాల్గొని మృతులకు నివాళులర్పించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుల సేవలు సమాజానికి అమూల్యమని, వారి అకాల మరణం విద్యారంగానికి తీరని లోటన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ప్రతి కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం, గాయపడిన ఉపాధ్యాయులకు రూ.50 వేల చొప్పున సహాయం అందిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి అవసరమైన అన్ని విధాలా తోడ్పాటు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సభలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, తిరుమలగిరి సింగిల్ విండో చైర్మన్ పాలేపు చంద్రశేఖర్, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ వసంత, ఉపాధ్యాయ సంఘాల మండల బాధ్యులు సూర్యప్రకాష్, నవీన్ ప్రసాద్, కార్తీక్ రెడ్డి, రవిశంకర్, చిలక శ్రీనివాస్, గుజ్జ భాస్కర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, పట్టణ అధ్యక్షుడు ఉప్పుల రాంబాబు, జిల్లా నాయకులు దాసరి శ్రీను, దాయం ఝాన్సీ రాజిరెడ్డి, మాచర్ల అనిల్, సంగెం గ్రామ సర్పంచ్ కలకోట్ల మల్లేష్, వివిధ గ్రామాల సర్పంచులు, పాఠశాలల ఉపాధ్యాయులు, మృతుల కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# మహిళల ఉపాధికి 'మావరిక్స్ రోటరీ' సహకారం

- **ఎంబ్రాయిడరీ మెషిన్ల విరాళం**

**ముద్ర, హైదరాబాద్ :**

సీఆర్ ఫౌండేషన్ మహిళా సంక్షేమ వృత్తి నైపుణ్య కేంద్రానికి హైదరాబాద్ మ్యావరిక్స్ రోటరీ క్లబ్ రూ.40వేల విలువైన రెండు ఎంబ్రాయిడరీ మెషిన్లను విరాళంగా అందించింది. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ డా. టి.సురేష్ బాబు, ఒకేషనల్ డైరెక్టర్ ఆశా ఆచార్య, సర్వీస్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ అజయ్ కుమార్, సభ్యులు కె. విజయలక్ష్మి ఈ మెషిన్లను మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోస్యభట్ల కల్పనకు అందజేశారు. ఈ మెషిన్లతో మరింత మంది మహిళలకు ఎంబ్రాయిడరీ శిక్షణ అందించగలమని, ఇది వారికి ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఎంతో ఉపయోగపడుతుందని కల్పన పేర్కొంటూ రోటరీ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్న కేశవరావు, మహిళా కేంద్రం సభ్యులు లలిత, ఉపాధ్యాయినిలు, శిక్షణ పొందుతున్న మహిళలు, సీఆర్ పాలిక్లినిక్ సభ్యులు డి.శ్రీనివాస్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ సురేష్ మాట్లాడుతూ సీఆర్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను కొనియాడారు. అలాగే ఈ మెషిన్లకు ఆర్థిక సహాయం అందించిన ఆశా ఆచార్యకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలి

- **వీబీ జీరామ్జీ చట్టాన్ని రద్దు చేయాలి**
- **కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి**

**ముద్ర, వనపర్తి :**



మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించి, వీబీ జీరామ్‌జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలో ఉపాధి హామీ పథకం పునరుద్ధరణకు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ పేదలకు జీవనాధారంగా నిలిచిన ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పథకాన్ని నీరుగార్చడం ద్వారా సామాన్య ప్రజలపై బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. గ్రామీణ ఉపాధి, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. గతంలో కాంట్రాక్టర్లపై నిషేధం ఉండేదని, ఇప్పుడు 'కన్వర్జెన్స్' పేరిట కాంట్రాక్టర్లకు అవకాశం కల్పించడం ద్వారా అవినీతి, దోపిడీకి దారితీస్తున్నారని ఆరోపించారు. కేంద్రం పూర్తిగా భారం భరించాల్సిన పథకంలో 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్రం భరించాలనే నిబంధన విధించడం అన్యాయమన్నారు. అలాగే 100 రోజుల పనికి హక్కు కల్పించిన కాంగ్రెస్ చట్టాన్ని మార్చి 125 రోజుల పేరిట ప్రజలను మభ్యపెడుతున్నారని తెలిపారు. ఈ మార్పులతో దళిత, ఆదివాసీ కుటుంబాలకు తీవ్ర నష్టం జరుగుతోందని, నిరుద్యోగం పెరిగి వలసలు ఎక్కువవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దగూడెం సర్పంచ్ పుష్పలత శివకుమార్, ఉపసర్పంచ్ పోలికమ్మ, గ్రామ కాంగ్రెస్ నేతలు గుండాల రాములు, శేఖర్ రెడ్డి, బుచ్చిబాబు, రొయ్యల శివయ్య, రవికుమార్, రమేష్, ఇసాక్, నాగన్న, మల్లేష్, పల్సర్ రాములు, వెంకటేష్, ఆంజనేయులు, కండక్టర్ ఆనంద్, వాల్య నాయక్, మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపేట మున్సిపల్ పీఠం బీజేపీదే

- **బీజేపీ సీనియర్ నాయకులు నాగురావు నామాజీ**

**ముద్ర, నారాయణపేట ప్రతినిధి:**

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో నారాయణపేట మున్సిపల్ పీఠం ముమ్మాటికీ బీజేపీదేనని సీనియర్ నాయకులు నాగురావు నామాజీ ధీమా వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. మంత్రి వాకిటి శ్రీహరి ఒకసారి అద్దంలో తన ముఖం చూసుకోవాలని, మక్తల్ నుంచి నారాయణపేటకు ఉన్న రహదారిని పరిశీలించాలని హితవు పలికారు. నారాయణపేట మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కౌన్సిలర్లను గెలిపిస్తే జిల్లా పోతుందని ఆరోపించారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన పనులు బీజేపీ ఉద్యమం చేసినప్పుడే జరుగుతున్నాయని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తున్న బీజేపీకి మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు పట్టం కట్టాలని కోరారు. జిల్లాలో 30యాక్ట్ అమలులో ఉన్నప్పటికీ కూడా అధికార పార్టీ నాయకులకు ర్యాలీ అనుమతి లేకున్నా పోలీసులు ఎందుకు మౌనం పాటిస్తున్నారని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలో అధికారిక కార్యక్రమంలో అనధికారిక వ్యక్తులను వేదికపై కూర్చొబెట్టడంపై మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్యను హైకోర్టును ఆశ్రయించి ప్రశ్నిస్తామన్నారు. ఉన్న దవాఖానాను ఊరి బయటకు తరలించి, బయట ఉన్న బస్తీ దవాఖానాను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్, రతన్, రఘురామయ్య గౌడ్, టౌన్ బిల్డర్ వెంకట్ రాములు పాల్గొన్నారు.




# గాజులరామారంలో చిత్తారమ్మ తల్లి మహా జాతరకు ఘన ఆరంభం

**ముద్ర, దుండిగల్ :**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గాజులరామారంలో కొలువుదీరిన శ్రీ చిత్తారమ్మ తల్లి 52వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జాతర సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారికి నిర్వహించిన ఆరాధనల అనంతరం వేద పండితులు భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్య గౌడ్ తెలిపారు. జాతర రెండో రోజు సందర్భంగా గవ్యంత పూజలు, మూలమంత్ర జపం, చండీ హోమం, పూర్ణాహుతి, బలిప్రదానం, ఋత్విక్ సన్మానం వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బాలరాజు, ముఖ్య కార్యవర్గ సభ్యులు, ముఖ్య సలహాదారులు, స్థానిక నాయకులు, అమ్మవారి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బొడ్రాయి ఆలయంలో ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక పూజలు

**ముద్ర, మల్కాజిగిరి :**



మల్కాజిగిరి పరిధిలోని పాత నేరేడ్‌మెట్ బొడ్రాయి అమ్మవారి ఆలయం పునర్నిర్మించి పదేళ్లు పూర్తైన సందర్భంగా శనివారం మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రజల సంక్షేమం, నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఆలయంలో నిర్వహించిన ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గ్రామ దేవతల కృపతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, సమృద్ధి కలగాలని ఆయన ఆకాంక్షించారు. ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగాయి. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, జేఏసీ వెంకన్న, స్థానిక టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పురాతన నగరం చిచెన్ ఇట్జా

ఇది మెక్సికోలో మాయన్ నాగరికతకు చెందిన పురాతన నగరం. ఇక్కడి "కుకుల్కాన్ పిరమిడ్" ఖగోళ శాస్త్రం ఆధారంగా నిర్మించ బడింది. దీనికి ఉన్న మెట్ల సంఖ్య సంవత్సరంలోని రోజుల సంఖ్యకు (365) సమానం. సూర్యాస్తమయం సమయంలో నీడలు పాము ఆకారంలో కదలడం ఇక్కడి ప్రత్యేకత. మాయన్ల గణిత మరియు నిర్మాణ చాతుర్యం ఇందులో కనిపిస్తుంది.

# ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**ముద్ర, కరీంనగర్, జనవరి 24:**
ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. 37వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని ''అరైవ్-అలైవ్'' (ARRIVE-ALIVE) అవగాహనా కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ ఆధ్వర్యంలో శనివారం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. డీజీపీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ''అరైవ్-అలైవ్'' కార్యక్రమం జిల్లాలో పకడ్బందీగా అమలవుతోందని తెలిపారు. ప్రపంచంలోనే అత్యధికంగా మన దేశంలో 22 కోట్ల 10 లక్షల బైక్ లు ఉన్నాయని, ప్రమాదాలు జరిగినప్పుడు తలకి గాయం కాకుండా ఉంటే ప్రాణాపాయం తప్పుతుందని గుర్తుచేశారు. వాహనదారులు వ్యక్తిగత భద్రత పాటిస్తూనే, ఇతరులను కూడా చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న వారికి పోలీస్ శాఖ తరపున హెల్మెట్లను పంపిణీ చేశారు.

**90 శాతం ప్రమాదాలను నివారించ వచ్చు: సీపీ గౌష్ ఆలం**

గత ఏడాది కమిషనరేట్ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో 200 మంది మరణించగా, అందులో 40 శాతం (80 మంది) టూ వీలర్ వాహనదారులేనని, మరణించిన వారిలో 90 శాతం మంది హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోయారని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తే 90 శాతం ప్రమాదాలను నివారించవచ్చని, ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ బస్ స్టేషన్, ప్రతిమ మల్టీ ప్లెక్స్, గీతాభవన్ చౌరస్తా, మంకమ్మతోట, శివ థియేటర్ సర్కిల్, కెమిస్ట్ భవన్, కోర్ట్ చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గాంధీ చౌరస్తా, కమాన్ చౌరస్తా మీదుగా సాగి తిరిగి పరేడ్ గ్రౌండ్ లో ముగిసింది.

ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం, అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీం రావు, ఏసీపీలు వెంకటస్వామి, యాదగిరి స్వామి, ఇన్స్పెక్టర్లు రాంచందర్ రావు, సృజన్ రెడ్డి, తిరుమల్, పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కర్మకాండ నిలయానికి భూమిపూజ

- రూ. 15 లక్షల సిఎస్ ఆర్ నిధులతో మానేరు ఒడ్డున నిర్మాణానికి చర్యలు చేపట్టిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- భూమిపూజ చేసిన బిజెపి నేతలు, మాజీ మేయర్లు



**ముద్ర, కరీంనగర్:**
కరీంనగర్ పట్టణంలోని మానేరు ఒడ్డున, తీగల బ్రిడ్జ్ సమీపంలో హనుమాన్ దేవాలయం పక్కన కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ రూ.15 లక్షల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్ (సిఎస్ఆర్) నిధులతో నూతన కర్మకాండ నిలయానికి చర్యలు చేపట్టారు. ఈ మేరకు శనివారం బిజెపి నేతలు, మాజీ మేయర్లు డి శంకర్, సునీల్ రావు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిలపు రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు రాజేంద్రప్రసాద్, సాయిని మల్లేశం, జీవి రమణ, అవదుర్తి శ్రీనివాస్, శ్రీధర్, కే.పి.చంద్ర, వెంకట్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలతో పాటు చందా లక్ష్మీనారాయణ, ముత్యంలు నూతన కర్మకాండ నిలయానికి భూమిపూజ నిర్వహించారు. అనంతరం బిజెపి నేతలు మాట్లాడుతూ కరీంనగర్ పట్టణంలో సొంత నివాసం లేని ఎంతోమంది ప్రజలు తమవారిని కోల్పోయినప్పుడు కర్మకాండలు నిర్వహించడానికి అనేక సమస్యలు, ఇబ్బందులపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చలించి కర్మకాండ నిలయం ఏర్పాటు కోసం చర్యలు చేపట్టారన్నారు. మరణించిన వ్యక్తి ఆత్మ శాంతి కోసం, అంత్యక్రియలు యథాశక్తిగా శ్రద్ధగా పాటించుకోవడానికి, కర్మకాండలు సక్రమంగా జరుపుకోవడానికి అవసరమైన భవనాన్ని నిర్మించడానికి కేంద్రమంత్రి సంజయ్ ఆధ్వర్యంలో సిఎస్ఆర్ ఫండ్స్ తో కర్మకాండ నిలయాన్ని మానేరు ఒడ్డున ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ మార్గ్ పర్ చారిక సంఘం బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా..

## ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు



**ముద్ర, పెద్దపల్లి:**
పెద్దపల్లి పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు అన్నారు. పెద్దపల్లి పట్టణంలోని 1వ వార్డులో 1.01 కోట్లు, 2వ వార్డులో 88.36 లక్షలు, 3వ వార్డులో 78.80 లక్షలు, 8వ వార్డులో 3.12 కోట్లు, 9వ వార్డులో 2.45 కోట్లు, 11 వ వార్డు లో 2.94 కోట్లు, 14వ వార్డులో 89.77 లక్షలు, 15వ వార్డులో 03.33 కోట్లు, 16వ వార్డులో 84.21 లక్షలు, 31వ వార్డులో 2.96 కోట్లు, 32 వ వార్డులో 69.39 లక్షలు, 33వ వార్డులో 69.94 లక్షలు మరియు 15,17 వార్డుల్లో BT రోడ్ల నిర్మాణం కోసం 1.65 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణ అభివృద్ధికి అవసరమైతే మరిన్ని నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి తాను ప్రజల కోసం ఎలాంటి అభివృద్ధి పనులు అడిగినప్పటికీ కాదనకుండా మంజూరు చేస్తున్నారని చెప్పారు. అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ ఫండ్ (యుఐడీఎఫ్) నిధులు రూ.63 కోట్లు పెద్దపల్లి పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు మంజూరు చేయించడం జరిగిందని అన్నారు. పట్టణంలో నిలిచిపోయిన సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలకు సమన్యాయం చేయడం కోసమే పనిచేస్తున్నానని నాకు ఏ వ్యాపారాలు లేవని ఎప్పుడు ప్రజల తోటే మమేకమై మీ సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తున్నానని అన్నారు. గత ప్రభుత్వం పెద్దపల్లి పట్టణాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నూతన బస్సు డిపో, బైపాస్ రోడ్డు, 50 పడకల నుండి 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఆధునీకరణ, నూతన కోర్టు భవనం లాంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో చేయడం జరుగుతుందని అన్నారు. అధికార పార్టీ అభ్యర్థులను గెలిపిస్తేనే మరింత అభివృద్ధి జరుగుతుందన్న విషయం ప్రతి ఒక్కరికి తెలుసని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, మున్సిపల్ సిబ్బంది, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆన్ లైన్ లోనే ఇసుక బుకింగ్

**టిజిఎండిసి వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, మైన్స్ & జియాలజీ డైరెక్టర్ భవేశ్ మిశ్రా**

**ప్రయోగాత్మకంగా కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో అమలు**




**ముద్ర, కరీంనగర్:**
ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా ఆన్లైన్ విధానంలోనే ఇసుక బుకింగ్ విధానం ప్రవేశ పెట్టనుందని రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ (TGMDC) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, మైన్స్ & జియోలజీ డైరెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. ప్రయోగత్మకంగా రాష్ట్రంలోని కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో ఆన్లైన్ విధానం అమలు చేయనున్న నేపథ్యంలో కరీంనగర్ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో భవేశ్ మిశ్రా మాట్లాడుతూ ఇసుక ఆన్లైన్ ప్రక్రియలో భాగంగా 'మన ఇసుక వాహనం' యాప్ ద్వారా ఆన్ లైన్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశ పెడుతోందని అన్నారు. ఈ నూతన విధానం ద్వారా భవన నిర్మాణ రం గంలో ఇసుక కొరత తీరడమే కాకుండా, అక్రమ రవాణా అరికట్టవచ్చని అన్నారు. పూర్తిగా ఆన్లైన్ లోనే రవాణా జరగాలని, మాన్యువల్ రసీదులు జారీ చేయవద్దని తెలిపారు. ఇందిరమ్మ నిర్మాణం కోసం ఈ యాప్ లో ప్రత్యేక అప్షన్ ఇచ్చామని తెలిపారు. 25 క్యూబిక్ మీటర్ల ఇసుకను ఇందిరమ్మ లబ్ధిదారులు పొందవచ్చని అన్నారు. ప్రయోగాత్మక జిల్లాల అనంతరం 16 జిల్లాల్లో ఈ విధానం ప్రవేశపెడతామని తెలిపారు. ఇసుక అవసరం ఉన్నవారు మొబైల్లో మన ఇసుక వాహనం యాప్ డౌన్లోడ్ చేసుకుని బుక్ చేసుకోవాలని, లేదా టిజిఎండిసి ఆన్లైన్ లో బుక్ చేసుకోవాలని తెలిపారు. స్మార్ట్ ఫోన్లు లేనివారు గ్రామ పంచాయతీ కార్యదర్శులను సంప్రదించి బుక్ చేసుకోవాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ మన ఇసుక వాహనం ఆన్లైన్ బుకింగ్ విధానం అమలు కోసం జిల్లాను ఎంపిక చేసినందున అధికారులు నిబద్ధతతో పని చేసి విజయవంతమయ్యేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయరాజ్, ప్రాజెక్టు మేనేజర్ రాధాకృష్ణ, తహశీల్దార్లు, మైనింగ్, హౌసింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మేయర్ గా అవినీతికి పాల్పడలేదని ప్రమాణం చేస్తారా..?

- 42వ డివిజన్ కాంగ్రెస్ నేత డాక్టర్ రాజన్న




**ముద్ర, కరీంనగర్:**
మేయర్ గా అవినీతికి పాల్పడలేదని ప్రమాణం చేస్తారా అని మాజీ మేయర్ సునీల్ రావును 42వ డివిజన్ కాంగ్రెస్ నేత డాక్టర్ రాజన్న ప్రశ్నించారు. డాక్టర్ రాజన్న శనివారం కరీంనగర్ లోని డిసిసి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాజీ మేయర్ సునీల్ రావు గతంలో తనపై మోపిన ఆరోపణలను ఖండిస్తూ ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మాజీ మేయర్ గా సునీల్ రావు ఎంత అవినీతికి పాల్పడ్డారో నగర ప్రజలందరికీ తెలుసని, రాజకీయాలలో విమర్శలు ఆరోపణలు చేసే విషయంలో ఒక పద్ధతి ఉంటుందని దానికి భిన్నంగా కుక్కలు, పందులు అంటూ అసభ్యకరంగా వ్యాఖ్యలు చేస్తూ ఆరోపణలు చేయడం తగదని అన్నారు. ప్రజా సేవ చేయాలని వచ్చిన వెలిచాల రాజేందర్ రావును అవినీతికి పాల్పడ్డారంటూ వ్యాఖ్యలు చేయడం, తనను ఉద్యోగంలో భాగంగా గొర్రెలు అమ్ముకున్నానని అనుచిత వ్యాఖ్యలు చేయడం మంచిది కాదని, సునీల్ రావు చదువుకొని ఉంటే ఈ వ్యాఖ్యలు చేసే వారు కాదని అన్నారు, తాను అవినీతికి పాల్పడి ఉంటే ఎప్పుడో జైలుకు వెళ్లే వాడినని, సరెండర్ కు సస్పెన్షన్కు తేడా తెలియని సునీల్ రావు ఐదు సంవత్సరాలు మేయర్ గా ఎలా ఉన్నారో అర్థం కావడంలేదన్నారు. సిమెన్ (వీర్యం) ఎలా తయారు చేస్తారు, ఎలా సప్లై చేస్తారు అనే విషయంలో కేవలం డాక్టర్లకు మాత్రమే అవగాహన ఉంటుందని తెలుసుకోవాలని తెలిపారు. గతంలో కాంగ్రెస్ లో పనిచేసినప్పుడు జగపతిరావు, ఎమ్మెస్సార్, పొన్నం ప్రభాకర్ దగ్గర ఎలా ఉన్నావు.. కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత టిఆర్ఎస్ పార్టీలోకి వెళ్లి మేయర్ అయి.. ఆ తర్వాత వినోద్ కుమార్ ను మోసం చేసి మళ్లీ నీ రాజకీయ స్వలాభం కోసం బిజెపిలో చేరావని ఆరోపించారు. ప్రస్తుతం బండి సంజయ్ ను ఏమి చేయాలనుకుంటున్నావని ప్రశ్నించారు. తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని తెలిపారు. కలెక్టరేట్ హెలిపాడ్ వద్ద ఉన్న హనుమాన్ గుడి వద్ద తడి బట్టలతో వచ్చి ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నానని, మేయర్ గా ఎలాంటి అవినీతికి పాల్పడలేదని తడి బట్టలతో ప్రమాణం చేయాలని డాక్టర్ రాజన్న డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు లయాక్, మహమ్మద్ చాంద్, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహాన్ని నింపిన అల్ఫోర్స్ గర్ల్స్ ఇ-టెక్నో పాఠశాల 'తరంగ్'




**ముద్ర, కరీంనగర్:**
అల్ఫోర్స్ గర్ల్స్ ఇ-టెక్నో పాఠశాల వార్షికోత్సవ 'తరంగ్' వేడుకలు ఉత్సాహాన్ని నింపాయి. శనివారం కరీంనగర్ రేకుర్తి రోడ్ లోని ఓ ఫంక్షన్ హాల్ లో 'తరంగ్' వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్ పర్సన్ LRAT మరియు అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి డి.సాధన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక దశ నుండే నైతిక విలువల పట్ల అవగాహన కల్పించాలని మరియు సమాజాభివృద్ధికి తోడ్పాటు అందించే విధంగా ప్రోత్సాహం అందించాలని అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు సమాజం గురించి అవగాహన కల్పించాలని, చక్కటి ప్రణాళికల ద్వారా విజయం సాధించడం లక్ష్యంగా ప్రోత్సాహం అందించడం ద్వారా సమాజంలో సుస్థిర స్థానాన్ని పొందుతారని తెలిపారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు కావలసిన వనరులను సమకూర్చి వారిని ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తూ ఉండాలని చెప్పారు. ప్రతి ఒక్కరు తల్లిదండ్రుల మాటలను అనుసరించాలని మరియు ఉపాధ్యాయులు బోధించిన విషయాలను సాధన చేసి ఘన విజయాలను సొంతం చేసుకోవాలని సూచించారు,

అనంతరం విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందించాలని, తరగతి గదిలో బోధించిన విషయాలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని తద్వారా వాటిలో పట్టు సాధించగలుగుతారని చెప్పారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని, పుస్తక పఠనాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు సైతం వారి పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలని, నైతిక విలువలను పెంపొందించవలసిన అవసరం ఉందని అన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షణగా నిలిచాయి. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# పెద్దపులి పాదముద్రల గుర్తింపు..

**ముద్ర, మంచిర్యాల:**
మంచిర్యాల జిల్లా జన్నారం డివిజన్ పరిధిలోని తాళ్లపేట్ రేంజ్‌లో పెద్ద పులి పాదముద్రలను గుర్తించారు. మాంసాహార జంతువుల గణనలో భాగంగా శనివారం అటవీశాఖ, జంతుప్రేమికులైన వాలంటీర్లు సర్వే చేపట్టారు. 5వ రోజు సర్వేలో చింతపెల్లి, పాత మామిడిపెల్లి బీట్ అడవుల్లో పెద్దపులి పాదముద్రలు గుర్తించామని ఎఫ్‌డీవో రామ్మోహన్ తెలిపారు.

అఖిల భారత జంతుగణనలో భాగంగా ఈ సర్వే నిర్వహించారు. జంతు ప్రేమికులు, వాలంటీర్లు, అటవీశాఖ సిబ్బంది చేపట్టిన ఈ సర్వేలో కవ్వాల్ టైగర్ రిజర్వుడ్ అడవుల్లో పెద్ద పులి పాదముద్రలను కనుగొన్నారు. పెద్ద పులి పాదముద్రలు లభించడం ఈప్రాంతానికి ఎంతో శుభసూచకమని ఎఫ్‌డీవో రామ్మోహన్ అన్నారు.

ముద్ర
సమగ్ర సమాచార పత్రిక
25.01.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### ప్రపంచ వింత : ఆండీస్ పర్వతాల పైన నగరం మాచు పిచ్చు

పెరూ దేశంలోని ఆండీస్ పర్వతాల పైన ఈ నగరం నిర్మించబడింది.ఇది ఇంకా సామ్రాజ్యానికి చెందిన అత్యంత పవిత్రమైన ప్రదేశం.సముద్ర మట్టానికి సుమారు 8,000 అడుగుల ఎత్తులో ఇది ఉంటుంది.పెద్ద పెద్ద రాళ్లను సిమెంట్ లేకుండానే ఒకదానికొకటి అతికించినట్లు నిర్మించడం వింత. దీనిని "మేఘాల మధ్య నగరం" అని కూడా పిలుస్తారు.

## అడిషనల్ కలెక్టర్ భాస్కరరావుకు శుభాకాంక్షలు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అడిషనల్ కలెక్టర్ ఏ.భాస్కర రావు ఐఏఎస్ గా పదోన్నతి పొందడంతో గ్రామ పాలన అధికారుల అసోసియేషన్ టీజీఆర్ ఎస్ ఏ, టీజీటీ ఎస్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఆర్ ఎస్ ఎ రాష్ట్ర అధ్యక్షులు బాణాల రాంరెడ్డి, టీజీటీఎ రాష్ట్ర మహిళ అధ్యక్షులు రాధా, టీజీఆర్ ఎస్ ఏ జిల్లా అధ్యక్షులు కొండం వెంకట్ రెడ్డి, పల్లవి మేడం, గ్రామ పాలనాధికారుల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి గుర్రాల బాలకృష్ణ, రాష్ట్ర సెక్రెటరీ జనరల్ దాసరి వీరన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ధన్వంత్, జిల్లా నాయకులు సురేష్, ప్రకాష్, అనిల్ సత్తయ్య, చక్రవాణి, నవత, ఉమా, మాధవరెడ్డి, మల్లేష్, ఫహీం పాల్గొన్నారు.



# ఎవ్వరిని వదిలిపెట్టం..

- అందరి బాగోతాలను బయటపెడతాం
- ఫోరెన్సిక్ ఆడిట్‌తో సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో అక్రమాల గుర్తింపు
- త్వరలో 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్
- ధరణి పోర్టల్ లొసుగులతోనే రిజిస్ట్రేషన్‌లలో అక్రమాలు
- 9 జిల్లాల్లో 48 మందిపై క్రిమినల్ కేసులు
- ధరణి పోర్టల్ అక్రమాలపై ఉన్నతస్థాయి కమిటీ నివేదిక
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

ధరణి పోర్టల్‌లోని లొసుగులను ఆసరాగా చేసుకొని ప్రభుత్వ భూములను కొల్లగొట్టిన వారినీ రిజిస్ట్రేషన్ల చలానా సొమ్మును కాజేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలోని కొందరు పెద్దలు ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని ప్రభుత్వ భూములను కాజేశారని ఆరోపించారు. దీనిపై సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థతో పైలట్ కింద ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించినట్లు వెల్లడించారు. ఇందులో అనేక అవినీతి అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక నివేదికలో స్పష్టమైందని ఆయన తెలిపారు. ఈ ఫోరెన్సిక్ నివేదికను పరిశీలించిన తర్వాత మిగిలిన 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తామని ప్రకటించారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడిన సంఘటనలపై ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీతో శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి సమావేశం నిర్వహించారు. విచారణలో ఎదురైన అంశాలు,ఎవరి పాత్ర ఎంత? తెరవెనుక ఎవరైనా ఉన్నారా? రెవెన్యూ అధికారుల పాత్ర ఏమైనా ఉందా? వంటి అంశాలపై కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కమిటీ ప్రాథమిక నివేదికను పరిశీలించి మరికొన్ని సలహాలు సూచనలు చేస్తూ మరింత లోతైన విచారణ జరిపి తుది నివేదికను సమర్పించాలని సూచించారు.

**ప్రాథమిక విచారణలోనే రూ. 4 కోట్ల అవినీతి**

ధరణి పోర్టల్ ప్రారంభమైనప్పటి నుంచి 35 లక్షల లావాదేవీలు జరిగాయని ఇందులో ప్రాథమికంగా 4,848 లావాదేవీల్లో లోటుపాట్లు జరిగినట్లు కమిటీ గుర్తించిందని మంత్రి తెలిపారు. విచారణ తర్వాత 1109 డాక్యుమెంట్లకు సంబంధించి రూ. 4 కోట్లు ప్రభుత్వానికి చెల్లింపు జరగలేదని కమిటీ సభ్యులు వివరించారని తెలిపారు. గత ప్రభుత్వం ముందుచూపు లేకుండా అనాలోచితంగా, కుట్రపూరితంగా తీసుకువచ్చిన ధరణి పోర్టల్ లోని లొసుగులను ఆసరాగా చేసుకొని కొంతమంది అక్రమాలకు పాల్పడ్డారన్నారు. వీటిపై ఆరోపణలు రావడంతో భూభారతి పోర్టల్ ద్వారా ఆడిట్ నిర్వహించి అక్రమాలను గుర్తించి తక్షణమే ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టామని తెలిపారు. ఇందుకు సంబంధించి తొమ్మిది జిల్లాల్లోని 35 మండలాల్లో అక్రమాలకు పాల్పడిన 48 మందిపై క్రిమినల్ కేసులు నమోదు



చేశామన్నారు. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే ప్రతిపక్షంలో ఉన్న ఓ నాయకుడు రూ. వెయ్యి కోట్ల అవినీతి అని, మరో నాయకుడు రూ. పదివేల కోట్లు అని ఇంకొక్కరు భూభారతి పోర్టల్ అవినీతిమయమని నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు.

**నేడు సర్వేయర్లకు లైసెన్స్‌లు**

ఇప్పటికే మొదటి విడతలో నాలుగు వేల మంది శిక్షణ పొందిన సర్వేయర్లకు లైసెన్స్‌లు జారీ చేయగా నేడు ఖమ్మం జిల్లా కలెక్టరేట్ లో మరో రెండు వేల మందికి లైసెన్స్‌లు జారీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ లైసెన్స్‌డ్ సర్వేయర్లతో రాష్ట్రంలో నక్షా లేని 373 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఇంటిలిజెన్స్ అదనపు డిజి విజయ్‌కుమార్ ,ఉన్నతస్థాయి కమిటీ సభ్యులు డీఐజీ ఎమ్. సుభాషిని, సీఎమ్ఆర్‌వో మకరంద్, ఏసీబీ ఎస్పీ సింధు శర్మ, సైబర్ క్రైమ్ డిఎస్పీ ఎ. సంపత్, ఎన్ఐసి ప్రతినిధి శ్రీనివాస్ , హోంశాఖ సలహాదారు పి. శరత్ కుమార్ పాల్గొన్నారు

## ఆకట్టుకున్న స్వపరిపాలన

**ముద్ర, నడిగూడెం :**

నడిగూడెం మండలంలోని శ్రీ సాయి పబ్లిక్ స్కూల్లో శనివారం నిర్వహించిన సుపరిపాలన దినోత్సవ వేడుకలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులే విద్యాశాఖ మంత్రిగా, డి ఈ ఓ, ఎంఈఓ, ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల పాత్రలో పాఠశాలలో విద్యార్థులు పాఠ్యాంశాలు బోధించిన తీరు ఆకట్టుకుంది. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని చదువుతోపాటు అన్ని కార్యక్రమాలలో విద్యార్థులు భాగస్వామ్యమై భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకోవాలని పాఠశాల కరస్పాండెంట్ బుస్సా మహేష్, ప్రిన్సిపల్ బుస్సా సులోచన కోరారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిరాజ్, సైదులు, రాంబాబు, లక్ష్మి, రజియా, నాగమణి, భవాని , శిరీష, స్వప్న, వీర కుమారి, సాజిద , విజయ తదితరులు పాల్గొన్నారు




## శోభాయమానంగా శ్రీవారి వసంతోత్సవం

- జల నారాయణ స్వామికి మంగళహారతులు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయణం, పుష్య మాసం శుక్ల పక్షము షష్ఠి, హేమంత ఋతువు, శనివారం కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి శోభాయమానంగా వసంతోత్సవం నిర్వహించారు. అర్చక స్వాములు సుప్రభాత సేవ, నిత్యారాధనలు చేసి విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి మరియు సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో శనివారం సందర్భంగా జల నారాయణ స్వామి వారికి మంగళహారతులు సమర్పించారు.

**నేడు స్వర్ణగిరిలో రథసప్తమి వేడుకలు**

శ్రీ స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి వారి అనుగ్రహంతో ఆదివారం రథసప్తమి మహోత్సవం స్వర్ణగిరి క్షేత్రంలో ఘనంగా నిర్వహించబడనున్నట్లు ఆలయ ధర్మకర్తలు మానేపల్లి రామారావు, వంశీకృష్ణ, మురళీకృష్ణలు తెలిపారు. ఉదయం 06:00 గంటల నుండి రాత్రి 09:00 గంటల వరకు ప్రత్యేక పూజలు, సేవలు, ఉత్సవ వైభవం జరుగుతుందన్నారు. ఈ పవిత్ర దినాన స్వామి వారి దర్శనంతో సర్వ పాప విమోచనం కలిగి, సకల శుభాలు కలుగుతాయని శాస్త్ర వచనం. కావున భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. భక్తులు ఆన్లైన్ లేదా దేవస్థానం కార్యాలయంలో సేవలను బుక్ చేసుకోవచ్చని, వివరాలకు 9099909917, 7997974006 నంబర్లను సంప్రదించాలన్నారు.



## పోస్టర్ల ఆవిష్కరణ

ముద్ర ప్రతినిధి, భువనగిరి : మైనారిటీ రెసిడెన్షియల్ అడ్మిషన్ల కోటను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సంస్థల, రెవిన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్ అన్నారు. శనివారం తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల,కళాశాల అడ్మిషన్ల పోస్టర్ ను డిఆర్ఓ, డిఎం డబ్ల్యూఓ జయమ్మ, ఆర్ సి ఓ శ్రీకాంత్ ఉర్దూ మైనార్టీ ఆఫీసర్ ఫౌజియా, మైనార్టీ రెసిడెన్షియల్ సంస్థల ప్రిన్సిపల్ బాలకృష్ణ, శ్రీనివాస్ కవిత తో కలిసి పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ముస్లిం మైనారిటీలందరూ స్కూల్, ఇంటర్మీడియట్ కళాశాలలో మైనారిటీ రెసిడెన్షియల్ అడ్మిషన్ల కోటను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.





## ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం అభినందనీయం

- మండల వైద్యాధికారిణి యామిని శ్రుతి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

ప్రజల ఆరోగ్య పట్ల శ్రద్ధ తీసుకోవడం అభినందనీయమని మండల వైద్యాధికారిని డాక్టర్ యామిని శ్రుతి అన్నారు. మండలంలోని తాజ్ పూర్ గ్రామంలో సామాజిక వేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ జిల్లా వైద్యాధికారులను సంప్రదించి ఆయన స్వంత ఖర్చులతో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం పేరిట ఒక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయగా ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల సౌకర్యార్థం బొల్లెపల్లి వైద్య బృందం ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశారు. ప్రజలు ఆరోగ్య సమస్యలకు పరీక్షలు చేయించుకుని అవసరమైన మందులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్, ఉప సర్పంచ్, గ్రామపంచాయతి పాలకవర్గం, సిబ్బంది, గ్రామ పెద్దలు, యువత, అంగన్వాడీ, ఆశ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## క్రీడలవైపు మొగ్గు చూపాలి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

గ్రామ స్థాయిలో క్రీడా టోర్నమెంట్లు నిర్వహించడం ఎంతో అభినందనీయమని రూరల్ సీఐ చంద్రబాబు అన్నారు. మండలంలోని తాజ్‌పూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ ఆధ్వర్యంలో తాజ్‌పూర్ ప్రీమియర్ క్రికెట్ లీగ్ - 2026 పోటీలను సిఐ ప్రారంభించి మాట్లాడుతూ.. ప్రస్తుత యువత మద్యానికి, డ్రగ్స్‌కు బానిసలు కాకుండా క్రీడల వైపు మొగ్గు చూపితే ఆరోగ్యకరమైన భవిష్యత్తు సాధ్యమవుతుందన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, నైపుణ్యం, ఫిట్‌నెస్‌ను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 29వ తేదీని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటామని తెలిపారు. హాకీ దిగ్గజం, “విజార్డ్ ఆఫ్ హాకీ”గా పేరుగాంచిన మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారని వివరించారు. గెలిచినా, ఓడినా క్రీడా స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ట్రయల్ రన్‌కే పరిమితం



- అలంకారప్రాయంగా నిలిచిన 112 అడుగుల జాతీయ జెండా

**ముద్ర, నడిగూడెం:**

నడిగూడెం మండల కేంద్రంలో గల రాజా నాయిని వెంకట రంగారావు కోటలో ఏర్పాటు చేసిన 112 అడుగుల జాతీయ జెండా నేటికీ అలంకారప్రాయంగానే దర్శనమిస్తోంది. దక్కన్ ఆర్కియాలజికల్ రీసెర్చ్ అండ్ కల్చరల్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈ జెండాను ఏర్పాటు చేశారు. 2024 డిసెంబర్16న డాక్రి సంస్థ చైర్మన్ కుర్రా జితేంద్రబాబుఆయన మాతృమూర్తి కుర్రా తులసమ్మ స్విచ్ ఆన్ చేసి త్రివర్ణ పతాకాన్ని ట్రయల్ రన్ గా ఎగురవేశారు.112 అడుగుల ఎత్తైన జెండా స్తంభాలను ఢిల్లీ నుంచి తెప్పించి ఏర్పాటు చేయగా, త్రివర్ణ పతాకాన్ని 30 అడుగుల ఎత్తు, 45 అడుగుల వెడల్పుతో తయారు చేశారు. 2025 జనవరి మొదటి వారంలో జాతీయ జెండాను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవిష్కరిస్తారని నిర్వాహకులు ప్రకటించారు. అయితే ప్రకటన చేసి ఏడాది పూర్తవుతున్నా ఇప్పటివరకు అధికారిక ఆవిష్కరణ జరగకపోవడంతో జెండా కేవలం అలంకారంగా మాత్రమే నిలిచింది.



**జాతీయ జెండా రూపకల్పన జరిగిన చారిత్రక కోట**

నడిగూడెం కోటకు జాతీయ చరిత్రలో ప్రత్యేక స్థానం ఉంది.భారత జాతీయ జెండాను రూపకల్పన చేసిన పింగళి వెంకయ్య ఈ కోటలోనే వ్యవసాయ మంత్రిగా పనిచేశారు. స్వాతంత్ర్య పోరాట కాలంలో త్రివర్ణ పతాకాన్ని రూపొందించి జాతికి అంకితం చేసిన ఆయన జ్ఞాపకాలను స్మరించుకునేలా ఈ కోటలోనే 112 అడుగుల జాతీయ జెండాను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని జాతీయ జెండా అధికారిక ఆవిష్కరణ చేయాలని,తద్వారా నడిగూడెం ప్రాంతానికి దేశ వ్యాప్తంగా గుర్తింపు తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## రాజేష్ మృతికి బాధ్యత వహించాలి

- కుటుంబానికి న్యాయం జరిగేవరకు పోరాడతాం
- కోదాడ పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ ఆందోళన
- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

**ముద్ర ప్రతినిధి , కోదాడ:**

రాజేష్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. కోదాడ నియోజకవర్గంలో శనివారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చలో కోదాడకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్ లో ఆయన మాట్లాడుతూ.. రెండు నెలల క్రితం సీఎంఆర్ఎఫ్ నిధుల దుర్వినియోగం కేసులో దళిత యువకుడు కర్ల రాజేష్ అనే యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి నాలుగు రోజులు చిత్రహింసలకు గురిచేసి కస్టోడియల్ డెత్ కు కారణమైన పోలీసులను సస్పెండ్ చేసి, కేసులు నమోదుచేసి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేవలం లక్ష రూపాయల చెక్కు విషయంలో కర్ల రాజేష్‌ను విచారణ పేరుతో పోలీస్ స్టేషన్‌కు పిలిపించి, అతని హత్యకు చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డి ప్రత్యక్ష కారణమై ఉన్నా, ఇప్పటివరకు అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రాజేష్ మరణంలో విచారణ నుంచి పోస్టుమార్టం వరకు మొత్తం వ్యవస్థ పారదర్శకంగా లేదని అన్నారు. మంత్రి,ఎమ్మెల్యే లపై తీవ్ర విమర్శలు చేశారు. రాజేష్ మృతి ముమ్మాటికీ పోలీస్ హత్యే అని, సంబంధిత పోలీసులపై తగిన చర్యలు తీసుకోని పక్షంలో నిరసన ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 25-01-2026
www.mudranews.in | @mudranews



**ప్రపంచ వింత : మన తాజ్ మహల్**

భారతదేశంలోని ఆగ్రాలో ఉన్న ఈ కట్టడం ప్రేమకు చిహ్నం. షాజహాన్ తన భార్య ముంతాజ్ జ్ఞాపకార్థం పూర్తిగా తెల్లని మలపురాతితో (Marble) నిర్మించారు. యమునా నది ఒడ్డున ఉన్న ఈ కట్టడం పౌర్ణమి రాత్రుల్లో మెరిసిపోతుంది. ఇది మొఘల్ శిల్పకళకు అత్యున్నత శిఖరం వంటిది.

# రంజాన్ మాసంలో ఇబ్బందులు లేకుండా చూడాలి

**సిద్దిపేట కలెక్టర్ హైమావతి**





**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింల ప్రార్థనలతో పాటు ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులు, ముస్లిం పెద్దలతో కలెక్టర్ సమావేశం నిర్వహించి రానున్న రంజాన్ మాస ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 18 నుంచి మార్చి 19 వరకు రంజాన్ మాసం ఉంటుందన్నారు. రంజాన్ మాసం ముస్లింలకు అతి పవిత్రమైందన్నారు. ఈ మాసంలో ముస్లింలు నిష్టగా ఉపవాసాలు చేసి నమాజు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారని గుర్తు చేశారు. కాబట్టి ఈ సమయంలో వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో గల మసీదులు, ఈద్గాల వద్ద పగడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా పారిశుధ్య కార్యక్రమలు నిర్వహించాలని, పాడైపోయిన అప్రోచ్ రోడ్లను సరిచేయాలని కోరారు. రాత్రి సమయంలో కూడా దైవిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నందున నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. అవసరమైన లైటింగ్ ఏర్పాటు చేయాలని, తాగు నీరు సరఫరా అంతరాయం లేకుండా చేయాలని, గ్యాస్ సిలిండర్ లకు కొరత రాకుండా చూడాలన్నారు. సాయంత్రం వారు షాపింగ్ చేసుకోవడానికి ట్రాఫిక్ సమస్యలు రాకుండా చూడాలన్నారు. వీధి కుక్కలు ఎక్కడ పడితే అక్కడ సంచరించకుండా వాటిని షెల్టర్ హోమ్లకు తరలించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీస్ రక్షణ చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంగా రంజాన్ మాస ఏర్పాట్లను చేయాలని ఆశించారు. మసీదుల సమీపంలో నిర్మాణంలో ఉన్న రహదారులను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ కుశాల్కర్, డీఆర్ఓ, డిస్టిక్ మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ నాగరాజమ్మ, సిద్దిపేట ఆర్డీవో సదానందం, డీపీఓ రవీందర్, జిల్లా పౌర సరఫరాల అధికారి తనూజ, డీఎం హెచ్ఓ డాక్టర్ ధనరాజ్, జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు, విద్యుత్ శాఖ అధికారులు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా రవాణా శాఖ అధికారి పి. శంకర్ నారాయణ భద్రత నియమ నిబంధనల పై అవగాహన కల్పించారు. సిద్దిపేట పట్టణంలోని క్రాంతి, సెలిస్టియల్, ఆదర్శ, మాస్టర్ మైండ్స్, ఏవీఎం విద్యార్థులతో కొత్త బస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సైకిల్ యాత్రను సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. మోటార్ వెహికిల్స్ ఇన్ స్పెక్టర్ పి. శంకర్ నారాయణ మాట్లాడుతూ రహదారి ప్రమాదాలు జరగకుండా ప్రతీ ఒక్కరు నిబద్ధతతో నిబంధనలు పాటించాలని సూచించారు. పిల్లలకు భద్రత నిబంధనలను వివరిస్తూ మైనర్లు ఎట్టి పరిస్థితిల్లో వాహనం నడప వద్దన్నారు. లైసెన్స్ పొందిన తరువాతనే వాహనాలు నడపాలని, లేనిచో మీ తల్లి తండ్రులకు జైలు శిక్ష వేయించిన వారవుతారన్నారు. అసిస్టెంట్ మోటార్ వెహికిల్స్ ఇన్ స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి సైకిల్ యాత్ర అనంతరం పిల్లలతో రహదారి భద్రత ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ వాసుదేవ రావు, రవాణా శాఖ , పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు



**ముద్ర, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో భారతీయ సాంస్కృతిక నాట్యశాస్త్ర పితామహుడు భరతముని ఆరాధనో త్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన స్వర మహతి కళా పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆశ్రమ పీఠాధిపతులు అవధూతగిరి, సిద్ధేశ్వరానందగిరి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. హైదరాబాద్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులు, కళాకారులు భరతమునిని స్మరించుకుంటూ భారతీయ శాస్త్రీయ నృత్య, సంగీత కళలను భక్తి భావంతో ప్రదర్శించారు. చిన్నారులు చేసిన లయాత్మక నృత్యాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. అన్నమయ్య సంకీర్తనలు, వేంకటేశ్వర స్వామి కీర్తనలు, శాస్త్రీయ సంగీత స్వరాలతో ఆశ్రమ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో ప్రతిధ్వనించింది. ఈ కార్యక్రమంలో ధనశ్రీ మఠాధిపతి వీరేశ్వర శివాచార్య , రాజయోగ ఆశ్రమ పీఠాధిపతి రాజయ్య స్వామి, జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్, గ్రామ సర్పంచ్ రాజు, హాజరైన కళాకారులను సన్మానించారు. ప్రముఖ సంగీత కళాకారులు ఆదిత్య కిరణ్, నర్సింగ్ రావు తదితరులు వేడుకలను పర్యవేక్షించారు.

# ఎక్సైజ్ సిబ్బంది ఆందోళన



**ముద్ర, నిజామాబాద్:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం ఎక్సైజ్ కిందిస్థాయి సిబ్బంది ఆందోళనకు దిగారు. స్మగ్లర్లను పట్టుకునే టాస్క్ వల్ల కిందిస్థాయి సిబ్బంది ప్రాణాలపైకి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రోజు నిజామాబాద్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ స్థాయి సిబ్బంది నగరంలోని సుభాష్ నగర్ లో గల ఎక్సైజ్ ఎస్హెచ్వో స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. శుక్రవారం రాత్రి నిజామాబాద్ నగర శివారులోని మాధవ్ నగర్ వద్ద ఓ కారులో నిర్మల్ జిల్లా నుండి గంజాయి తరలిస్తున్న విషయం తెలియడంతో ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో స్వప్న ఆధ్వర్యంలో సిబ్బంది గంజాయిస్ స్మగ్లర్లను పట్టుకునేందుకు ఘటన స్థలానికి వెళ్లినట్లు తెలిపారు. అయితే కారులో గంజాయి తరలిస్తున్న స్మగ్లర్లు కారును నిల్పకుండా ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను కారుతో గుద్ది పారిపోవడానికి ప్రయత్నించారని అన్నారు.

అయితే చట్ట వ్యతిరేక పనులు చేసే గంజాయి స్మగ్లర్లను పట్టుకునేందుకు వెళ్లే సమయంలో ముందస్తుగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా, పోలీసుల సహాయం లేకుండా, ఆయుధాలు లేకుండా అధికారులు తమను తీసుకువెళ్లి తమ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఎక్సైజ్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు.

కారుతో గుద్దిన ఘటనలో కానిస్టేబుల్ సౌమ్య చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుందని, ఆమె ప్రాణానికి ఎవరు బాధ్యులని ఆవేదన వ్యక్తం చేశారు. కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించి అండగా నిలవాలని డిమాండ్ చేశారు. సుమారు రెండు గంటల పాటు సిబ్బంది కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టిన విషయం తెలుసుకొని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, సూపరింటెండెంట్ మల్లారెడ్డి సిబ్బంది వద్దకు వెళ్లి కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి డిపార్ట్మెంట్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చి నచ్చజెప్పడంతో సిబ్బంది ఆందోళన విరమించారు.

# నేడు జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు

**కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**



**(ముద్ర ప్రతినిధి – ఉమ్మడి రంగారెడ్డి జిల్లా):** భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కేంద్రంతో పాటు, అన్ని అసెంబ్లీ నియోజక వర్గ కేంద్రాలు, మండల కార్యాలయాలు, పోలింగ్ బూత్ స్థాయిలో నిర్వహించ బడుతుందని పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమం సందర్భంగా ఓటర్లకు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ నిర్వహించే ఈ ర్యాలీలో విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఓటరు చైతన్య కార్యక్రమంలో భాగంగా పోలింగ్ ఇటీవల కొత్తగా ఓటరుగా నమోదైన యువతకు ఓటరు ఫొటో గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తారని వెల్లడించారు. సీనియర్ సిటిజన్లను సన్మానించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో ప్రజలు, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

# విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

**ముద్ర, రాయపోల్:** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల విద్యాధికారి రాజగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం మండల సీఎం కప్-2025 క్లస్టర్ లెవల్ క్రీడలను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రామారంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎంతోమంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని వారి ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి క్రీడోత్సవాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడల్లో మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. మానసిక ఉల్లాసానికి క్రీడోత్సవాలు ఎంతో దోహద పడతాయన్నారు. చదువుతోపాటు విద్యార్థులు పాఠశాల స్థాయిలో రాణిస్తే గ్రామాలకు, పాఠశాలకు మంచి గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో జరిగిన క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను మండల స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ప్రధానోపాధ్యాయులు రాజగోపాల్ రెడ్డి, పీఈటీ రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తాం




**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** విద్యాభివృద్ధితో పాటు పాఠశాల సమస్యల పరిష్కారం కోసం గ్రామపంచాయతీ పాలకవర్గం సంపూర్ణ సహకారాలు అందిస్తుందని రామంచ సర్పంచ్ ఎర్ర భవాని నవీన్ కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని రామంచ ప్రాథమిక పాఠశాలలో గ్రామపంచాయతీ నూతన పాలక వర్గానికి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నప్పుడు నుంచి విద్యార్థులు చక్కగా చదువుకోవాలని సూచించారు. ప్రతి రోజు బడికి వచ్చి ఉపాధ్యాయులు బోధించిన విషయాలను శ్రద్ధగా విని, ఎప్పటికప్పుడు హోం వర్క్ పూర్తి చేయాలని కోరారు. పాఠశాలలో ఏ సమస్యలున్న తమ దృష్టికి తీసుకొస్తే వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఉపాధ్యాయులు చేస్తున్న కృషికి తాము సైతం సహకరిస్తామన్నారు. ప్రధానోపాధ్యాయులు సురేష్ కుమార్ బాట్లాడుతూ గ్రామం నుంచి ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా పాలకవర్గం చూడాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి క్రమశిక్షణ అలవర్చుతామని, ఇందుకు పాఠశాల ప్రతిష్ఠానికి సహకారం అందించాలని కోరారు. పిల్లలను ప్రైవేట్ పాఠ శాలలకు వెళ్లకుండా కృషి చేస్తామని పాలకవర్గం ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పాలకవర్గం అందరితో కలిసి భోజనం చేశారు. అమ్మ కమిటీ చైర్పర్సన్ ప్రేమలత, ఉప సర్పంచ్ పావని తిరుపతిరెడ్డి, సభ్యులు సురేందర్ రెడ్డి, రాజేందర్, కనకయ్య, పరశురాములు, రాజు, కనకరాజు, భారతవ్వ, రమ, సంతోష, సుమలత, ఉపాధ్యాయులు సునీత, ఆబేద బేగం, నాగమణి, వరప్రసాద్, యాదయ్య, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి మహాహ్మాయి ఆలయ బ్రహోత్సవాలు



**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** జిల్లా కేంద్రంలోని మహాహ్మాయి దేవాలయ 126వ వార్షిక బ్రహోత్సవాలు సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా స్వర్ణకార సంఘం కన్వీనర్, కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం, ఆలయ అర్చకుడు శంకరా చారి తెలిపారు. శనివారం ఆలయ కమిటీ, బులియన్ మర్చంట్, పట్టణ స్వర్ణకార సంఘం ప్రతినిధులు వార్షిక బ్రహోత్సవాల కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 7 వరకు బ్రహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా 13 రోజుల పాటు ఉదయం శత చండీ యాగం, సాయంత్రం 108 మంది ముత్తైదువులతో కోటి లలితా పారాయణయు నిర్వహించనున్నట్లు చెప్పారు. అదే విధంగా 26న గ్రామ దేవతల పూజలు, 27న సుప్రభాత సేవ, ధ్వజరోహనం, గోపూజ, యాగశాల ప్రవేశం, సర్వ మంటపదేవతా ఆవాహనలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 28న లక్ష గరిక పూజ, లక్ష ఉండ్రాల నివేదన పూజ, 29న శ్రీ మేధా దక్షిణ మూర్తి పూజ, లక్ష పుష్పార్చన, సరస్వతీ పూజ, 30న కుంకుమార్చనలు, సహస్ర కమలార్చన, 31న లక్ష తులసీదలార్చన, నాగవల్లి దళార్చన, మహా దీపోత్సవం, ఫిబ్రవరి 1న శ్రీ పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, పల్లకి సేవా, 2న మహా లింగార్చన, ఏకాదశ రుద్రాభిషేకం, మహా బిల్వార్చన, 3న లక్ష గౌరమ్మల పూజ, 11 వేల ఒక వంద పదహారు గాజులు, 9 వేల పసుపు కొమ్ములతో శ్రీ మహామ్మాయమ్మ దేవికి విశేష పూజ, 4న అష్టోత్తర శత కలశాభిశేకం, 5న అమ్మవార్లకు సుగంధ ద్రవ్యాలతో మహాభిషేకం, 6న మహా పూర్ణాహుతి, సుహాసిని, కుమారి పూజ, 7న రథోత్సవం, కోమటి చెరువులో చక్రస్నానం, మహా సంప్రోక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాద , రాత్రి అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు. ధర్మవరం వెంకట నర్సయ్య, కిష్టపురం ప్రభాకర్, కల్లెపల్లి మహేష్, మోహన్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు



**ముద్ర, హైదరాబాద్:** గిరిజన విద్యార్థుల భవిష్యత్తుతో అధికారులు చెల గాటం ఆడొద్దని బాలల హక్కుల సంక్షేమ సంఘం (బీహెచ్ఎస్ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిఇంజమూరి రఘునందన్ ఒకక ప్రకటనలో కోరారు. మెదక్ జిల్లా, రేగోడ్ మండలంలోని పెద్దతండ డీఎస్టీ ప్రాథమిక పాఠశాలపై అధికారుల పర్యవేక్షణా లోపం, ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వెరసి గిరిజన విద్యార్థుల విద్యాభ్యాసానికి శాపంగా మారిందన్నారు. తండా ప్రాథమిక పాఠశాలలో 45 మంది విద్యా ర్థులు విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. ఈ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులకు గాను ఒక ఉపాధ్యాయుని పోస్టు ఖాళీగా ఉందని, ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఒక ఉపాధ్యాయురాలు జులై 2025 నుంచి దీర్ఘకాలిక సెలవులో ఉన్నారన్నారు. ఇంకో ఉపాధ్యాయుడు సెప్టెంబర్ 2025 నుంచి ఉన్నత విద్యాభ్యాసం కోసం స్టడీ లీవు పెట్టారన్నారు. గత సంవత్సరం జూలై నుంచి రెగ్యులర్ ఉపాధ్యాయులు లేకపోవడంతో డిప్యూటేషన్ ఉపాధ్యాయులతోనే స్కూలు నడుస్తుందని కాంప్లెక్స్ హెడ్మాస్టర్ నెల్లుట్ల ప్రేమ్ ప్రసాద్ రావు తెలిపారన్నారు. ఎంఇఓ గురునాథ్ కు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
25.01.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ప్రపంచ వింత : క్రైస్ట్ ది రిడీమర్**

బ్రెజిల్‌లోని రియో డి జనీరో నగరంలో కొండపై ఉన్న భారీ యేసుక్రీస్తు విగ్రహం. ఇది సుమారు 98 అడుగుల ఎత్తు ఉంటుంది (పీఠం కాకుండా). శాంతికి చిహ్నంగా రెండు చేతులను చాచి ఉన్నట్లు ఈ విగ్రహాన్ని రూపొందించారు. దీనిని నిర్మించడానికి కాంక్రీటు మరియు సోప్‌స్టోన్‌ను ఉపయోగించారు. ఇది బ్రెజిల్ దేశానికే ఒక ఐకాన్ లాంటిది.



# అమరావతిని ప్రపంచ శ్రేణి నగరంగా నిర్మిస్తాం

- చిత్తూరు జిల్లాలోనే నా రాజకీయ జీవితం ప్రారంభమైంది
- టెక్నాలజీతోనే సంపద పెరుగుతుంది
- ఏపి సీఎం చంద్రబాబు నాయుడు

**ముద్ర, చిత్తూరు:**

ఎవరు అడ్డుకున్నా అమరావతిని ప్రపంచ శ్రేణి నగరంగా నిర్మించి తీరుతామని ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లాలోని నగరిలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్యర్థాల సేకరణకు ఏర్పాటు చేసిన స్వచ్ఛ రథాలను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి మెప్మా, డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం నగరిలో అమృత్ 2.0 కింద రూ.20.13 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. నగరి మున్సిపాలిటీలో నీటి సరఫరా పథకం మెరుగుదలకు రూ.13.96 కోట్లు, కాలనీ ప్రాంతాలకు నీటి సరఫరా మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 3.97 కోట్లు, నగరి మున్సిపాలిటీ పరిధిలోని సాయిబాబా ఆలయం సమీపంలో ఉన్న సురగుంట చెరువు పునరుద్ధరణ రూ. 2.20 కోట్లతో పనులు చేపట్టేందుకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం ప్రజావేదిక సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. చిత్తూరు జిల్లాలోనే యాభై ఏళ్ల క్రితం నా రాజకీయ జీవితం ప్రారంభమైందని గుర్తు చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్నానని తెలిపారు. దావోస్ కు వెళ్లి రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నాని పేర్కొన్నారు. గతంలో తాను టెక్నాలజీ అంటే అవహేళన చేశారని, ఇప్పుడు అదే టెక్నాలజీ మన సంపదను పెంచిందన్నారు. రాబోయే రోజుల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఏఐ డాక్టర్ ప్రతీ ఒక్కరి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టే పరిస్థితి వస్తుందన్నారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా అందరి ఆరోగ్యం కాపాడేలా ప్రయత్నం చేస్తున్నామన్నారు.

గతంలో నిరంతర విద్యుత్ సరఫరా కోసం ఇబ్బందులు ఎదుర్కోనే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు పీఎం సూర్యఘర్, కుసుమ్ పథకాల ద్వారా ఇళ్లపైనా, పొలాల్లో సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకారం అందిస్తుందన్నారు. గ్రీన్ అమ్మోనియా, హైడ్రోజన్ లాంటి ఉత్పత్తి కూడా చేసే దిశగా అడుగులు వేశామన్నారు. 20 లక్షల మంది రైతులు ప్రకృతి సేద్యం చేసేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎరువులు, పురుగుమందులు విచ్చలవిడిగా వినియోగించటం వల్ల భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి శాశ్వతంగా పరిష్కరించేందుకు ఓ ప్రణాళికను తీసుకువస్తామన్నారు. దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. 2024 వరకూ రాష్ట్రంలో భయంకరమైన సైకో, రాక్షస పాలన నడిచిందన్నారు. అక్రమ కేసుల్లో అరెస్టు చేసి కోర్టుకు కూడా వెళ్లకుండా తనను జైలుకు పంపించారని గుర్తు చేశారు. సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేసి సంక్షేమాన్ని చేపడుతున్నామన్నారు. అదే సమయంలో అభివృద్ధి కూడా చేస్తున్నామని తెలిపారు.

# నాంపల్లిలో భారీ అగ్ని ప్రమాదం

- నాంపల్లిలో భారీ అగ్ని ప్రమాదం
- ఫర్నీచర్ షాపులో చెలరేగిన మంటలు
- అరగంట వ్యవధిలోనే నాలుగు అంతస్తులకు వ్యాప్తి
- భయంతో పరుగులు పెట్టిన ప్రజలు
- రెస్క్యూను పరిశీలించిన కలెక్టర్, సీపీ
- విచారం వ్యక్తం చేసిన మంత్రి పొన్నం

**ముద్ర, హైదరాబాద్:**











హైదరాబాద్ లోని నాంపల్లిలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. నగరంలోని రద్దీ ప్రాంతమైన స్టేషన్ రోడ్డులోని బచ్చాస్ క్యాస్టిల్ ఫర్నీచర్ షాప్ లో శనివారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలోనే భవనం మొత్తానికి వ్యాపించాయి. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మొదట భవనం కింద ఉన్న సెల్లార్‌లోని హోల్‌సేల్ ఫర్నీచర్ షాపులో మంటలు ప్రారంభమయ్యాయి. లోపల ఫర్నీచర్ సామాగ్రి అధికంగా ఉండటంతో మంటలు వేగంగా పై అంతస్తుల వరకు వ్యాపించాయి. దట్టమైన పొగలు పరిసర ప్రాంతాలను కమ్మేయడంతో జనం పరుగులు తీశారు. ప్రమాద సమయంలో భవనంలో ఇద్దరు నుంచి నలుగురు పిల్లలు చిక్కుకున్నట్లు వార్తలు రావడంతో ఆందోళన నెలకొంది. అగ్నిమాపక సిబ్బంది రాకముందే స్థానిక యువకులు సహసించి భవనంలోకి వెళ్లి పిల్లలను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. భవనంలోని మిగిలిన కుటుంబాలను, పక్కనే ఉన్న రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లోని నివాసితులను అధికారులు వెంటనే ఖాళీ చేయించారు. ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న మంటలను ఆర్పేందుకు ఎనిమిది ఫైరింజన్లతో అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నించారు. భవనం ఇరుకైన సందులో ఉండటం, చుట్టూ సెట్‌బ్యాక్స్ లేకపోవడంతో అగ్నిమాపక యంత్రాలు లోపలికి వెళ్లడానికి వీలు పడలేదు. దీంతో సిబ్బంది పక్కనే ఉన్న భవనాల గోడలపైకి ఎక్కి ప్రాణాలకు తెగించి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. ప్రధాన రహదారిపైనే ఈ ప్రమాదం జరగడంతో నాంపల్లి నుంచి అబిడ్స్ వెళ్లే మార్గంలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పరిస్థితిని గమనించిన ట్రాఫిక్ పోలీసులు వెంటనే వాహనాల రాకపోకలను ఇతర మార్గాల్లోకి మళ్లించారు.

**రంగంలోకి రోబో ఫైర్ మిషన్:**

పోలీసులు, హైడ్రా, విపత్తు నిర్వహణ బృందాలు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించాయి. ఘటనా స్థలంలో జేసీబీ, భారీ క్రేన్లతో సహాయక చర్యలు చేపట్టినా అగ్నికీలలు, దట్టమైన పొగ, కారణంగా సిబ్బంది లోపలికి వెళ్లేందుకు వీలుకాలేదు. దీంతో రోబో అధికారులు ఫైర్ మిషన్‌ను రంగంలోకి దింపారు. విషయం తెలుసుకున్న నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడ సహాయ చర్యలు పరిశీలించారు. అక్కడ మీడియాతో మాట్లాడారు. ప్రాథమిక సమాచారం ప్రకారం షార్ట్ సర్క్యూట్ తో ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఇటు హైదరాబాద్ కలెక్టర్ హరిచందన సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ ప్రాంతానికి ఎవరూ రావొద్దని.. వాహనదారులు కూడా ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని కోరారు.

**హైకోర్టు ఆదేశాలు బేఖాతర్..**

ఇరుకైన స్థలంలో నిర్మించిన ఈ భవనంలో ఏర్పాటు చేసిన దుకాణాలను తక్షణమే తొలగించాలని హైకోర్టు గతంలోనే ఆదేశాలు సైతం చేసింది. హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేసిన అక్రమార్కులు అక్కడ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ప్రమాదం జరిగిన భవనాన్ని 1960లోనే నిర్మించారు. అచ్యుత్ రెడ్డి అనే వ్యక్తి ఈ ఖాళీ స్థలం ఇవ్వగా, పలువురు దాతల విరాళాలతో హిందీ ప్రచార సభ పేరుతో నిర్మించారు. కాగా కొన్నేళ్లుగా ఆ భవనం అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లింది. దీంతో అందులో షాపులు వెలిశాయి. ఈ విషయాలను కలెక్టర్ హరిచందన దాసరి ధృవీకరించారు. ప్రమాదంపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించినట్లు చెప్పారు. ఇప్పటికే దర్యాప్తు ముమ్మరం చేసినట్లు తెలిపారు.

**ఇన్ చార్జి మంత్రి ఆరా ..**

నాంపల్లిలో అగ్ని ప్రమాదంపై హైదరాబాద్ ఇన్ చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ విచారం వ్యక్తం చేశారు. కలెక్టర్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్లతో ఫోన్ లో మాట్లాడారు. మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ సంఘటన స్థలాన్ని చేరుకొని పరిశీలించి సంఘటన వివరాలు తెలుసుకున్నారు.. కుటుంబ సభ్యుల్ని ఓదార్చారు.. రెస్క్యూ కొనసాగుతోంది. నాంపల్లి అగ్నిప్రమాదంపై ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ కీలక ప్రకటన చేశారు. ఫర్నిచర్ షాపులో మంటలు అదుపులోకి వచ్చాయని ప్రకటించారు. దట్టమైన పొగ ఉండటంతో సెల్లార్‌లోకి వెళ్లలేకపోతున్నాం. మరోవైపు అగ్నిప్రమాదం నేపథ్యంలో పోలీస్ కమిషనర్ సజ్జనార్ నగర ప్రజలకు ముఖ్య సూచనలు చేశారు. నగర ప్రజలు నుమాయిష్ పర్యటనను వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# బీజేపీతోనే మున్సిపాలిటీల అభివృద్ధి..

**ముద్ర, చొప్పదండి:**

బీజేపీతోనే మున్సిపాలిటీల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బీజేపీ చొప్పదండి పట్టణ శాఖ ఆధ్వర్యంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ చొప్పదండి మున్సిపాలిటీని బిజెపికి అప్పగిస్తే అభివృద్ధి ఏంటో చూపిస్తామని, పట్టణ రూపురేఖలు మారుస్తామన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు జరగబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీల అభివృద్ధికి గత బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిందేమీ లేదని ఆరోపించారు. పట్టణాల అభివృద్ధి వెనుకబాటుకు ఆ రెండు పార్టీలే కారణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా మున్సిపాలిటీల అభివృద్ధి కోసం ఒక్క పైసా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. కేంద్ర ప్రభుత్వ 15 వ ఫైనాన్స్ నిధుల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం నేడు మున్సిపల్ ఎన్నకలు నిర్వహిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పట్టణాల అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఆ దిశలోనే పట్టణాలను అమృత్ స్కీం లలో చేర్చిందని, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ను స్మార్ట్ సిటీ హోదా ఇచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే మున్సిపాలిటీల అభివృద్ధి జరుగుతుందన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ కి వేల కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సహకారంతో మున్సిపాలిటీలను అభివృద్ధి చేసే బాధ్యత బీజేపీ తీసుకుంటుందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులకు ఆకాశం ఇవ్వాలని కోరారు.

# రోడ్డు ప్రమాదాల నివారణలో భాగస్వామ్యం కావాలి

- హైదరాబాద్ కలెక్టర్ హరి చందన
- ఉత్తమ డ్రైవర్లకు అవార్డుల అందజేత

**ముద్ర, హైదరాబాద్:**

రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలని హైదరాబాద్ కలెక్టర్ హరి చందన దాసరి పిలుపునిచ్చారు. శనివారం ముషీరాబాద్ డిపోలో నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రీజియన్ లో ప్రమాద రహిత, అత్యధిక సర్వీస్ ఇచ్చిన ముగ్గురు డ్రైవర్లకు ప్రశంసాపత్రం, నగదు బహుమతితో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని కోరారు. వాహనాలు నడుపుతున్నప్పుడు హెల్మెట్, సీట్ బెల్టు, తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమన్నారు. ప్రతి ఒక్కరూ ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. రోడ్డు భద్రతపై ఆర్టీసీ డ్రైవర్లు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి ఫ్రీ బస్ పథకం విజయవంతంగా కొనసాగుతోందన్నారు.

ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ ఈడీ ఎం. రాజశేఖర్ మాట్లాడుతూ డ్రైవర్లకు వాహనం నడపటం ప్రతిరోజు ఒక పరీక్ష అన్నారు. అయినా ప్రయాణీకులను సురక్షితం గా గమ్య స్థానానికి చేర్చుతున్నారన్నారు. ప్రయాణీకుల భద్రతకు ఆర్టీసీ ప్రాధాన్యమిస్తోందన్నారు. రీజినల్ మేనేజర్ సుధా పరిమళ మాట్లాడుతూ ప్రయాణికుల భద్రతే ధ్యేయంగా నడుస్తున్న ఆర్టీసీ హైదరాబాద్ రీజియన్ లో ప్రతి సోమవారం భద్రతా సోమవారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అంతకు ముందు రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కలెక్టర్ నేతృత్వంలో రోడ్డు భద్రతా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ముషీరాబాద్ డిపో నుంచి ఆర్టీసీ ఎక్స్ రోడ్స్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రోడ్డు భద్రతపై నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, డిపో మేనేజర్లు, సూపర్ వైజర్లు, తహసీల్దార్ రాణా ప్రతాప్ సింగ్ పాల్గొన్నారు.







# నిర్దిష్ట కాలపరిమితితో ఉద్యోగ నియామకాలు

- వికసిత్ భారత్ లక్ష్యంలో యువత భాగస్వామ్యం కావాలి
- ఉద్యోగ మేళాలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

అన్ని మంత్రిత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడానికి నిర్దిష్ట కాల పరిమితితో నియామక ప్రక్రియలను చేపడుతోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. శనివారం చాంద్రాయణగుట్టలోని సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో నిర్వహించిన 18వ విడత ఉద్యోగ మేళాలో ఆయన పాల్గొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 213 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఉద్యోగం పొందిన వారిలో 15 మంది మహిళలు ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాల్లో నియామక ప్రక్రియ క్రమబద్ధీకరణ, వేగవంతం కోసం 2022 నుంచి రోజ్‌గార్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా ఉద్యోగాల్లో నియమితులైన యువత వికసిత్ భారత్ లక్ష్యంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

ప్రస్తుతం ప్రపంచం అనిశ్చితుల మధ్య ప్రపంచ దేశాలకు భారత్ నమ్మకమైన గమ్యస్థానంగా ఉందని పేర్కొన్నారు. ఆయా దేశాల నుంచి వచ్చే కొత్త పెట్టుబడులు మన దేశంలో ఉద్యోగాలను సృష్టించడంలో సహాయపడతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సౌత్ జోన్ మెడికల్ ఐజీ గణేష్ చంద్ర పాడి, హైదరాబాద్ సెంటర్ డీఐజీ ఉదయ భాస్కర్ బిల్లా, కమాండెంట్ మోహన్ దాస్ కోబ్రగాడే తదితరులు పాల్గొన్నారు.



# జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ ను విలీనం చేయాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- ఎమ్మెల్యే గణేష్ దీక్షకు మద్దతు తెలిపిన మంత్రి

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ చేస్తున్న దీక్షకు హైదరాబాద్ జిల్లా ఇన్ చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మద్దతు తెలిపారు. కంటోన్మెంట్ విలీనానికి సంబంధించి కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్, రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు లేఖలు రాస్తూ వెంటనే విలీనానికి సంబంధించిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ప్రకటన విడుదల చేశారు. అభివృద్ధి సమానంగా జరగాలని కంటోన్మెంట్ పేరుతో జరుగుతున్న వివక్షపై చేస్తున్న దీక్షకు మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయం త్వరగా తీసుకోవాలని, కంటోన్మెంట్ ప్రజల సమస్యలు తీర్చేలా విలీనం త్వరగా జరపాలని కోరారు.

# టెండర్ల రద్దుకు కారణాలు బయటపెట్టండి

- టెండర్ల రద్దుకు కారణాలు బయటపెట్టండి
- డిప్యూటీ సీఎంకు ఎమ్మెల్సీ దాసోజు డిమాండ్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ టెండర్లు ఏ కారణంతో రద్దు చేశారో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి కనుసన్నల్లోనే సింగరేణి టెండర్ల స్కామ్ జరిగిందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి అనుయాయులకు, బామ్మర్దికి ఇచ్చిన టెండర్లు కూడా ఎందుకు రద్దు చేయరని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి తన బామ్మర్ది కళ్లలో సంతోషం చూసేందుకు బొగ్గు గనులు కట్టబెట్టే ప్రయత్నం చేశారన్నారు. ఈ విషయంలో భట్టి విక్రమార్క మాటలతో నిరూపితం అయిందన్నారు. రేవంత్ రెడ్డి తన బామ్మర్దికి తప్పుడు పద్ధతిలో టెండర్ ఇచ్చారా.. లేదా? సమాదానం చెప్పాలన్నారు. విచారణకు మీనమేషాలు ఎందుకని ప్రశ్నించారు. లాల్ బహదూర్ శాస్త్రి లాగా టెండర్లు రద్దు చేశామని భట్టి తాను నిజాయితీపరుడని చెప్పుకొనే ప్రయత్నం చేశారన్నారు. భట్టిపై ప్రచారం వెనక కథ, స్క్రీన్‌ప్లే మొత్తం రేవంత్ రెడ్డే అని దాసోజు ఆరోపించారు. బొగ్గు కుంభకోణంపై హరీశ్‌రావు ఆధారాలతో బయటపెట్టారని చెప్పారు. హరీశ్‌రావు మాట్లాడగానే సిట్ నోటీసులు ఇచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. పోలీసు అధికారులతో ప్రకటనలు ఇప్పిస్తున్న అధికార పార్టీ నేతలు మీడియాకు లీకులు ఇచ్చి వార్తలు వేయిస్తున్నారని పేర్కొన్నారు.






# బాలిక సాధికారతే సమాజ భవిష్యత్తు

- **లింగ వివక్షకు తావు ఇవ్వొద్దు : జస్టిస్ పి. సామ్ కోషీ**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

బాలికలను శక్తివంతులుగా తీర్చిదిద్దడం అన్ని వ్యవస్థల ప్రధాన బాధ్యత అని హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ పి.సామ్ కోషీ అన్నారు. బాలికలు శక్తివంతమైతే కుటుంబం బలపడుతుందని, కుటుంబాలు బలపడితే దేశ భవిష్యత్తు సుస్థిరమవుతుందని తెలిపారు. బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, లింగ వివక్షను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. బాలికలపై వివక్ష తొలగింపు, సమానత్వ ప్రోత్సాహం కోసమే ప్రతి సంవత్సరం జనవరి 24న జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**2కే రన్ ర్యాలీ..**

జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర, హైదరాబాద్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సంయుక్తంగా, అసోసియేషన్ ఫర్ వాలంటరీ యాక్షన్ సహకారంతో హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో 2కే రన్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జస్టిస్ పి.సామ్ కోషీ జెండా ఊపి ప్రారంభించారు. తెలంగాణ హైకోర్టులో దేశంలోనే అత్యధిక సంఖ్యలో మహిళా న్యాయమూర్తులు ఉన్నారని, ఎంపిక ప్రక్రియలో 60 శాతం కంటే ఎక్కువ మంది మహిళలే ఎంపికవుతున్నారని గర్వంగా పేర్కొన్నారు.



**విద్యార్థులకు ప్రశంసా పత్రాల అందజేత..**

ఈ సందర్భంగా జస్టిస్ సురేపల్లి నందా మాట్లాడుతూ బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యం, పోషణపై అవగాహన కల్పించడమే ఈ దినోత్సవ లక్ష్యమని తెలిపారు. మహిళలు, బాలికలపై నేరాల నివారణకు వేగవంతమైన దర్యాప్తు, కఠిన చర్యలు అవసరమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు జస్టిస్ నర్సింగ్ రావు నందికొండ, ఈ.వి.వెంకుగోపాల్, జస్టిస్ రెనుక యారా, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ బి. సురేష్, సీబీఐ కోర్టు ప్రిన్సిపల్ జడ్జి పట్టాభి, అదనపు జిల్లా సెషన్స్ జడ్జీలు అనిత, వినోద్, తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ పంచాక్షరి, హైదరాబాద్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఆశారాణి, స్వచ్ఛంద అసోసియేషన్ డైరెక్టర్ వినయ్ సింగ్, ఇతర న్యాయాధికారులు, న్యాయ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

# అత్యవసర చికిత్సకు సీఎంఆర్ఎఫ్ సహాయం



- **చెక్కు అందజేసిన చైర్మన్ అరికెపూడి గాంధీ**

**ముద్ర, శేరిలింగంపల్లి :**

శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని శేరిలింగంపల్లి డివిజన్ పరిధి గోపి నగర్ కాలనీకి చెందిన భరత్ రావుకు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయగా రూ. 2లక్షల 50వేల చెక్కు మంజూరైనట్లు చైర్మన్ అరికెపూడి గాంధీ తెలిపారు. ఈ చెక్కును ఆయన బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారబోయిన రాజు యాదవ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, అన్వర్ షరీఫ్, దామోదర్ రెడ్డి, కరుణాకర్ గౌడ్, సత్యనారాయణ, బ్రిక్ శ్రీనివాస్, అనిల్ కాపూరి తదితరులు పాల్గొన్నారు.

**-బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ..**

నియోజకవర్గ పరిధిలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బలింగ్ యాదగిరి గౌడ్, మన్నేపల్లి సాంబశివ రావు, సంజు, కామోజీ, లక్ష్మణ్, విష్ణు, బాలకృష్ణ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



# స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా కాప్రాలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్

- **రోడ్లపై స్క్రాప్ వాహనాలపై చర్యలు**

**ముద్ర, కాప్రా :**

స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి ఆధ్వర్యంలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారుల పక్కన వాహనదారులు, పాదచారులకు ఇబ్బంది కలిగిస్తూ బైక్, కార్, ఆటో రిపేరింగ్ సెంటర్ల వద్ద రోడ్లపై స్క్రాప్ వాహనాలు ఉంచిన షాపు యజమానులపై అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. రోడ్లపై అక్రమంగా నిలిపిన స్క్రాప్ వాహనాలపై పెనాల్టీలు విధించడంతో పాటు, కొన్ని ప్రాంతాల్లో వాటిని జీహెచ్ఎంసీ వాహనాల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. వ్యాపారస్తులు తమ స్క్రాప్ వాహనాలను తప్పనిసరిగా తమ సొంత ప్రాంగణంలోనే ఉంచాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ ప్రజారోగ్యం, పారిశుద్ధ్యానికి హానికరంగా వ్యవహరిస్తే చట్టరీత్య కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారీ పెనాల్టీలతో పాటు వాహనాల జప్తు కూడా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రవి, శానిటరీ సూపర్వైజర్ సుదర్శన్‌తో పాటు పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు. సాకేత్ రోడ్డులో నిర్వహించిన తనిఖీల్లో ఐదుగురు షాపు యజమానులకు పెనాల్టీ విధించి, ఒక స్క్రాప్ వాహనాన్ని డంపింగ్ యార్డుకు తరలించినట్లు అధికారులు వెల్లడించారు.



# నిరాడంబర వివాహంతో ఆదర్శంగా నిలిచిన 'సివిల్స్' దంపతులు

**ముద్ర, చౌటుప్పల్ :**

ఉన్నత హోదాల్లో ఉన్నా ఆడంబరాలకు దూరంగా సాదాసీదా వివాహం చేసుకుని ఐఏఎస్.. ఐపీఎస్ అధికారులు సమాజానికి ఆదర్శంగా నిలిచారు. చౌటుప్పల్ మండలం లింగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన యువ ఐపీఎస్ అధికారిణి శేషాద్రిని రెడ్డి, కడప జిల్లాకు చెందిన ఐఏఎస్ అధికారి శ్రీకాంత్ రెడ్డి వివాహం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శనివారం చట్టబద్ధంగా జరిగింది. ఎలాంటి ఆడంబరాలు, హంగులు లేకుండా కేవలం కుటుంబ సభ్యులు, సన్నిహితులు, కొందరు ఉన్నతాధికారుల సమక్షంలో రిజిస్టర్ కార్యాలయంలో సంతకాలు చేసి పూలమాలలు మార్చుకొని ఈ జంట ఒక్కటయ్యారు. ప్రస్తుతం శేషాద్రిని రెడ్డి కుత్బుల్లాపూర్ డీసీపీగా విధులు నిర్వహిస్తుండగా.. శ్రీకాంత్ రెడ్డి ఐఏఎస్ శిక్షణలో ఉన్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసే వివాహాల మధ్య ఇలాంటి నిరాడంబర పెళ్లి ఎంతో గొప్పదని, సామాన్యులకు ఇది స్ఫూర్తిదాయకమని అక్కడికి వచ్చిన అధికారులు కొనియాడారు. ఉన్నత విద్య, బాధ్యతాయుతమైన పదవులు కలిగిన ఈ జంట తీసుకున్న నిర్ణయంపై నెటిజన్లు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- **డీసీపీ అరవింద్ హెచ్చరిక**

**ముద్ర, మెహదీపట్నం :**

రోజుకో కొత్త పద్ధతితో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసగిస్తున్నారని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్ సూచించారు. గోల్కొండ కోటలో విద్యార్థులు, పర్యాటకులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ నిర్వహించిన చైతన్య కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సైబర్ నేరస్తులు చేసిన వివిధ మోసాలను వీడియోల రూపంలో ప్రదర్శించి, ప్రజలకు జాగ్రత్తలు వివరించారు. డీసీపీలు చంద్రమోహన్, అరవింద్ మాట్లాడుతూ.. సైబర్ మోసాల వల్ల కొందరు ఆర్థికంగా, మరికొందరు మానసికంగా తీవ్రంగా నష్టపోతున్నారని, కొన్నిసార్లు ప్రాణాలు కూడా కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.




తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయని ఆశ చూపుతూ షేర్ మార్కెట్, పెట్టుబడుల పేరుతో లింకులు పంపించి మోసగిస్తున్నారని తెలిపారు. తెలియని ఏపీకే యాప్స్ లింకులు తెరవకూడదని, నెట్వర్క్ మార్కెటింగ్, వలపువల వంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మనకు సంబంధం లేని మెసేజులు, చలాన్ల పేరుతో వచ్చే లింకులు తెరవకూడదని, మోసం జరిగిన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్లు సైదులు, రమేష్ నాయక్, వెంకట్ రాములు, నాయకులు రాజు వస్తాద్, చంటి బాబు తదితరులు పాల్గొన్నారు.

# రూ.17లక్షల విలువైన 64 మొబైల్ ఫోన్లు రికవరీ

- **యజమానులకు తిరిగి అప్పగింత**

**ముద్ర, శేరిలింగంపల్లి :**

పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోయిన రూ.17లక్షల విలువైన 64 మొబైల్ ఫోన్లను గుర్తించి, శనివారం సంబంధిత యజమానులకు పోలీసులు తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి మాట్లాడుతూ ఫిర్యాదుల ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మొబైల్ ఫోన్లను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మొబైల్ ఫోన్ పోయిన వారు వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ సీఈఐఆర్ పోర్టల్‌లో తమ మొబైల్ వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఏసీపీ వెంట పేట్‌బషీరాబాద్ పీఎస్ ఎస్‌హెచ్‌వో కె. విజయ వర్ధన్, డీఐ డి. అజయ్ కుమార్, డీఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.





# ధర్మ పరిరక్షణ సభకు శేరిలింగంపల్లి నుంచి భారీ హాజరు

- **రవికుమార్ యాదవ్ పిలుపు**

**ముద్ర, శేరిలింగంపల్లి :**

భాగ్యనగర్ ఉత్సవ కమిటీ, గణేష్ సేన ఆధ్వర్యంలో 'జాగో భాగ్యనగర్ – ఛలో బాలాపూర్' నినాదంతో నిర్వహించిన ధర్మ పరిరక్షణ సభకు శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు. బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ నేతృత్వంలో నియోజకవర్గ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ ధర్మ పరిరక్షణ కోసం అందరూ ఐక్యంగా ముందుకు రావాల్సిన సమయం వచ్చిందని, ప్రజల వ్యాపారాలు, భద్రతకు ముప్పుగా మారుతున్న అక్రమ చొరబాటుదారులపై కఠిన చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగాలని పిలుపునిచ్చారు. కొన్ని రాజకీయ పార్టీలు ఓట్ల రాజకీయాల కోసం అక్రమంగా ఓటర్ ఐడీ, ఆధార్ కార్డులు ఇప్పిస్తూ సమాజానికి ముప్పు తెస్తున్నాయని ఆరోపించారు. కల్తీ ఆహారం, వస్తువులు అమ్మడం, డ్రగ్స్ మాఫియాకు సహకరించడం, భూముల ఆక్రమణలు, దేవాలయాలపై దాడులు, అక్రమ గోవధ వంటి చర్యలు దేశ భద్రతకే ప్రమాదమని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుచ్చిరెడ్డి, అశోక్ కుమార్, నాగుల్ గౌడ్, అనిల్ గౌడ్, రామ్ రెడ్డి, రాధాకృష్ణ యాదవ్, మాణిక్, ఎల్లేష్, నరేందర్ యాదవ్, సంజీవ్ స్వామి గౌడ్, నరేందర్ ముదిరాజ్, వేణుగోపాల్ రెడ్డి, కృష్ణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# ఎంజీఎన్‌రేగా బచావో సంగ్రామ్ యాత్ర'

- **గ్రామీణ ఉపాధి పథకం నిర్వీర్యానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఉద్యమం**

**ముద్ర, హైదరాబాద్ :**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్‌రేగా) నిర్వీర్యానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు నిరసనగా హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో 'ఎంజీఎన్‌రేగా బచావో సంగ్రామ్ యాత్ర'కు శ్రీకారం చుట్టారు. మూడు రోజులపాటు సాగనున్న ఈ పాదయాత్రను శనివారం ప్రారంభించారు. తొలిరోజు చార్మినార్ నుంచి పురానాపుల్ వరకు, యాకుత్‌పురాలోని సింగరేణి కాలనీ నుంచి సంతోష్‌నగర్ ఎక్స్‌రోడ్స్ వరకు యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, సీనియర్ నాయకుడు వి. హనుమంతరావు మాట్లాడుతూ.. గ్రామీణ భారతానికి జీవనాధారంగా ఉన్న ఎంజీఎన్‌రేగా పథకాన్ని బలహీనపరిచే మార్పులను అడ్డుకోవడానికే ఈ ఉద్యమం చేపట్టినట్లు తెలిపారు.




హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు సయ్యద్ ఖాలిద్ సైఫుల్లా నేతృత్వంలో సాగుతున్న ఈ యాత్రను వివిధ నియోజకవర్గాల కాంగ్రెస్ ఇన్‌చార్జీలు సమన్వయం చేస్తున్నారు. మూడు రోజుల పాటు చార్మినార్, యాకుత్‌పురా, బహదూర్‌పురా, చంద్రాయణగుట్ట, మలక్‌పేట్ నియోజకవర్గాల మీదుగా ఈ ర్యాలీ సాగి 26న ముగియనుంది. నిరసన కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్, పీసీసీ కార్యదర్శి మాజీ భీమ్ అర్జున్ రెడ్డి, కె. రవిరాజ్, మామిడి కృష్ణకుమార్, అల్లం భాస్కర్, మల్లికార్జున్, అబ్దుల్ ఖదీర్, యూసుఫ్ దానిష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
25.01.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ప్రపంచ వింత : హ్యాంగింగ్ గార్డెన్స్**

ఇది ప్రాచీన ప్రపంచ వింతలలో ఒకటిగా పరిగణించబడుతుంది. ఇరాక్ (బాబిలోన్) ప్రాంతంలో మెట్ల వంటి నిర్మాణాలపై తోటలను పెంచేవారు. నీటిని ఎత్తుకు పంపి మొక్కలకు పోసే అద్భుత సాంకేతికత అప్పట్లోనే ఉండేది. రాజా నెబుకద్నెజరు తన భార్య కోసం వీటిని నిర్మించినట్లు చెబుతారు. ప్రస్తుతం ఇవి ఉనికిలో లేవు, కేవలం చారిత్రక ఆధారాల ద్వారానే మనకు తెలుసు.

# భారత్ ఫాంలోకి వస్తే ఇట్లుంటదీ

- ఇషాన్ కిషన్ మెరుపులు, సూర్య నాయకత్వంలో ఘన విజయం

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

రాయ్‌పూర్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా అద్భుత ప్రదర్శనతో అభిమానులను ఉర్రూతలూగించింది. టాస్ గెలిచిన భారత్ ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. అయితే తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ బ్యాట్స్‌మెన్ భారత బౌలర్లపై ఆధిపత్యం చూపిస్తూ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 208 పరుగులు చేశారు. భారీ స్కోర్‌తో మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారింది.

209 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. కేవలం ఆరు పరుగులకే ఇద్దరు ఓపెనర్లు పెవిలియన్ చేరారు. భారీ అంచనాలతో బరిలోకి దిగిన అభిషేక్ శర్మ ఖాతా తెరవకుండానే అవుట్ కాగా, సంజు శాంసన్ ఆరు పరుగులకే వెనుదిరిగాడు. ఈ దశలో భారత్ ఒత్తిడిలో పడింది.

అయితే ఆ పరిస్థితిని కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్ కలిసి పూర్తిగా మార్చేశారు. మూడో వికెట్‌కు 48 బంతుల్లోనే 122 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను భారత్ వైపుకు తిప్పారు. ఫలితంగా 6/2తో కష్టాల్లో ఉన్న జట్టు క్షణాల్లోనే 129/3కి చేరింది. ఇషాన్ కిషన్ అద్భుత బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. కేవలం 21 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసి, మొత్తం 32 బంతుల్లో 76 పరుగులు సాధించాడు. ఇందులో 11 ఫోర్లు, నాలుగు సిక్సర్లు ఉన్నాయి. ఏ బౌలర్‌నూ లెక్కచేయకుండా ఆడిన కిషన్ ఇన్నింగ్స్ రాయ్‌పూర్ మైదానాన్ని ఊపేసింది. రెండు సంవత్సరాల తర్వాత జట్టులోకి వచ్చిన కిషన్ ఇలాంటి ప్రదర్శన చేయడం విశేషంగా మారింది.

డొమెస్టిక్ క్రికెట్‌లో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో జార్ఖండ్ జట్టును విజేతగా నిలిపిన కిషన్‌కు, తిలక్ వర్మ గాయంతో అవకాశం లభించింది. తొలి మ్యాచ్‌లో విఫలమైనప్పటికీ, రెండో మ్యాచ్‌లో తన సత్తా ఏమిటో నిరూపించాడు.ఇక మరోవైపు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (50*), చివరివరకు నిలిచి జట్టుకు అండగా నిలిచాడు. కిషన్ మెరుపులు, సూర్య ప్రశాంత నాయకత్వంతో న్యూజిలాండ్ విధించిన 209 పరుగుల లక్ష్యం భారత్‌కు పెద్దగా కష్టంగా అనిపించలేదు. చివరకు టీమిండియా ఆడుతూ పాడుతూ లక్ష్యాన్ని ఛేధించి ఘన విజయం సాధించింది.



# ఒత్తిడిని తుడిచేసిన మిస్టర్ 360...

**సూర్యకుమార్ యాదవ్ ఫామ్‌లోకి రిటర్న్!**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

బంతి ఎటు వచ్చినా అదేవేగంతో బౌండరీ దాటించే అరుదైన నైపుణ్యం సూర్యకుమార్ యాదవ్‌కు మాత్రమే సొంతం. బౌలర్ ఎవరు, మైదానం ఎలా ఉన్నా పట్టించుకోకుండా తనదైన శైలిలో బ్యాటింగ్ చేస్తూ 'మిస్టర్ 360'గా గుర్తింపు తెచ్చుకున్నాడు. ముఖ్యంగా టీ20 ఫార్మాట్‌లో అతడి ఆట పూర్తిగా భిన్నంగా ఉంటుంది. స్వదేశం-విదేశం అన్న తేడా లేకుండా, అదే ఆత్మవిశ్వాసంతో రెచ్చిపోవడం అతడి ప్రత్యేకత.

అయితే ఇటీవలి కాలంలో సూర్యకుమార్ యాదవ్ వ్యక్తిగత ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేకపోవడం చర్చనీయాంశమైంది. కెప్టెన్‌గా జట్టును విజయపథంలో నడిపిస్తున్నప్పటికీ, బ్యాటింగ్‌లో మాత్రం అతడి ప్రభావం తగ్గినట్టుగా కనిపించింది. ఒకప్పుడు టీ20ల్లో వేగవంతమైన సెంచరీలతో ప్రత్యర్థులను వణికించిన అతడు, కొంతకాలంగా పెద్ద ఇన్నింగ్స్ ఆడలేకపోవడంతో విమర్శలు ఎదుర్కొన్నాడు. టీ20 వరల్డ్ కప్ సమీపిస్తున్న తరుణంలో ఈ ఫామ్ లోపం అతడిపై ఒత్తిడిని మరింత పెంచింది.

న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్ తొలి మ్యాచ్‌లో సూర్యకుమార్ 32 పరుగులు చేశాడు. అయితే అది అతడి స్థాయికి తగ్గ ఇన్నింగ్స్ కాదన్న అభిప్రాయం వ్యక్తమైంది. దీంతో అతడిపై విమర్శలు మరింత పెరిగాయి.

ఈ పరిస్థితుల్లో రెండో టీ20 మ్యాచ్‌లో భారత్‌కు ఆదిలోనే షాక్ తగిలింది. కేవలం 6 పరుగులకే ఇద్దరు ఓపెనర్లు అవుట్ కావడంతో జట్టు తీవ్ర ఒత్తిడిలో పడింది. అప్పుడు క్రీజులో నిలిచిన సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్‌తో కలిసి మ్యాచ్ దిశనే మార్చేశాడు. మూడో వికెట్‌కు 122 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పుతూ జట్టును ఆదుకున్నాడు.

సూర్యకుమార్ కేవలం 23 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసి, దాదాపు ఏడాది తర్వాత టీ20ల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. ఈ ఇన్నింగ్స్‌తో తనపై ఉన్న ఒత్తిడిని పూర్తిగా తొలగించుకున్నాడు. వరల్డ్ కప్‌కు ముందు ఆత్మవిశ్వాసాన్ని తిరిగి సంపాదించుకున్నట్లు కనిపించింది.ఈ మ్యాచ్‌లో డఫీ, సోధీ బౌలింగ్‌పై సూర్యకుమార్ చేసిన దాడి అభిమానులను ఉర్రూతలూగించింది. బంతిని మైదానం నలుమూలలా పంపుతూ తన అసలైన శైలిని ప్రదర్శించాడు. అర్ధశతకం పూర్తయ్యాక స్టేడియంలో అభిమానులు 'మిస్టర్ 360' అంటూ ప్లకార్డులు ప్రదర్శించడం, అతడి క్రేజ్‌కు మరోసారి నిదర్శనంగా నిలిచింది.

**నా భార్య సలహాతో మళ్లీ ఫామ్‌లోకి వచ్చా..**

రాయ్‌పూర్ వేదికగా శుక్రవారం జరిగిన టీ20 మ్యాచ్‌లో భారత్ ఏడు వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించింది. 210 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టును విజయానికి చేర్చాడు. కేవలం 37 బంతుల్లోనే 82 పరుగులు సాధించిన సూర్య, తొమ్మిది ఫోర్లు, నాలుగు సిక్సర్లతో మ్యాచ్‌ను ఒక్కతనే తిప్పేశాడు. మ్యాచ్ అనంతరం బీసీసీఐ విడుదల చేసిన వీడియోలో ఇషాన్ కిషన్‌తో కలిసి మాట్లాడిన సూర్యకుమార్ యాదవ్, తన ఫామ్ తిరిగి రావడంలో ఇంటి నుంచి వచ్చిన సలహాల పాత్రను వెల్లడించాడు. "ఇంట్లో కూడా ఓ కోచ్ ఉంటారు... నేను పెళ్లి చేసుకున్న కోచ్ నా భార్య దేవిషా శెట్టి. ఆమె నాకు చాలా దగ్గరగా ఉంటుంది, నా మనసు బాగా తెలుసు. ఆమె ఇచ్చిన సలహాల వల్లే చాలా రోజుల తర్వాత మళ్లీ ఫామ్‌లోకి వచ్చాను" అని సూర్య తెలిపాడు. తొలుత కొంచెం నెమ్మదిగా, జాగ్రత్తగా ఆడి ఇన్నింగ్స్ నిర్మించుకోవాలని భార్య సూచించిందని సూర్య వెల్లడించాడు. అదే విధానాన్ని పాటిస్తూ తన ఆటను మార్చుకున్నానని చెప్పాడు. ఇటీవల కొద్ది రోజులు విశ్రాంతి తీసుకుని, సోషల్ మీడియాకు దూరంగా గడపడం, నెట్స్‌లో కఠినంగా సాధన చేయడం తన ఆటపై సానుకూల ప్రభావం చూపిందని వివరించాడు. గమనార్హం ఏమిటంటే, సూర్యకుమార్ యాదవ్ 468 రోజుల తర్వాత, 24 ఇన్నింగ్స్‌ల అనంతరం టీ20ల్లో మళ్లీ అర్ధశతకం సాధించడం విశేషం. ఈ ఇన్నింగ్స్‌తో ఆయన ఆత్మవిశ్వాసం తిరిగి వచ్చిందని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# బంగ్లా బాటలోనే పాక్? వరల్డ్‌కప్‌పై పీసీబీ కొత్త బెదిరింపు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

భారత్, శ్రీలంక సంయుక్తంగా నిర్వహించనున్న టీ20 ప్రపంచకప్-2026 ప్రారంభానికి ముందే వివాదాలు ముదురుతున్నాయి. భారత్‌లో మ్యాచ్‌లు ఆడబోమని మొండిపట్టు పట్టిన బంగ్లాదేశ్‌ను టోర్నీ నుంచి తప్పించిన ఐసీసీ, ఆ స్థానంలో స్కాట్లాండ్‌కు అవకాశం ఇచ్చింది. ఈ నిర్ణయంతో ఇప్పుడు పాకిస్థాన్ పాల్గొనడంపైనా సందేహాలు మొదలయ్యాయి.

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు మొహ్సిన్ నఖ్వీ తాజా వ్యాఖ్యలు పరిస్థితిని మరింత ఉత్కంఠగా మార్చాయి. ప్రపంచకప్‌కు పాక్ జట్టును పంపాలా వద్దా అన్నది ఇంకా నిర్ణయించలేదని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే తాము ముందుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు. బంగ్లాదేశ్‌ను తప్పించడం ఐసీసీ ద్వంద్వ వైఖరిని చూపుతోందని, అవసరమైతే పాకిస్థాన్ కూడా బాయ్‌కాట్ అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

భారత్‌లో కాకుండా ఇతర వేదికల్లో మ్యాచ్‌లు ఆడేందుకు బంగ్లాదేశ్ సిద్ధమని తెలిపినా, ఐసీసీ ఆ ప్రతిపాదనలను తిరస్కరించింది. అప్పట్లో బంగ్లా మ్యాచ్‌లను పాకిస్థాన్‌లో నిర్వహిస్తామని పీసీబీ ముందుకొచ్చినా, 'గ్రూప్ స్వాపింగ్' ఆలోచనకు ఐసీసీ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు. చివరకు హెచ్చరికలను పట్టించుకోని బంగ్లాదేశ్‌ను తప్పించి స్కాట్లాండ్‌కు బెర్తు ఖరారు చేసింది. ఈ నిర్ణయంతో అసంతృప్తిగా ఉన్న పాకిస్థాన్ బోర్డు, బంగ్లాదేశ్‌కు మద్దతుగా కొత్తగా బాయ్‌కాట్ మాట ఎత్తుతోంది. అయితే పాక్ జట్టు తన గ్రూప్ మ్యాచ్‌లన్నీ శ్రీలంకలోనే ఆడాల్సి ఉండటంతో, పీసీబీ అభ్యంతరాలను ఐసీసీ పట్టించుకునే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి.



# ఐపీఎల్ ముందు సీఎస్‌కేకు భారీ షాక్... రూ.14.2 కోట్ల ఆటగాడికి గాయం

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ఇంకా కొద్ది నెలలే ఉండగా, ఐదుసార్లు ఛాంపియన్ అయిన చెన్నై సూపర్ కింగ్స్‌కు అనుకోని ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవల జరిగిన ఐపీఎల్ వేలంలో రూ.14.2 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసిన అన్‌క్యాప్డ్ ఆల్‌రౌండర్ ప్రశాంత్ వీర్ గాయపడ్డాడు. రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్-సి మ్యాచ్‌లో జార్ఖండ్‌తో జరిగిన పోరులో ఫీల్డింగ్ చేస్తుండగా అతని భుజానికి గాయం అయింది. గాయం తీవ్రత కారణంగా మ్యాచ్ మధ్యలోనే అతను వైదొలగాల్సి వచ్చింది.

లక్నోలోని ఏకానా స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో, సీరియస్ ఇంజురీ రీప్లేస్‌మెంట్ నిబంధన ప్రకారం ప్రశాంత్ స్థానంలో ఎడమచేతి వాటం స్పిన్నర్ శివమ్ శర్మను ఉత్తరప్రదేశ్ జట్టులోకి తీసుకున్నారు. తాజా సమాచారం ప్రకారం ప్రశాంత్ వీర్ పూర్తిగా కోలుకోవడానికి కనీసం మూడు వారాల సమయం పట్టే అవకాశం ఉంది. అయితే ఐపీఎల్ మార్చి 26న ప్రారంభం కానుండటంతో, టోర్నీకి ముందే అతను ఫిట్‌నెస్ సాధిస్తాడని సీఎస్‌కే వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

ఈ సీజన్ నుంచే రంజీ ట్రోఫీలో అమల్లోకి వచ్చిన సీరియస్ ఇంజురీ రీప్లేస్‌మెంట్ నిబంధనను వినియోగించడం ఇది రెండోసారి. మరోవైపు ప్రశాంత్ స్థానంలో వచ్చిన శివమ్ శర్మ మంచి ప్రదర్శన కనబరిచాడు. ఇప్పటివరకు 18.5 ఓవర్లు బౌలింగ్ చేసి 66 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు కీలక వికెట్లు తీసి జట్టు ఆశలను నిలబెట్టాడు. ప్రశాంత్ గాయం నుంచి పూర్తిగా కోలుకుని ఐపీఎల్‌లో బరిలో దిగగలడా? లేదా అన్నది ఇప్పుడు సీఎస్‌కే అభిమానుల్లో ఆసక్తికర చర్చగా మారింది.



# స్మృతి మంధాన పెళ్లి రద్దు వెనుక సంచలన ఆరోపణలు.. కొత్త ట్విస్ట్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

టీమిండియా మహిళా క్రికెట్ స్టార్ స్మృతి మంధాన-మ్యూజిక్ కంపోజర్ పలాష్ ముచ్చల్ వివాహం అర్ధాంతరంగా రద్దు కావడం వెనుక షాకింగ్ ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ వ్యవహారంపై స్మృతి బాల్యమిత్రుడు విధాన మానే చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారి తీశాయి.

నవంబర్ 23, 2025న మహారాష్ట్రలోని సాంగ్లీలో వీరి వివాహం జరగాల్సి ఉండగా, పెళ్లి రోజే ముహూర్తం నిలిచిపోయింది. అప్పట్లో స్మృతి తండ్రి అనారోగ్యమే కారణమని ప్రచారం జరిగినా, అసలు విషయం వేరేనని ఇప్పుడు తెలుస్తోంది. పెళ్లి వేడుకల సమయంలో పలాష్ మరో యువతితో కలిసి రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయాడని విధాన మానే ఆరోపించారు. ఆ ఘటనతో అక్కడ ఉన్నవారంతా షాక్‌కు గురయ్యారని, పరిస్థితి ఉద్రిక్తంగా మారిందని ఆయన చెప్పారు. ఇంతటితో ఆగకుండా, పలాష్ తనను కూడా మోసం చేశాడని విధాన మానే వెల్లడించారు. సినిమా నిర్మాణం పేరుతో తన నుంచి రూ.40 లక్షలు తీసుకుని, ఇప్పటివరకు డబ్బులు తిరిగి ఇవ్వలేదని పేర్కొన్నారు. పెళ్లి రద్దు తర్వాత పలాష్ ఫోన్‌కూడా ఎత్తడం లేదని ఆరోపించారు. ఈ ఘటన స్మృతి కుటుంబాన్ని తీవ్రంగా కలచివేసిందని సన్నిహితులు చెబుతున్నారు. పెళ్లి భగ్నంతో మానసిక ఆవేదనకు గురైన స్మృతి తండ్రి ఆరోగ్యం మరింత క్షీణించిందని సమాచారం.



# మాత్రే మోత, కివీస్ కుదేలు..

**అండర్–19 ప్రపంచకప్‌లో సూపర్ సిక్స్‌కు భారత్**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**

పురుషుల అండర్-19 ప్రపంచకప్‌లో భారత జట్టు అజేయ పరంపర కొనసాగుతోంది. వర్షం కారణంగా 37 ఓవర్లకు కుదించిన కీలక మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను ఏడు వికెట్ల తేడాతో ఓడించిన భారత్ సూపర్ సిక్స్ దశకు అర్హత సాధించింది. డక్వర్త్-లూయిస్ పద్ధతిలో నిర్ణయించిన లక్ష్యాన్ని కేవలం 13.3 ఓవర్లలోనే ఛేదించి తమ ఆధిపత్యాన్ని మరోసారి చాటింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌ను భారత బౌలర్లు కట్టడి చేశారు. ఆర్ఎస్ అంబ్రిష్ (4 వికెట్లు) మరియు హెనిల్ పటేల్ (3 వికెట్లు) దెబ్బకు కివీస్ టాపార్డర్ పూర్తిగా కూలిపోయింది. పవర్‌ప్లేలోనే కీలక వికెట్లు కోల్పోయిన న్యూజిలాండ్ చివరకు 135 పరుగులకే పరిమితమైంది. ఆ జట్టులో సెల్విన్ సంజయ్ 28 పరుగులతో అత్యధిక స్కోరర్‌గా నిలిచాడు.

వర్షం అంతరాయం కారణంగా భారత్‌కు 130 పరుగుల లక్ష్యం నిర్దేశించారు. స్వల్ప లక్ష్య ఛేదనలో ఓపెనర్ అరోన్ జార్జ్ త్వరగా వెనుదిరిగినా, కెప్టెన్ ఆయుష్ మాత్రే జట్టును విజయదిశగా నడిపించాడు. కేవలం 27 బంతుల్లో 53 పరుగులు చేసిన మాత్రే, ఆరు సిక్సర్లతో కివీస్ బౌలర్లను బెంబేలెత్తించాడు. అతనికి వైభవ్ సూర్యవంశీ (40) చక్కటి సహకారం అందించాడు. మాత్రే ఔటైన తర్వాత విహాన్ మల్హోత్రా, వేదాంత్ త్రివేది ప్రశాంతంగా ఇన్నింగ్స్‌ను ముగించారు. ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా లక్ష్యాన్ని అందుకున్న భారత్ ఘన విజయం సాధించింది. అద్భుతమైన బౌలింగ్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పిన అంబ్రిష్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది



# బంగ్లా ఔట్.. స్కాట్లాండ్ ఇన్..

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

టీ20 ప్రపంచకప్-2026 టోర్నీ నుంచి బంగ్లాదేశ్ జట్టు నిష్క్రమించింది. భారత్‌లో తమ మ్యాచ్‌లు ఆడలేమంటూ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (BCB) తీసుకున్న మొండి వైఖరికి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ICC) గట్టి నిర్ణయం తీసుకుంది. బంగ్లాదేశ్‌ను టోర్నీ నుంచి తప్పించి, ఆ స్థానంలో స్కాట్లాండ్ జట్టును చేర్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుత టీ20 ర్యాంకింగ్స్‌ను ఆధారంగా చేసుకుని స్కాట్లాండ్‌కు ఈ అవకాశం కల్పించినట్లు ఐసీసీ వర్గాలు వెల్లడించాయి. గత కొంతకాలంగా భారత్-బంగ్లాదేశ్ మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు నెలకొనడం ఈ పరిణామాలకు నేపథ్యంగా మారింది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రహమాన్‌ను ఐపీఎల్ నుంచి తొలగించడంతో పాటు, టీమిండియా బంగ్లాదేశ్ పర్యటనను కూడా బీసీసీఐ నిరవధికంగా వాయిదా వేసింది. ఈ క్రమంలో టీ20 వరల్డ్‌కప్‌లో భాగంగా భారత్‌లో తమ మ్యాచ్‌లు ఆడలేమని బీసీబీ ఐసీసీకి తెలియజేసింది. భద్రతా కారణాలు చూపిస్తూ తమ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని కోరింది. అయితే, ఐసీసీ పరిశీలనా బృందం నివేదికల ఆధారంగా భారత్‌లో బంగ్లాదేశ్ జట్టుకు ఎలాంటి భద్రతా ముప్పు లేదని తేల్చింది. అయినప్పటికీ బీసీబీ తన నిర్ణయాన్ని మార్చుకోకుండా మొండి వైఖరినే కొనసాగించింది. గడువు ఇచ్చినా భారత్‌లో ఆడే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది.

చివరి ప్రయత్నంగా వివాద పరిష్కారాల కమిటీ (DRC)ని ఆశ్రయించిన బీసీబీకి అక్కడ కూడా ఊరట దక్కలేదు. ఐసీసీ ఆధ్వర్యంలోనే పనిచేసే డీఆర్సీ, ఈ విషయంలో జోక్యం చేసుకునే అవకాశం లేదని తెలిపింది. ఈ పరిణామాల నేపథ్యంలో, ముందుగానే హెచ్చరించినట్లుగా బంగ్లాదేశ్ స్థానాన్ని స్కాట్లాండ్‌తో భర్తీ చేసినట్లు క్రిక్‌బజ్ తన కథనంలో వెల్లడించింది. ఈ నిర్ణయాన్ని బీసీబీకి అధికారికంగా లేఖ ద్వారా ఐసీసీ తెలియజేసినట్లు సమాచారం. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు భారత్-శ్రీలంక సంయుక్త ఆతిథ్యంలో టీ20 వరల్డ్‌కప్ జరగనుంది. ఈ టోర్నీలో మొత్తం 20 జట్లు పాల్గొననున్నాయి. గ్రూప్-సిలో ఇంగ్లండ్, వెస్టిండీస్, నేపాల్, ఇటలీతో పాటు బంగ్లాదేశ్ ఉండగా, ఇప్పుడు ఆ స్థానంలో స్కాట్లాండ్ చేరినట్లు తెలుస్తోంది.





సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
25.01.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ప్రపంచ వింత : స్టోన్‌హెంజ్**

ఇది ఇంగ్లాండ్‌లో ఉన్న ఒక రహస్యమైన మరియు పురాతన శిలా కట్టడం. భారీ పరిమాణంలో ఉన్న రాళ్లను వృత్తాకారంలో అమర్చడం దీని ప్రత్యేకత. ఈ రాళ్లను దాదాపు 5,000 ఏళ్ల క్రితం నిర్మించారని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అంత భారీ రాళ్లను ఆ కాలంలో అంత దూరం నుండి ఎలా తెచ్చారనేది ఇప్పటికీ ఒక మిస్టరీ. ఇది ఖగోళ పరిశీలనలకు లేదా మతపరమైన ఆచారాలకు ఉపయోగపడేదని నమ్ముతారు.

## చిరు–బాబీ కాంబో మూవీ స్టోరీ బయటకు వచ్చేసిందా?

మెగాస్టార్ చిరంజీవితో సినిమా చేయడం ఏ దర్శకుడికైనా కెరీర్‌లో ప్రత్యేక ఘట్టమే. దాదాపు ఐదు దశాబ్దాలుగా తెలుగు సినీ పరిశ్రమకు ఎనలేని సేవలు అందిస్తున్న చిరంజీవి, ఇప్పటికీ కథల ఎంపికలో కొత్తదనాన్ని చూపిస్తున్నారు. ఆయనతో సినిమా చేస్తే దర్శకుడి స్థాయి మరింత పెరుగుతుందన్న అభిప్రాయం ఇండస్ట్రీలో ఉంది. ఈ నేపథ్యంలో 'వాల్తేరు వీరయ్య' వంటి సూపర్ హిట్ తర్వాత చిరంజీవి–బాబీ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనున్నట్లు చర్చ సాగుతోంది. గత చిత్రానికి వచ్చిన విజయమే ఈ కాంబోపై అభిమానుల్లో భారీ అంచనాలను పెంచింది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో చిరంజీవి వయసు పైబడిన పాత్రలో కనిపించనున్నారు. కథలో ఆయనకు ఒక కూతురు, ఒక సోదరి పాత్రలు కీలకంగా ఉంటాయని తెలుస్తోంది. కుటుంబ సంబంధాల చుట్టూ తిరిగే భావోద్వేగాలే కథకు ప్రధాన బలంగా నిలవనున్నాయన్న ప్రచారం ఉంది. ముఖ్యంగా ఇంటర్వెల్‌లో కూతురు పాత్ర కథను ఊహించని మలుపుకు తీసుకెళ్తుందని సమాచారం. ఆమె తండ్రిపై హత్యాయత్నం చేయడం వెనుక అసలు కారణమేంటి? ఆమె నిజంగానే ఆయన కూతురేనా? లేక కథలో దాగి ఉన్న ట్విస్ట్ ఏదైనా ఉందా? అనే ప్రశ్నలు ఆసక్తిని రేపుతున్నాయి. కూతురు పాత్ర నెగెటివ్ షేడ్స్‌తో రూపొందించారనే టాక్ కూడా వినిపిస్తోంది. కథాంశానికి సంబంధించిన లీకులు బయటకు రావడంతో అభిమానుల్లో మిశ్రమ స్పందన కనిపిస్తున్నా, కథలో కొత్తదనం ఉందన్న అంశం మాత్రం ఉత్సాహాన్ని పెంచుతోంది. ఇటీవల కుటుంబ పాత్రలో కనిపించిన చిరంజీవి, ఈ చిత్రంలో మాస్ అవతారంలో దర్శనమివ్వనున్నట్లు సమాచారం. ఫ్యామిలీ సెంటిమెంట్‌తో పాటు మాస్ ఎలిమెంట్స్‌ను మేళవిస్తూ రూపొందుతున్న ఈ సినిమా మెగా అభిమానుల అంచనాలను అందుకుంటుందా అన్నది వేచి చూడాలి.



'రాజాసాబ్' ఎఫెక్ట్.. మారుతిపై విమర్శలు..

## ప్రభాస్ అసంతృప్తి?

మీడియం రేంజ్ హీరోలతో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు మారుతి, టైర్ వన్ హీరో ప్రభాస్‌తో 'రాజాసాబ్' సినిమాను తెరకెక్కించాడు. భారీ అంచనాలతో విడుదలైన ఈ చిత్రం ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. దీంతో దర్శకుడు మారుతి తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్నాడు.ప్రభాస్ అభిమానులు ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. అయితే కథ, ట్రీట్మెంట్‌లో స్పష్టత లేకపోవడం, ప్రభాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా సినిమా రూపుదిద్దుకోకపోవడం వల్ల అభిమానుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. సోషల్ మీడియాలో ఈ సినిమాపై తీవ్ర ట్రోలింగ్ కొనసాగుతోంది.ఈ పరిస్థితిని గమనించిన ప్రభాస్, మారుతిపై అసంతృప్తి వ్యక్తం చేశారన్న ప్రచారం కూడా వినిపిస్తోంది. చెప్పిన కథకు, తెరపై వచ్చిన సినిమాకు మధ్య భారీ తేడా ఉందని ప్రభాస్ అభిప్రాయం వ్యక్తం చేశారనే టాక్ సినీ వర్గాల్లో చర్చకు దారి తీసింది. మారుతి చేసిన ప్రయోగం కొత్తదనంగా ఉన్నప్పటికీ, కథనంలో కన్ఫ్యూజన్ ఉండడం వల్ల సగటు ప్రేక్షకుడిని ఆకట్టుకోలేకపోయిందన్న విశ్లేషణలు ఉన్నాయి. స్టార్ హీరోలతో సినిమాలు తెరకెక్కించేటప్పుడు, కంటెంట్‌ను వారి ఇమేజ్‌కు తగ్గట్టుగా తీర్చిదిద్దడం కీలకమని ఈ ఉదంతం మరోసారి గుర్తు చేస్తోంది. అలా చేయలేకపోతే విమర్శలు తప్పవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. 'రాజాసాబ్'పై వస్తున్న విమర్శల నేపథ్యంలో, మారుతికి మళ్లీ స్టార్ హీరోల అవకాశాలు దక్కుతాయా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మూడేళ్ల పాటు సమయం వెచ్చించి రూపొందించిన ఈ సినిమా ఈ స్థాయి స్పందన పొందడం దర్శకుడికి పెద్ద దెబ్బేనని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇకపై మారుతి ఎలా తేరుకుంటాడు, మళ్లీ సక్సెస్ ట్రాక్‌లోకి వస్తాడా అన్నది ఆసక్తికరంగా మారింది.



## ప్రభాస్ ఇమేజ్‌ను హ్యాండిల్ చేయలేను

**డైరెక్టర్ కృష్ణవంశీ**



తెలుగు సినిమా పరిశ్రమ ప్రస్తుతం స్టార్ హీరోల చుట్టూనే తిరుగుతోంది. పాన్ ఇండియా స్థాయిలో తమ సత్తా చాటాలనే లక్ష్యంతో హీరోలు భారీ సినిమాలపై దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలో 'బాహుబలి'తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రభాస్, ఇండియన్ సినిమా స్థాయిని మరో మెట్టుకు తీసుకెళ్లాడు. నేడు ఆయన దేశవ్యాప్తంగా అత్యధిక క్రేజ్ ఉన్న హీరోగా కొనసాగుతున్నాడు.

ఇలాంటి పరిస్థితుల్లో ప్రభాస్ తన భవిష్యత్ సినిమాల విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. కథ, దర్శకుడు, స్కేల్ అన్నింటినీ పరిశీలించిన తర్వాతే నిర్ణయాలు తీసుకుంటున్నాడు.ఇక మరోవైపు, ఒకప్పుడు క్రియేటివ్ దర్శకుడిగా గుర్తింపు పొందిన కృష్ణవంశీ, ప్రభాస్‌తో 'చక్రం' చిత్రాన్ని తెరకెక్కించాడు. అయితే ఆ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో, వీరి కలయిక డిజాస్టర్‌గా మిగిలింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో "మళ్లీ ప్రభాస్‌తో సినిమా చేస్తారా?" అన్న ప్రశ్నకు కృష్ణవంశీ స్పందిస్తూ, ప్రస్తుత ప్రభాస్ ఇమేజ్‌ను తాను హ్యాండిల్ చేయలేనని వ్యాఖ్యానించారు. ఒకప్పుడు ప్రభాస్‌తో సినిమా చేసిన దర్శకుడే ఇప్పుడు ఆయన స్థాయిని నిర్వహించలేనని చెప్పడం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అదే సమయంలో, కృష్ణవంశీకి తన దర్శకుడిగా ఉన్న సామర్థ్యాన్ని మరోసారి నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్న అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. రెండేళ్ల క్రితం 'రంగ మార్తాండ'తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన కృష్ణవంశీ, ఈ ఏడాది మరో సినిమాతో అదృష్టాన్ని పరీక్షించుకోవాలని చూస్తున్నారు. అయితే మారుతున్న ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా సినిమాలు చేయకపోవడమే ఆయనకు వరుస విజయాలు దక్కకపోవడానికి కారణమన్న విశ్లేషణలు ఉన్నాయి. కొత్త చిత్రం ఆయనకు మళ్లీ గుర్తింపునిస్తుందా లేదా అన్నది వేచి చూడాల్సిందే.

## ఫౌజీ క్లైమాక్స్ విషాదాంతమేనా?

**హను రాఘవపూడి ప్రయోగంపై ఆసక్తికర చర్చ**

ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో ప్రభాస్‌కు ఉన్న క్రేజ్ ప్రత్యేకమైనది. బాలీవుడ్ హీరోలకూ ధీటుగా కాకుండా, వారిని మించే స్థాయిలో ఆయన సినిమాలు దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. అయితే ఇటీవల విడుదలైన 'రాజాసాబ్' ఆశించిన విజయాన్ని అందుకోకపోవడంతో ప్రభాస్ తన తదుపరి ప్రాజెక్టులపై మరింత జాగ్రత్తగా అడుగులు వేస్తున్నాడు.

ప్రస్తుతం సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో 'స్పిరిట్' చిత్రంలో నటిస్తున్న ప్రభాస్, హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందిన 'ఫౌజీ' సినిమా షూటింగ్‌ను ఇప్పటికే పూర్తి చేశాడు. ఆర్మీ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈ ఏడాది చివర్లో విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇందులో ఓ సున్నితమైన ప్రేమకథ కూడా కీలకంగా ఉండనుందట.

'సీతారామం'తో భావోద్వేగభరిత ప్రేమకథను ప్రేక్షకులకు అందించిన హను రాఘవపూడి, ఈ సినిమాలోనూ సాడ్ ఎండింగ్‌కు ప్రాధాన్యం ఇచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. హీరో లేదా హీరోయిన్‌లో ఎవరో ఒకరు మరణించే అవకాశం ఉందన్న ప్రచారం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి స్పష్టత రావాల్సి ఉంది.



ఇప్పటివరకు హను రాఘవపూడి చిన్న హీరోలతో విభిన్న ప్రయోగాలు చేసి విజయాన్ని అందుకున్నాడు. అదే తరహాలో ప్రభాస్‌తోనూ ఇలాంటి భావోద్వేగ ప్రయోగం చేస్తే ప్రేక్షకులు ఎలా స్వీకరిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఏది ఏమైనా, 'ఫౌజీ' ప్రభాస్ ఇమేజ్‌కు కొత్త కోణం జోడిస్తుందా? లేదా అన్నది సినిమా విడుదలతోనే తేలనుంది. ఈ చిత్రానికి సంబంధించిన కీలక అప్డేట్‌ను త్వరలోనే విడుదల చేయనున్నట్లు సమాచారం.

## నా నడుంపై చేయి వేశాడు.. వద్దన్నా వినలేదు..

**బాలీవుడ్ స్టార్ మౌనీ రాయ్ పోస్ట్...**

బాలీవుడ్ నటి మౌనీ రాయ్‌కు హరియాణాలోని కర్నాల్‌లో జరిగిన ఓ ఈవెంట్‌లో అసహ్యకర అనుభవం ఎదురైంది. ఫొటోలు తీసుకునే నెపంతో కొందరు వ్యక్తులు తన నడుముపై చేతులు వేసి అసభ్యంగా ప్రవర్తించారని ఆమె వెల్లడించింది. అభ్యంతరం వ్యక్తం చేసినా వారు వినలేదని, స్టేజ్‌పైకి వెళ్లిన తర్వాత కూడా అసభ్యకరమైన వ్యాఖ్యలు, సైగలతో వేధించారని తెలిపింది.

ఈ ఘటనపై ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా స్పందించిన మౌనీ రాయ్, మధ్యలోనే తన పెర్ఫార్మెన్స్ ఆపాల్సి వచ్చిందని, అయినా నిర్వాహకులు గానీ, అక్కడున్నవారు గానీ వారిని ఆపలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో కొత్తగా వచ్చే అమ్మాయిల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించగలనని పేర్కొంది



నువ్వు ఆంటీవి కాదు జ్యోతి...

## అప్సరసవు!

మరోసారి దుమ్మురేపేందుకు సిద్ధమవుతున్న జ్యోతి పూర్వజ్. 'కిల్ ఆర్®' సినిమాలో SIA – ద స్పైగా సరికొత్త అవతారం ఎత్తిన ఆమె, గ్లామర్‌కు గట్స్ జోడించి స్క్రీన్‌ను షేక్ చేయనుంది. మార్చిలో విడుదలకు రెడీ అవుతున్న ఈ హై-ఆక్టేన్ మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. స్పై అవతార్‌లో జ్యోతి చూపించే పవర్, స్టైల్ అభిమానులను ఉర్రూతలూగించనుంది.

శపించబడిన భూమి పురాణం..

## ఇదేంటి దేవరకొండ?

విజయ్ దేవరకొండ హీరోగా, దర్శకుడు రాహుల్ సంకృత్యాయన్ తెరకెక్కిస్తున్న VD14 సినిమా నుంచి కొత్త పోస్టర్ విడుదలైంది. టాప్ యాంగిల్ షాట్‌లో బీటలు వారిన నేలపై నడుస్తున్న జనాలతో పాటు 'The Legend of the Cursed Land' అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్ ఆకట్టుకుంటోంది. రిపబ్లిక్ డే సందర్భంగా జనవరి 26న సినిమా టైటిల్ రివీల్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. భూమి నేపథ్యంగా సాగే కథగా ఈ సినిమా ఉంటుందని సమాచారం.




Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com